గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక
రిపోర్టర్స్ కావలెను.
GTV GAUTHAM NEWS
9441735522
9849440951
అనతి కాలంలోనే విశేష ప్రజాదరణ పొందుతున్న గౌతమ్ న్యూస్ తెలుగు దినపత్రికకు మరియు Gtv లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు ,ఆర్ సీ ఇంఛార్జీలు, మండల విలేకరులు కావలెను.

# గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక

ప్రతి క్షణం ప్రజల కోసం...
24 X 7
GTV GAUTHAM NEWS
Voice of Truth...
GAUTHAM NEWS TV

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 130, ఎడిటర్,భీముడు నాయక్ పేజీలు : 12, వెల రూ. 1, శనివారం - 15- జూన్ - 2024
PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# రైతు బీమాకు ధీమా

- ప్రీమియం మొత్తం చెల్లించేలా సర్కారు అడుగులు
- గ్రామం యూనిట్గా పంటల బీమా
- కసరత్తు ప్రారంభించిన వ్యవసాయ శాఖ



హైదరాబాద్: గత పదేండ్లుగా అన్నదాత కోల్పోయిన భరోసాకు బీమా రూపంలో ధీమా రానుంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు ఊహించని విపత్తు తలెత్తితే రైతన్న ఆగమవుతున్నాడు. వాతావరణంలో మార్పుల మూలంగా ఎప్పుడు వర్షం కురుస్తుందో, ఏ రూపంలో తుఫాన్లు వస్తాయో, ఏ వైపు నుంచి వరదలు వచ్చి పంట నాశనమవుతుందో ఊహించని పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు అతివృష్టి మరోవైపు అనావృష్టి పరిస్థితులు%ొ%వెరసి రైతు పరిస్థితి అడకత్తెరలో పొక చెక్క మాదిరిగా తయారైంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీమేరకు రైతు బీమాతో అన్నదాతకు భరోసా కల్పించాలని నిర్ణయించింది. మొత్తం ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించి, తద్వారా రైతు బీమాను అందించాలని భావిస్తోంది. గ్రామం యూనిట్గా పంటల బీమాను రూపొందించేందుకు వ్యవసాయ శాఖ కసరత్తు చేస్తున్నది. అందుకనుగుణంగా నియమ నిబంధనలు రూపొందించేందుకు సిద్ధమవుతున్నది.

రైతు వాటా కూడా సర్కారే భరిస్తుంది

రాష్ట్రంలో అమలు చేసే పంటల బీమా పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలతోపాటు రైతులు చెల్లించాల్సిన మిగతా..2లో

## 3.0 : అవినీతి సైబర్ మోసాలపై ఫోకస్..
100 రోజుల ప్రచారాన్ని ప్లాన్



న్యూఢిల్లీ : అవినీతికి వ్యతిరేకంగా జీరో టాలరెన్స్ విధానానికి అనుగుణంగా, మోడీ ప్రభుత్వం తన మూడవ టర్మ్లో, డిజిటల్ స్పేస్తో సహా అన్ని రకాల అక్రమాలను అరికట్టడానికి తీవ్రమైన ప్రచారాన్ని ప్లాన్ చేసింది. మోడీ 3.0 యొక్క 100 రోజుల ఎజెండా తరహాలో,అవినీతి,సైబర్ మోసాలను అరికట్టడానికి ఎన్డిఏ ప్రభుత్వం ప్రత్యేక ప్రచారాన్ని ప్లాన్ చేసింది. ప్రత్యేక ప్రచారాన్ని త్వరలో అమలు చేయాలని భావిస్తున్నారు. 2024 ఎన్నికల ఫలితాల తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ తన మొదటి ప్రసంగంలో, తన మూడవసారి అవినీతికి సంబంధించిన అన్ని విధానాలపై ఆదర్శప్రాయమైన,శక్తివంతమైన చర్యలను చూస్తారని స్పష్టంగా చెప్పారు. ప్రత్యేక ప్రచారంలో భాగంగా, క్రెడిట్ కార్డ్లతో అనుసంధానించబడిన వాటితో సహా వివిధ రకాల సైబర్ మోసాలకు సంబంధించిన వినియోగదారుల ఫిర్యాదులను పరిష్కరించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తారు. 100 రోజుల ప్రచారంలో (మరణించిన) మిగతా..2లో

## తెలంగాణలో బడా కంపెనీ పెట్టుబడులు




హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి అనేక సంస్థలు బయటకు వెళ్తున్నాయని..ఆరు నెలల్లో ఒక్క సంస్థ కూడా రాలేదంటూ బిఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెక్ పెడుతూ వస్తుంది. తాజాగా మరో బడా కంపెనీ రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు వచ్చింది. మెడికల్ టెక్నాలజీలో ప్రముఖ అంతర్జాతీయ సంస్థగా పేరొందిన ఒలింపస్ కార్పొరేషన్ హైదరాబాద్లో తన ఆర్ అండ్ డీ ఆఫ్షోర్ డెవలప్మెంట్ సెంటర్ (ఓడీసీ) ఏర్పాటు చేసేందుకు సముఖత వ్యక్తం చేసింది.అమెరికాలోని న్యూయార్క్లో గురువారం కంపెనీ ఒలింపస్ కార్పొరేషన్ గ్లోబల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (ఆర్అండ్డీ) సయ్యద్ నవీద్ మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో భేటీ అయ్యారు. హెచ్సీఎల్ టెక్నాలజీస్ సంస్థతో కుదిరిన

## 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ త్వరలోనే నోటిఫికేషన్..!
ఏపీ సర్కార్ శుభవార్త




అమరావతి: కొత్తగా వచ్చే మెగా డీఎస్సీలో ఎస్జీటీలు-6371, పీఈటీలు -132, ఎస్ఏలు-7725, టీజీటీలు-1781, పీజీటీ-286, ప్రిన్సిపాల్స్-52 పోస్టులు ఉండనున్నాయి. అధికారికంగా నోటిఫికేషన్ రావాల్సి ఉంది.అయితే టీచర్ ఉద్యోగ అభ్యర్థులకు ఏపీలోని కొత్త ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన వెంటనే మెగా డీఎస్సీ దస్త్రంపై తొలి సంతకం చేశారు. ఇందులో భాగంగా.16,347 టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందుకు సంబంధించి త్వరలోనే కొత్త నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేసే ఛాన్స్ ఉంది!ఈ ఏడాది మొదట్లో వైసీపీ ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో భాగంగా 6,100 పోస్టుల భర్తీ చేస్తేందుకు సిద్ధమైంది. మిగతా..2లో

# వైఎస్ఆర్సీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లరా ?

### వెళ్తారా లేదా అన్నది సస్పెన్స్..!! వైఎస్ జగన్ వ్యూహం ఏమిటి ?



విజయవాడ : ఆంధ్రప్రదేశ్ లో కొత్త అసెంబ్లీ ఏర్పడింది. పార్టీల బలాబలాలు మారిపోయాయి. వైఎస్ఆర్సీపీ 151 స్థానాల నుంచి పదకొండు స్థానాలకు పడిపోయింది. ప్రతిపక్ష స్థానం కూడా లేదు. ప్రతిపక్ష నేత ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రతిపక్ష హోదా ఇవ్వరు. అసెంబ్లీలో సీట్లు కూడా చివరి వరుసలో కేటాయించే అవకాశం ఉంది. సీట్లు ఎక్కడ ఉండాలనేది స్పీకర్ ఇష్టం. అయితే గత అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యేలు, చంద్రబాబుకు చూపించిన అవమానాలు అన్నీ గుర్తు పెట్టుకుంటామని టీడీపీ చెబుతోంది. అంటే.. వైఎస్ఆర్సీపీ సభ్యులకు గడ్డు పరిస్థితి ఏర్పడుతుందని చెప్పాల్సిన పని లేదు. అసెంబ్లీలో తన కుటుంబాన్ని అవమానించినందుకే చంద్రబాబు సవాల్ చేసి బయటకు వచ్చారు. తర్వాత ప్రెస్ మీట్లో కన్నీరు పెట్టుకున్నారు. తమ అధినేతను, వారి కుటుంబాన్ని అంత తీవ్రంగా వేధించిన వారిని టీడీపీ సభ్యులు ఊరుకోరు. చాన్స్ వస్తే అంత కంటే ఎక్కువగా చేస్తారు. అదే వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఇబ్బందికరంగా ఉంటుందన్న అభిప్రాయం ఉంది. కుప్పం మున్సిపాలిటీలో వైసీపీ గెలిచినప్పుడు జగన్మోహన్ రెడ్డి.. చంద్రబాబు మొహం చూపిస్తారా అంటూ సెటైర్లు వేశారు. ఇప్పుడు ప్రతిపక్ష హోదా కూడా లేకుండా జగన్ సభకు వస్తే.. మిగతా టీడీపీ నేతలంతా అలాంటి మాటలే మాట్లాడే అవకాశం ఉంది.ఇక జగన్మోహన్ రెడ్డి రాజకీయంగా ఆగర్భ శత్రువుగా భావించే రఘురామకృష్ణరాజు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన కూడా సభకు వస్తారు. ఆయనకు స్పీకర్ పదవి ఇస్తారా లేదా అన్నదానిపై స్పష్టత లేదు. స్పీకర్ పదవి ఇస్తే జగన్ ఆయనను ఫేస్ చేయడం మరింత ఇబ్బందికరం. మిగతా..2లో

## 20వ తేదీ పవన్ కల్యాణ్ పిఠాపురం

పూల బొకేలు.. శాలువాలు తీసుకురావద్దు..

కార్యకర్తలకు జనసేనాని విజ్ఞప్తి..




మంగళగిరి: ఈ నెల 20వ తేదీ తర్వాత పవన్ కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గంలోని కార్యకర్తలను కలుస్తానన్నారు. ఆ తరువాత వివిధ దశల్లో గ్రామల్లో పర్యటిస్తాని చెప్పారాయన. ఇప్పటివరకు తనకు అభినందనలు అందించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.తనని కలవడానికి వచ్చే కార్యకర్తలు, అభిమానులు పూల బొకేలు, శాలువాలు తీసుకురావద్దని జనసేనాని, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ విజ్ఞప్తి చేశారు.

## ఉగ్రవాదుల్ని ఏరిపారేయండి - జమ్ముకశ్మీర్ ఉగ్రదాడులపై ప్రధాని



న్యూఢిల్లీ : జమ్ముకశ్మీర్లో కొనసాగుతున్న అలజడిపై ప్రధాని నరేంద్ర మోదీ ఆరా తీశారు. అక్కడి భద్రతపై సమీక్ష జరిపారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఉగ్రవాదులను ఎదుర్కొనేందుకు అవసరమైన సామర్థ్యాన్ని మరింతగా పెంచుకోవాలని అధికారులకు సూచించారు. గత నాలుగు రోజులుగా జమ్ముకశ్మీర్లో ఉగ్రదాడులు జరుగుతున్నాయి. భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయి.

## లోక్సభ స్పీకర్ పదవి ఎవరికి ? బీజేపీ వదులుకుంటుందా ?



న్యూఢిల్లీ : కేంద్రంలో గద్దెనెక్కిన ఎన్డీయే కూటమి పార్టీల మధ్య మంత్రి పదవుల పంపకాల ప్రక్రియ సాఫీగానే జరిగిపోయింది. ఇక కీలకమైన లోక్సభ స్పీకర్ పదవి వ్యవహారం మిగిలింది. ఆ పదవి ఎవరికి దక్కుతుందనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. స్పీకర్ పదవిని బీజేపీయే ఉంచుకుంటుందా ? ఆ పదవి కోసం ఆసక్తి చూపిస్తున్న టీడీపీకి కేటాయిస్తుందా ? లేదంటే వచ్చే ఏడాది అక్టోబరులో జరగనున్న బిహార్

# తెలంగాణ మహిళలకు గుడ్న్యూస్..

ఈ ప్రయోజనాలు తప్పక పొందండి!

మహిళా క్యాంటీన్లలో ఏం ఉంటుంది?

ప్రభుత్వం మనీ ఇస్తుందా?





హైదరాబాద్: మీరు తెలంగాణ మహిళ అయితే.. తప్పనిసరిగా ప్రభుత్వం మీకు కల్పించే ప్రతీ ప్రయోజనాన్నీ తెలుసుకోవాలి. తద్వారా అవి మిస్సవకుండా పొందగలరు. తద్వారా మహిళలు అభివృద్ధి చెందాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశం. తాజాగా ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. మహిళలు మరింతగా దూసుకెళ్లాలి అనే ఉద్దేశంతో.. కేరళ, బెంగాల్ ప్రభుత్వాల తరహాలో తెలంగాణలో కూడా.. మహిళా క్యాంటీన్లు తేవబోతోంది. అంటే వీటిని మహిళలే నిర్వహిస్తారు.

మహిళా క్యాంటీన్లలో ఏం ఉంటుంది?

మీకు ఐడియా ఉందిగా.. ఏపీలో అన్నా క్యాంటీన్లు మీకు తెలుసుగా. వాటిలో రూ.5కే భోజనం లభించేది. ఇదే విధంగా కేరళలో అన్న క్యాంటీన్లు, తెలంగాణలో దీదీ కా రసోయ్ క్యాంటీన్లు ఉన్నాయి. వీటి వల్ల పేదలు చాలా తక్కువ ధరకు నాణ్యమైన భోజనం, టిఫిన్ పొందుతున్నారు. అలాగే తెలంగాణలో కూడా పేద ప్రజలు ఇలాంటి బెనెఫిట్ పొందాలనీ, ఈ క్యాంటీన్లను మహిళలు నిర్వహించడం ద్వారా మహిళలు ఉపాధి అవకాశాలు పొందాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. ఆస్పత్రులు, ప్రభుత్వ ఆఫీసులు, పర్యాటక స్థలాలు, ఆలయాలు, బస్టాండ్లు, పారిశ్రామిక వాడల్లో మహిళలు ఈ క్యాంటీన్లు ప్రారంభించేలా ప్రభుత్వం చేస్తుంది. ఇలా తెలంగాణలో వచ్చే రెండు సంవత్సరాల్లో 150 క్యాంటీన్లు ఏర్పాటుచేసేలా చేస్తామని సీఎస్ శాంతికుమారి తెలిపారు.

ఈ క్యాంటీన్లను ప్రారంభించాలంటే.. మహిళల దగ్గర మనీ ఉండకపోవచ్చు కదా.. అందుకే ప్రభుత్వం.. స్వయంగా మనీ ఇచ్చి, వీటిని ప్రారంభించేలా చేస్తామని అంటోంది. ఇందుకు సంబంధించి త్వరలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ ఓ ప్లాన్ రెడీ చేయనుంది. బెంగాల్లో ఇలాగే మహిళలకు అక్కడి ప్రభుత్వం మనీ ఇచ్చింది. వారు 67 కేంద్రాల్లో దీదీ కా రసోయ్ క్యాంటీన్లు నిర్వహిస్తూ.. పేషెంట్లు, వారి సహాయకులకు మంచి ఆహారాన్ని తక్కువ ధరకు అందిస్తున్నారు. అదే విధంగా తెలంగాణలోని మహిళా స్వయం సహాయక బృందాలను పటిష్టం చేయడం, వారిని అన్ని రంగాలలో పురోగమించేలా చేయూతనిచ్చే చర్యల్లో భాగంగా ప్రభుత్వం ఈ కొత్త పాలసీని రూపొందిస్తోంది. ఈ క్యాంటీన్ల నిర్వహణను గ్రామ ఐక్య సంఘాలకు అప్పగిస్తామని సీఎస్ తెలిపారు. అంతేకాదు.. క్యాంటీన్ నిర్వహణపై గ్రామ ఐక్య సంఘాల సభ్యులకు ప్రత్యేక ట్రైనింగ్ కూడా ఇస్తామన్నారు. ఈ క్యాంటీన్లలో ధరలు ఎలా ఉంటాయి? అనేది సీఎస్ చెప్పలేదు. ప్లాన్ రెడీ చేసిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తారు. ఐతే.. ఈ ప్లాన్ ఎప్పటికి రెడీ అవుతుంది అనేది చెప్పలేదు. అందువల్ల మహిళలు రోజూ తెలంగాణ ప్రభుత్వాన్ని పరిశీలిస్తూ ఉండాలి. త్వరలో ఏదో ఒక రోజున అధికారిక ప్లాన్ వెల్లడిస్తారు.

## ఈ నెల 18న ఏపీ క్యాబినెట్ తొలి సమావేశం



రాష్ట్రంలో అధికార పీఠం సొంతం చేసుకున్న టీడీపీ కూటమి సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు

శాఖల కేటాయింపు అనంతరం బాధ్యతలు చేపట్టనున్న మంత్రులు

ఈ నెల 19న అసెంబ్లీ సమావేశం జరిగే అవకాశం

## లోక్‌సభ స్పీకర్ పదవి ఎవరికి ?
# బీజేపీ వదులుకుంటుందా ?

మొదటి పేజి తరువాయి

అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జేడీయూకు స్పీకర్ పదవిని కట్టబెడుతుందా ? అనే దానిపై సస్పెన్స్ నెలకొంది.బిహార్ సీఎం నితీశ్ కుమార్ రాజకీయ పార్టీ జేడీయూ కేంద్రంలో నాలుగైదు మంత్రి పదవులను కోరింది. ఆ పార్టీకి ఉన్న 12 మంది ఎంపీల బలం ఎన్డీయే కూటమికి కీలకంగా మారడంతో ఆయన ఈ రేంజులో పదవులను డిమాండ్ చేశారు. ఆయన కేవలం రెండు పదవులతో బీజేపీ సరిపెట్టింది. తమకు కనీసం లోక్‌సభ స్పీకర్ పదవినైనా ఇవ్వాలని బీజేపీ పెద్దలను నితీశ్ కోరుతున్నారట. టీడీపీకి 16 మంది ఎంపీల బలం ఉంది. సీట్ల సంఖ్యపరంగా జేడీయూ కంటే టీడీపీయే పెద్దది. ఈ లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే టీడీపీకి ప్రయారిటీ దక్కే అవకాశం ఉంది.గతంలోనూ ఓసారి లోక్‌సభ స్పీకర్‌పదవిని చేపట్టిన ట్రాక్ రికార్డు టీడీపీకి ఉంది. టీడీపీ నుంచి జీఎంసీ బాలయోగికి మాజీ ప్రధాని వాజ్‌పేయి (ఎన్డీయే) హయాంలో లోక్‌సభ స్పీకర్‌గా కీలక అవకాశం దక్కింది. మరోసారి ఆ అవకాశాన్ని టీడీపీకి మోడీ కల్పించినా ఆశ్చర్యం లేదని తెలుస్తోంది. జేడీయూతో పోలిస్తే టీడీపీని ఎన్డీయే కూటమికి నమ్మకమైన మిత్రపక్షంగా ప్రధాని మోడీ భావిస్తున్నట్లు సమాచారం. అందుకే స్పీకర్ పదవి రేసులో జేడీయూతో పోలిస్తే టీడీపీ ముందంజలో ఉందని అంటున్నారు. ఒకవేళ లోక్‌సభ స్పీకర్ పదవిని తమ వద్దే ఉంచుకోవాలని మోడీ భావిస్తే.. ఏపీ బీజేపీ ఎంపీ, పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి ఆ అవకాశం దక్కొచ్చనే ప్రచారం జరుగుతోంది. ఇంగ్లిష్, హిందీ సహా పలు భాషల్లో ఆమె చక్కగా మాట్లాడగలరు. గతంలో కేంద్రమంత్రిగానూ ఆమె సేవలు అందించారు. ఎన్టీఆర్ కుమార్తెగా పురందేశ్వరికి మంచి రాజకీయ నేపథ్యం ఉంది. అందుకే ఆమెకు లోక్‌సభ స్పీకర్ అయ్యే అన్ని అర్హతలు ఉన్నాయని రాజకీయ పండితులు అంటున్నారు.

## ఉగ్రవాదుల్ని ఏరిపారేయండి
# - జమ్ముకశ్మీర్ ఉగ్రదాడులపై ప్రధాని

మొదటి పేజి తరువాయి

ఇప్పటికే ఇద్దరు ముష్కరులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. పాకిస్థాన్‌కి చెందిన ఉగ్రవాదులే ఈ దాడులకు తెగబడుతున్నట్టు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఇప్పటికే కొందరి ఊహా చిత్రాలనూ విడుదల చేశారు. ఈ క్రమంలోనే మోదీ అక్కడి పరిస్థితులను సమీక్షించారు.ఈ భేటీలో అజిత్ దోవల్ మోదీ అక్కడి స్థితిగతులూ పూర్తి స్థాయిలో వివరించారు. సాయుధ బలగాలు ఈ దాడులను ఎదుర్కొనేందుకు ఎలాంటి చర్యలు చేపడుతుందో కూడా తెలిపారు. ఈ మేరకు మోదీ కొన్ని సూచనలు చేశారు. అవసరమైనతే భారీ మొత్తంలో సాయుధ బలగాలను మొహరించి ఉగ్రవాదుల్ని ఏరి వేయాలని ఆదేశించినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. దీనిపైనే మోదీ అమిత్ షాతో కూడా మాట్లాడారు. జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతోనూ ప్రధాని మోదీ మాట్లాడారు. స్థానిక అధికార యంత్రాంగం ఉగ్రదాడులను అడ్డుకునేందుకు ఎలాంటి చర్యలు చేపడుతోందో అడిగి తెలుసుకున్నారు. దొడ జిల్లాలో మరోసారి ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో ఓ సైనికుడు గాయపడ్డాడు. దొడ జిల్లాలో ఇలా దాడి జరగడం రెండోసారి. నాలుగు రోజుల్లో నాలుగు సార్లు జమ్ముకశ్మీర్‌లో కాల్పుల మోత మోగింది. జూన్ 9వ తేదీన రేసీ జిల్లాలో ఓ బస్సుపై ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ ఘటనలో 9 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఆ తరవాత భద్రతా బలగాలు ఉగ్రవేట మొదలు పెట్టాయి. కథువా జిల్లాలో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలోనే ఎన్‌కౌంటర్ జరిగింది. దొడలో ఎత్తైన పర్వతాల్లో నలుగురు ఉగ్రవాదులు నక్కి ఉన్నారు. అక్కడి వరకూ వెళ్లి వాళ్లను మట్టుబెట్టడం సవాల్‌గా మారుతోంది. చత్తర్‌గల్లా వద్ద వాళ్ల కోసం గాలిస్తుండగా ఉన్నట్టుండి భద్రతా బలగాలపై కాల్పులు జరిపారు ఉగ్రవాదులు. ఈ ఘటనలో రాష్ట్రీయ రైఫిల్స్‌కి చెందిన ఐదుగురు సైనికులతో పాటు ఓ సీనియర్ పోలీస్ అధికారి గాయపడ్డారు.

# తెలంగాణలో బడా కంపెనీ పెట్టుబడులు

మొదటి పేజి తరువాయి

వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందంలో భాగంగా ఒలింపస్ సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది.ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ఒలింపస్ కార్పొరేషన్ పెట్టుబడులకు ముందుకు రావడం తెలంగాణకు ఒక మైలురాయిగా పేర్కొన్నారు. కంపెనీకి పూర్తి సహాయసహకారాలు అందజేస్తామని, పెట్టబడులకు తెలంగాణను ఎంచుకోవడం చాలా సంతోషంగా ఉందని , స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు రానున్నాయని, అత్యాధునిక సాంకేతికతలతో పని చేయడానికి, వైద్య సాంకేతికతలో ప్రపంచ ఆవిష్కరణలకు దోహదపడే వేదికను అందిస్తుందని తెలిపారు. ఈ సంస్థ మరిన్ని పెట్టుబడులు, సహకారాలను ప్రోత్సహిస్తుందన్నారు.

# 20వ తేదీ పవన్ కల్యాణ్ పిఠాపురం

మొదటి పేజి తరువాయి

ఏపీ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తనని నేరుగా కలిసి అభినందనలు తెలపాలని జనసేన పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఆశిస్తున్నారన్నారు పవన్ కల్యాణ్. అయితే త్వరలో వారందరనీ కలుస్తానని అన్నారాయన.జిల్లాల వారిగా అందరినీ కలుస్తానని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తెలిపారు. రాజకీయ నాయకులు, మేధావులు, నిపుణులు, సినీ రంగంలోని వారు, యువత, రైతులు, మహిళలు, ఉద్యోగులు అభినందనలు తెలుపుతున్నారన్నారు పవన్ కల్యాణ్.ఇక జనసేన పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రత్యేకంగా చెప్పారు పవన్ కల్యాణ్. పార్టీ నాయకులు, జన సైనికులు, వీర మహిళలు ఆనందంతో వేడుకలు చేసుకుంటున్నారన్నారు.ఇక పిఠాపురం అసెంబ్లీ బరిలో నిలిచిన జనసేనాని సమీప వైసీపీ అభ్యర్థి వంగా గీతపై 70 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో ఘనవిజయం సాధించారు. అంతేకాకుండా ఇటీవలి జరిగిన ఎన్నికల్లో ఎన్డీయే కూటమిలో భాగంగా 21 సీట్లో పోటీ చేసింది. పోటీ చేసిన అన్ని స్థానాల్లో విజయం సాధించిన ఏకైక పార్టీగా జనసేన రికార్డు సృష్టించింది.

## జగన్ బొమ్మ ఉన్నా పర్లేదు
# కిట్లు పంపిణీ చేయండి

మొదటి పేజి తరువాయి

స్కూల్ బ్యాగులపై పార్టీ గుర్తులు ఉన్నప్పటికీ వాటిని సైతం పంపిణీ చేయాలని అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం స్కూల్ బ్యాగులను పార్టీ రంగులతో ముద్రించినా వృథా చేయకుండా విద్యార్థులకు అందజేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. కాగా, ఏపీలో నేటి నుంచి పాఠశాలలు ప్రారంభమయ్యాయి. దీంతో పాఠశాలలకు హాజరయ్యే విద్యార్థులకు ఇబ్బంది ఉండకుండా బ్యాగుల అందజేయాలని చెప్పినట్లు తెలుస్తోంది.నేటి నుంచి రాష్ట్రంలో పాఠశాలలు పున:ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఇప్పటికే ప్రభుత్వం నుంచి పాఠశాలలకు ఆదేశాలు జారీ చేశారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో విద్యా కానుక ద్వారా అందాంచే కిట్లను ఎప్పటిలాగే విద్యా సంవత్సరం ప్రారంభం రోజే అందజేస్తున్నారు.ప్రభుత్వం విద్యా కానుక కిట్ల కోసం రూ.700 కోట్లు వెచ్చించింది. ఈ మేరకు ప్రభుత్వ పాఠశాలలో చదివే 36 లక్షల మంది విద్యార్థులకు విద్యా కానుక కిట్లు పంపిణీ చేయనున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల సమయంలో టెండర్లు పిలవడంతో స్కూల్ బ్యాగులపై గుర్తులు ముద్రించలేదని అధికారులు తెలిపారు. వాస్తవానికి బుధవారం పాఠశాలలు పున: ప్రారంభం కావాల్సి ఉండగా.. కొత్త ప్రభుత్వ ఏర్పాటుతో ఒకరోజు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. గత కొంతకాలంగా కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం రోజే విద్యా కానుక కిట్లు అందజేస్తుండడంతో కొత్త ప్రభుత్వం కూడా అలానే పంపిణీ చేస్తుంది.

## కర్నాటక మాజీ సీఎం యడియూరప్ప
# నాన్ బెయిలబుల్ అరెస్ట్

కర్నాటక: పోక్సో కేసులో కర్ణాటక మాజీ సీఎం యెడియూరప్పపై బెంగళూరు ప్రత్యేక కోర్టు నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. త్వరలోనే ఆయనను సీఐడీ అధికారులు అరెస్టు చేసే అవకాశం ఉంది. ఈ కేసులో ఇప్పటికే యడ్యూరప్పకు సీఐడీ సమన్లు జారీ చేసి విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. ఢిల్లీలో ఉన్న మాజీ సీఎం యెడియూరప్ప ఢిల్లీ నుంచి తిరిగి బెంగళూరుకు వచ్చే అవకాశం ఉంది. 17 ఏళ్ల బాధిత బాలిక తల్లి ఫిర్యాదు మేరకు మార్చి 14న బెంగళూరు పోలీసులు యెడియూరప్ప పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.కర్నాటక మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యెడియూరప్ప పై లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం కేసును దర్యాప్తు చేస్తున్న క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్మెంట్ విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేసిందని, అవసరమైతే ఆయనను అరెస్టు చేయవచ్చని కర్ణాటక హోంమంత్రి జి.పరమేశ్వర గురువారం తెలిపారు. “ఈ కేసులో జూన్ 15 లోగా చార్జిషీట్ దాఖలు చేయాలి. అంతకంటే ముందు వారుచార్జిషీట్ దాఖలు చేస్తారు. అందుకు వారు విధివిధానాలను అనుసరించాల్సి ఉంటుంది. వారు అతని వాంగ్మూలాన్ని నమోదు చేసి (కోర్టులో) హాజరుపరచాలి” అని ఆయన వివరించారు. యెడియూరప్పను అవసరమైతే అరెస్టు చేస్తామని పరమేశ్వర ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. “అవసరమా, లేదా అని నేను చెప్పలేను, అది సీఐడీ చెప్పాలి. అవసరం అనుకుంటే ఆ పని చేస్తారు” అని పరమేశ్వర స్పష్టం చేశారు.పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడిగా ఉన్న బీజేపీ సీనియర్ నేత యడియూరప్ప ప్రస్తుతం ఢిల్లీలో ఉన్నారని, ఆయన తిరిగి వచ్చిన తర్వాత విచారణలో పాల్గొనే అవకాశం ఉందని ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 2న బెంగళూరులోని డాలర్స్ కాలనీలోని తన నివాసంలో జరిగిన సమావేశంలో తన 17 ఏళ్ల కుమార్తెపై యడియూరప్ప లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధిత బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో, యడ్యూరప్పపై పోక్సో చట్టం, ఐపీసీ సెక్షన్ 354 ఏ (లైంగిక వేధింపులు) కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సీఐడీకి కేసు బదిలీ

సదాశివనగర్ పోలీసులు ఈ కేసు నమోదు చేసిన కొన్ని గంటల్లోనే కర్ణాటక డీజీపీ అలోక్ మోహన్ తదుపరి దర్యాప్తు కోసం ఈ కేసును సీఐడీకి బదిలీ చేస్తూ మార్చి 14న ఉత్తర్వులు జారీ చేశారు. యడ్యూరప్పపై ఆరోపణలు చేసిన 54 ఏళ్ల మహిళ ఊపిరితిత్తుల క్యాన్సర్ కారణంగా గత నెలలో ఇక్కడి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మరణించారు. ఈ ఆరోపణలను ఖండించిన 81 ఏళ్ల యడియూరప్ప ఈ కేసును న్యాయపరంగా ఎదుర్కొంటానని చెప్పారు. ఏప్రిల్ లో యడ్యూరప్పను కార్యాలయానికి పిలిపించిన సీఐడీ ఆయన వాయిస్ శాంపిల్ ను సేకరించింది. ఈ కేసులో సీఐడీ తరఫున వాదనలు వినిపించేందుకు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అశోక్ నాయక్ ను ప్రభుత్వం నియమించింది. తనపై కేసును కొట్టివేయాలని కోరుతూ యడ్యూరప్ప ఇప్పటికే కోర్టును ఆశ్రయించారు.



మొదటి పేజి తరువాయి

# రైతు బీమాకు ధీమా

ప్రీమియం వాటాను రాష్ట్ర సర్కారే భరించనుంది. పరిస్థితులకు అనుగుణంగా స్కీమ్ అమలు మాత్రం రకరకాలుగా ఉండనుంది. అకాల వర్షాలతో పంటకు నష్టం జరిగితే ఒక విధానం బీమా వస్తుంది. కోత కోసి కల్లాల్లో ఉన్నప్పుడు అకాల వర్షాలతో నష్టం జరిగితే మరో విధంగా బీమా అందుతుంది. దిగుబడి చాలా స్వల్పంగా వస్తే ప[illegible]దించేందుకు మరో రకంగా ఉంటుంది. ఆయా గ్రామాల పరిస్థితులకు అనుగుణంగా స్కీము అమలు చేయాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. ఇలా పలు రకాలుగా క్రాప్ ఇన్సూరెన్స్ స్కీమ్లో వెసులుబాటు కల్పిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా క్రాప్ ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయనున్నారు. పంటల బీమా కోసం నిర్వహించే టెండర్లలో బీమా కంపెనీలు కోట్ చేసే ప్రీమియం ధరలను బట్టి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ఈ ప్రక్రియ వేగవంతంగా పూర్తి కావడానికి గైడ్ లైన్స్ రూపకల్పనకు తుదిరూపం ఇచ్చేందుకు సమాయత్తమవుతోంది.

ఈ వానాకాలం సీజన్ నుంచే రైతు బీమాను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో గైడ్ లైన్స్ సిద్ధం చేస్తున్నది. రాష్ట్రంలోని ప్రతీ గ్రామం యూనిట్గా, వివిధ రకాల అంశాలను పరిగణనలోకి తీసుకుని క్రాప్ ఇన్సూరెన్స్ అమలు చేయనుంది. రాష్ట్రంలో వానాకాలం సీజన్లో 1.32 కోట్ల ఎకరాల్లో పంటలు సాగవుతా యని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ప్రకృతి విపత్తులతో పంటలకు నష్టం జరిగితే రైతులకు పరిహారం అందేలా ఏర్పాట్లు చేస్తున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2019 నుంచి ఫసల్ బీమా పథకాన్ని నిలిపివేసింది. దీంతో గత ఐదేండ్లుగా పంటలు నష్టపోయిన రైతులు పరిహారం అందక తీవ్రంగా నష్టపోయారు. కాగా తాజాగా కొత్త సర్కారు ప్రతి ఏటా రూ.2 వేల కోట్ల ప్రీమియం అంచనా వేసింది. రైతు బీమా పథకం ప్రకారం రైతు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. రైతులు చెల్లించే బీమా ప్రీమియం వాటాను కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించేందుకు నిర్ణయించింది. దీంతో రైతులకు పైసా ఖర్చు లేకుండానే ఉచితంగా పంటల బీమా అందుబాటులోకి రానుంది. వ్యవసాయ శాఖ అంచనాల మేరకు వానాకాలం, యాసంగి సీజన్లకు కలిపి రూ.2 వేల కోట్ల ప్రీమియం ఇన్సూరెన్స్ కంపెనీలకు చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో రైతుల వాటా దాదాపు రూ.300 కోట్లు మేర ఉంటుందని అంచనాలున్నాయి.

## వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యేలు
# అసెంబ్లీకి వెళ్లరా ?

మొదటి పేజి తరువాయి

స్పీకర్ సార్ అంటూ ప్రసంగించాల్సి ఉంటుంది. సీఎం జగన్ మనస్థత్వానికి అది సాధ్యం కాదు. ఒక వేళ ఎమ్మెల్యేగా ఉన్నా పదకొండు మంది ఎమ్మెల్యేలతో కలిసి సభలో కూర్చుంటే ఆయన చేసే వెటకారాల్ని భరించడం కష్టం. అందుకే ఇప్పటి వరకూ జగన్ అసెంబ్లీకి ఖచ్చితంగా వెళ్తారన్నప్రకటన రాలేదు. అలాగని వెళ్లరని కూడా చెప్పడం లేదు. కానీ తమ శాసనసభాపక్ష నేతను కూడా ఎంపిక చేసుకోకపోవడంతో.. ఎమ్మెల్యేలు అందరూ అసెంబ్లీని బాయ్ కాట్ చేస్తారన్న అనుమానాలు కూడా వస్తున్నాయి.గతంలో జగన్ మోహన్ రెడ్డి అసెంబ్లీని బహిష్కరించిన చరిత్ర ఉంది. 2019లో ఎన్నికకు ప్రిపరేషన్ అయ్యేందుకు పాదయాత్ర చేశారు. ఆ పాదయాత్ర ప్రారంభించే ముందు ఆయన అసెంబ్లీని బాయ్ కాట్ చేశారు. తాను మాత్రమే కాదు.. తమ పార్టీ ఎమ్మెల్యేలు ఎవరూ అసెంబ్లీకి వెళ్లాల్సిన అవసరం లేదని తేల్చారు. తమ పార్టీ ఎమ్మెల్యేలను లాక్కున్నందుకు నిరసన అని చెప్పారు. ఈ సారి కూడా అలాంటి నిర్ణయం తీసుకోవచ్చని.. అంటున్నారు. అయితే ప్రమాణ స్వీకారానికి అయినా వెళ్తారా లేదా అన్నది సస్పెన్స్ గా మారింది.

## 16,347 పోస్టులతో
# మెగా డీఎస్సీ
# త్వరలోనే నోటిఫికేషన్..!

ఈ పోస్టుల్లో 2,280 సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ), 2,299 స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ), 1,264 ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు (టీజీటీ), 215 పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు (పీజీటీ), 42 ప్రిన్సిపాల్ పోస్టులు ఉన్నాయి.డీఎస్సీతో పాటే టెట్ నోటిఫికేషన్ కూడా ఇచ్చింది. వీటికి సంబంధించి షెడ్యూల్ ను కూడా ప్రకటించింది. అయితే టెట్, డీఎస్సీ పరీక్షల మధ్య సమయం లేకపోవటంతో కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో డీఎస్సీ పరీక్షల షెడ్యూల్ వాయిదా పడింది. వెంటనే కొత్త షెడ్యూల్ ను కూడా విద్యాశాఖ ప్రకటించింది. మరోవైపు టెట్ పరీక్షలను నిర్వహించింది. వీటికి సంబందించి ప్రాథమిక కీలు కూడా వచ్చాయి. ఇంతలోనే ఎన్నికల కోడ్ అమల్లోకి రావటంతో డీఎస్సీతో పాటు టెట్ ఫలితాల విడుదలకు బ్రేకులు పడ్డాయి. దీంతో అప్పట్నుంచి ఎన్నికల కోడ్ ఎత్తివేసే వరకు ప్రక్రియ అంతా ఆగిపోయింది.ఏపీ టెట్ ఫలితాల కోసం చాలా మంది అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరటంతో ఏ క్షణమైనా ఫలితాలను ప్రకటించే అవకాశం ఉంది.ఏపీ టెట్-2024 నోటిఫికేషన్ ను ఫిబ్రవరి 7న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఫిబ్రవరి 8 నుంచి ఫిబ్రవరి 18 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించింది. ఫిబ్రవరి 23 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఫిబ్రవరి 26న ప్రారంభమైన ఏపీ టెట్ పరీక్షలు మార్చి 9న ముగిశాయి. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం మార్చి ముందుగా విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం మార్చి 14న ఏపీ టెట్ ఫలితాలు విడుదల క్షావాల్సిఉంది. కానీ ఏపీలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావటంతో ఏపీ టెట్ ఫలితాలు విడుదలకు బ్రేక్ పడింది. దీంతో ఫలితాలు ఎప్పుడు విడుదల అవుతాయోనని అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. ఎందుకంటే ఫలితాలను బట్టీ డీఎస్సీకి ప్రిపేర్ అవ్వడంపై ఒక స్పష్టత వస్తుందని భావిస్తున్నారు.16వేలకు పైగా టీచర్ పోస్టులతో కూడిన దస్త్రంపై ఏపీ సీఎం చంద్రబాబు సంతకం చేసిన నేపథ్యంలో త్వరలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉంది. దీనికి సంబంధించి విద్యాశాఖ కీలక ప్రకటన చేసే ఛాన్స్ ఉంది. తెలంగాణలోనూ ముందుగా ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు చేసి పోస్టులను పెంచి కొత్త నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన పరీక్షలు జూలైలో నిర్వహించనున్నారు.

# 3.0 : అవినీతి
# సైబర్ మోసాలపై ఫోకస్..

మొదటి పేజి తరువాయి

ప్రభుత్వోద్యోగుల బంధువులకు కుటుంబ పింఛను మంజూరు చేయనందుకు సంబంధించిన ఫిర్యాదులు కూడా తీసుకోబడతాయి.అవినీతి,సైబర్ మోసగాళ్లను నిర్మూలించే చర్యలతో పాటు,ఫిర్యాదులను పరిష్కరించే యంత్రాంగాన్ని సున్నితంగా, ప్రజలకు అనుకూలంగా ఉండేలా చేయడానికి ప్రభుత్వం ప్రణాళిక వేసింది.వాట్సాప్, ఏ'ఐ' చాట్‌బాట్‌ల వంటి ప్రముఖ సోషల్ మీడియా సాధనాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. పౌరులు వాట్సాప్‌లో తమ ఫిర్యాదులు,ఫిర్యాదులను నమోదు చేయవచ్చు.పౌరులు ఫిర్యాదులు,ఫిర్యాదులను సులభతరం చేయడానికి మొబైల్ అప్లికేషన్‌ను కూడా ప్లాన్ చేస్తున్నారు.సైబర్ మోసం,అవినీతి కేసులపై అణిచివేతలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం డ్రైవ్‌కు ప్రధాన పునరుద్ధరణను ఇస్తుందని భావిస్తున్నారు. అధికారిక సమాచారం ప్రకారం,ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం గత కొన్ని సంవత్సరాలుగా చెప్పుకోదగ్గ అభివృద్ధిని సాధించింది.2019లో,సెంట్రల్ పోర్టల్‌లో నమోదైన ప్రజా ఫిర్యాదుల సగటు ముగింపు సమయం దాదాపు 28 రోజులు.ఇది 2024లో 10 రోజులకు తగ్గించబడింది.అలాగే,అధికారిక పోర్టల్‌లో పౌరుల ఫిర్యాదుల సంఖ్య 2022లో 19 లక్షల నుండి 2023 నాటికి 21 లక్షలకు పెరిగింది.

## ఎన్డీయే కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు మొదలైంది: పవన్ కల్యాణ్

### ఎన్నికల హామీల ఫైళ్లపై సంతకాలు
### ఏపీకి పునర్ వైభవం తీసుకువచ్చేందుకు తొలి అడుగులు పడ్డాయన్న పవన్



అమరావతి: సీఎం చంద్రబాబు ఇవాళ బాధ్యతలు చేపడుతూ, ఎన్నికల హామీల ఫైళ్లపై సంతకాలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై జనసేనాని, రాష్ట్ర మంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఎన్డీయే కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు మొదలైందని తెలిపారు. 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి సంబంధించిన మెగా డీఎస్సీ ఫైల్ మీద తొలి సంతకం చేశారని... ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తూ ఏపీ ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుపై రెండో సంతకం చేశారని వెల్లడించారు. సామాజిక పింఛన్లు రూ.4 వేలకు పెంచుతూ మూడో సంతకం చేశారని, ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లు పునరుద్ధరిస్తూ నాలుగో సంతకం... యువతలో నైపుణ్యాలు గుర్తించి వారికి బంగారు భవిష్యత్తు అందించేందుకు నైపుణ్య గణన ఫైలుపై అయిదో సంతకం చేశారని పవన్ కల్యాణ్ వివరించారు. సంక్షేమం-అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్రంలో ఎన్డీయే కూటమి పాలన సాగుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కు పునర్ వైభవం తీసుకువచ్చేందుకు తొలి అడుగులు పడ్డాయని స్పష్టం చేశారు.

# ఈ నెల 18న ఏపీ క్యాబినెట్ తొలి సమావేశం

### రాష్ట్రంలో అధికార పీఠం సొంతం చేసుకున్న టీడీపీ కూటమి
### సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు
### శాఖల కేటాయింపు అనంతరం బాధ్యతలు చేపట్టనున్న మంత్రులు
### ఈ నెల 19న అసెంబ్లీ సమావేశం జరిగే అవకాశం



అమరావతి: ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వం వచ్చిన సంగతి తెలిసిందే. నిన్న చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగా... పవన్ కల్యాణ్, నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, వంగలపూడి అనిత సహా 24 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఈ సాయంత్రం బాధ్యతలు స్వీకరించగా, మంత్రులు బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది. వారికి ఇంకా శాఖలు కేటాయించలేదు. రేపటిలోగా మంత్రులకు శాఖలు కేటాయించనున్నట్టు తెలుస్తోంది. కాగా, ఈ నెల 18న ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఏపీ క్యాబినెట్ తొలి సమావేశం జరగనుంది. ఈ నెల 19న అసెంబ్లీ సమావేశం నిర్వహించే అవకాశాలున్నాయి. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం, స్పీకర్ ఎన్నిక, బడ్జెట్ ఆమోదం కోసం లాంఛనంగా శాసనసభ సమావేశం నిర్వహించనున్నారు. అదే సమయంలో... ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు తదితర అంశాలను కూడా అసెంబ్లీలో చర్చించనున్నట్టు తెలుస్తోంది.

# గురుకులాల నిర్మాణం కోసం సీఎం సొంత నియోజకవర్గానికి రూ.73 కోట్ల మంజూరు

### ఉత్తర్వులు జారీ చేసిన బీసీ సంక్షేమ కార్యదర్శి బుర్రా వెంకటేశం
### బీసీ గురుకుల జూనియర్ కాలేజీ నిర్మాణానికి రూ.25 కోట్ల మంజూరు
### బీసీ గురుకుల పాఠశాల నిర్మాణానికి రూ.23 కోట్ల మంజూరు



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో బీసీ గురుకుల సంస్థల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.73.45 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కొడంగల్ ప్రాంత అభివృద్ధి సంస్థ పరిధిలో బీసీ గురుకుల జూనియర్ కాలేజీ నిర్మాణానికి రూ.25 కోట్లు, బీసీ గురుకుల పాఠశాల నిర్మాణం కోసం రూ.23.45 కోట్లు మంజూరు చేసింది. బొమ్రాసిపేట మండలం బురాన్ పేటలో బీసీ గర్ల్స్ గురుకుల పాఠశాల, కాలేజీ నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరు చేసింది.

# గొర్రెల పంపిణీ పథకం కుంభకోణంపై ఈడీ కేసు నమోదు




ఢిల్లీ: గొర్రెల పంపిణీ పథకం కుంభకోణంపై ఈడీ కేసు నమోదు చేసింది. ఏసీబీ కేసు ఆధారంగా ఈడీ దర్యాప్తును ప్రారంభించింది. మనీలాండరింగ్ చట్టం కింద ఈడీ... ఈసీఐఆర్ నమోదు చేసింది. గొర్రెల పంపిణీ పథకంలో రూ.700 కోట్ల అవినీతి జరిగిందని ఏసీబీ పేర్కొంది. కేసులో పదిమంది నిందితులను ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ కుంభకోణానికి సంబంధించి పూర్తి వివరాలు ఇవ్వాలని రాష్ట్ర అధికారులకు ఈడీ డైరెక్టరేట్ లేఖ రాసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద దీనిపై విచారణ చేపట్టనున్నామని రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్‌కు హైదరాబాద్‌లోని ఈడీ జోనల్ కార్యాలయం సంయుక్త సంచాలకుడు లేఖ రాశారు. ఈ పథకానికి సంబంధించి పూర్తి సమాచారం ఇవ్వాలని లేఖలో పేర్కొన్నారు.

## పాఠ్యపుస్తకాలు వెనక్కి...
# సీఎం రేవంత్ రెడ్డిపై దేశపతి శ్రీనివాస్ ఆగ్రహం

### 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినప్పుడు పాత పుస్తకాలనే కొనసాగించామని వెల్లడి
### ఇప్పుడు ముందుమాటలో కేసీఆర్ పేరు ఉండటాన్ని కాంగ్రెస్ ఓర్చుకోలేకపోతోందని విమర్శ
### భేషజాలు లేవని చెప్పే రేవంత్ రెడ్డి ఇప్పుడు చేస్తుందేమిటని నిలదీత



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠ్య పుస్తకాల్లో కేసీఆర్ పేరు ఉండటాన్ని కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేకపోతోందని... అందుకే వాటిని వెనక్కి తీసుకోవాలని ఆదేశించిందని విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం (నాడు టీఆర్ఎస్) వచ్చాక కొత్త పుస్తకాలు రూపొందించలేదని... పాత పుస్తకాలనే కొనసాగించామని గుర్తు చేశారు. నాడు ఉమ్మడి ఏపీలో ఉన్న సిలబస్‌నే చదువుకున్నారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఎడిటర్లు, ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి పేర్లు యథావిధిగా ఉన్నాయని తెలిపారు. కానీ, ఇప్పుడు ముందుమాటలో కేసీఆర్ పేరు ఉందని కాంగ్రెస్ ప్రభుత్వం ఓర్వలేకపోతోందని ధ్వజమెత్తారు. దాదాపు 2 కోట్లకు పైగా పుస్తకాలు వెనక్కి తెప్పించినట్లు తెలుస్తోందని... అలా చేయడమంటే ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే అన్నారు. ఇప్పుడున్న పుస్తకాలు మార్చాలంటే కొత్త కమిటీలను వేయాలని... కానీ ఇప్పటికిప్పుడు అలా వేయడానికి సమయం కూడా లేదన్నారు. వచ్చే ఏడాది పుస్తకాలను మార్చి... మీ పేర్లు పెట్టుకోవచ్చునని సూచించారు. విగ్రహాలు... గుర్తుల మార్పు అనే ధోరణిలో ముఖ్యమంత్రి ఉన్నారని విమర్శించారు. తమకు భేషజాలు లేవని చెప్పే రేవంత్ ఇప్పుడు చేస్తుందేమిటని ప్రశ్నించారు.

గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక
శనివారం - 15 - జూన్ - 2024

### ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా

## ఉత్తమ రక్తదాతకు సన్మానం



మెట్పల్లి(గౌతమ్ న్యూస్ ): పట్టణానికి చెందిన ఏనుగందుల ఉదయ్ కుమార్ మరియు తన మిత్ర బృందం 500 మందితో ఒక సమూహంగా ఏర్పడి ప్రజలకు ఉపయోగపడేలా ఏదైనా మంచి చెయ్యాలని ఉద్దేశ్యంతో రక్తదాన కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నట్లుగానే మెట్పల్లి, కోరుట్ల, జగిత్యాల, ఆర్మూర్, నిజామాబాద్, నిర్మల్, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ వంటి నగరాలలో సమాయంతో సంబంధం లేకుండా ఏ సమయంలో అయిన రక్తం అవసరం అని సమాచారం తెలియగానే తన మిత్రులతో ఒకరి నుండి మరొకరికి సమాచారం చేరవేసుకొని అనుకున్న సమయంలో రక్తదాతలను పంపి రక్తాన్ని అందించడం జరుగుతుంది. ఇప్పటివరకు రాష్ట్ర స్థాయిలో 3000 మందికి పైగా రక్తన్నీ అందించి ప్రాణధాతగా నిలిచారు. వీరి సేవలని గుర్తించి ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు జగిత్యాల పట్టణంలోని విరుపాక్షి గార్డెన్ లో ఉదయ్ కుమార్ గారిని సన్మానించి ప్రశంశ పత్రాన్ని అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి వెంకటేశ్వర్ రావు, డిఎంహెచ్ఓ ఇంచార్జ్ సమీఉద్దీన్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డా శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా ప్రవీణ్, పోషక ఆహార నిపుణులు రిచా శ్రీ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సెక్రెటరీ మంచాల కృష్ణ, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, జిల్లా ఉత్తమ రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు.

## ధరణి పెండింగ్ దరఖాస్తులను వారం రోజుల్లోగా పరిష్కరించాలి

### తెలంగాణ రాష్ట్ర సీసీఎల్ నవీన్ మిత్తల్.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్ ): కొత్తగూడెం కలెక్టరేట్ : ధరణి పెండింగ్ దరఖాస్తులపై శుక్రవారం ఉదయం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యపేట నల్గొండ జిల్లా కలెక్టర్లతో సీసీఎల్ నవీన్ మిత్తల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల,అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ తో కలిసి పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో ఎన్ని దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయి? తాజా దరఖాస్తులు ఎన్ని వచ్చాయి? ధరణి సమస్యల సమగ్ర వివరాలను సీసీఎల్(చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్) నవీన్ మిత్తల్ కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ధరణి సమస్యల పరిష్కరించేందుకు చేపట్టాల్సిన మార్గాలపై ఆయన తగిన సూచనలు చేశారు. పెండింగ్లో ఉన్న దరఖాస్తులన్నిటిని వారం రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల మాట్లాడుతూ జిల్లాలో 3851 ధరణి దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, జిల్లా యంత్రాంగమంతా పార్లమెంట్ మరియు పట్టభద్రుల ఉప ఎన్నిక ల విధుల్లో నిమగ్నమై ఉన్నందువలన దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. పెండింగ్ దరఖాస్తుల్లో 80 శాతం విచారణలు పూర్తి అయినయని, మిగిలిన 20 శాతం రానున్న రెండు రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. వారం రోజుల్లోగా పూర్తిస్థాయిలో దరఖాస్తులను పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ నందు అనంతరం కలెక్టర్ ఆర్డీవోలు, తాసిల్దార్లతో ధరణి పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ దరఖాస్తులన్నిటిని త్వరితగతిన విచారణ జరిపి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. రానున్న వారం రోజుల్లో ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు మధు, దామోదర్ రావు, డిఆర్ఓ రవీందర్ నాథ్,అన్ని మండలాల తాసిల్దార్లు మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ



టేకులపల్లి (గౌతమ్ న్యూస్ ): టేకులపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో ఎనిమిదవ తరగతిలో స్కాలరి షిప్ కోసం పెట్టినటువంటి ఎన్ ఎం ఎం ఎస్ ఎంట్రన్స్ టెస్టులో ప్రతిభ కనబరిచిన టేకులపల్లి ప్రభుత్వం ఉన్నత పాఠశాల విద్యార్థుల ఎం. తేజస్వి, ఎస్. మహేందర్, వి. గీతాంజలి, ఎస్. గురు చరణ్ లకు ప్రతినెల 1000 రూపాయల చొప్పున సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇంటర్ సెకండియర్ వరకు వస్తాయి. అట్టి ఎంట్రన్స్ టెస్టులో ప్రతిభ కనిపించిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, ఎం ఈ ఓ ఠాకూర్ రాంసింగ్ వారి యొక్క హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎం. రంగారావు, ఎం. మోహన్ రావు, కె. రాణి, వి. భారతి, జి. చందర్ సింగ్, ఎండి. మసుద్ అలీ, ఎం. రవీందర్, బి. సురేష్ పి. శేఖర్, జి. సీతమ్మ, ఎం. బాబురావు, కె. వి. సత్యనారాయణ, సిహెచ్. లెనిన్ బాబు, సిహెచ్ పద్మావతి ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## కార్మికులకు కనీసవేత నం 26,వేలుఇవ్వండి

### -జిల్లాకార్యదర్శి యాకుబ్ షావలి



టేకులపల్లి (గౌతమ్ న్యూస్ ): భారత కార్మిక సంఘాల సమైఖ్య ఇఫ్టు, టేకులపల్లి ఏరియా 4వ, మహాసభ టేకులపల్లి లో, వాంకుడోత్ నరేష్ అధ్యక్షతన జరిగింది,మహాసభ ముందు జెండా ఆవిష్కరణను ఐఎఫ్ టీ యూ జిల్లా నాయకులు కామ్రేడ్ జరుపుల సుందర్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి, ఎస్.కె యాకుబ్ షావలి పాల్గొని మాట్లాడుతూ సింగరేణిలో కోట్ల రూపాయలు లాభాలు వస్తున్నాయని ఈ లాభాలకు కారకులైన కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయటలేదన్నారు, కేఓ సి, 2003 బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైన నాటి నుండి నేటి వరకు బొగ్గు టిప్పర్ల ద్వారా, నవభారత్, కేటిపిఎస్, బిపిఎల్, ఇల్లందు, డంపింగ్ చేస్తున్న డ్రైవర్లకు కనీస వేతనాలు గానీ పిఎఫ్ గాని అమలు చేయడం లేదన్నారు.సీఎంపిఎఫ్ కోల్ ట్రాన్స్పోర్ట్ డ్రైవర్ లకు కన్వీనియన్స్ డ్రైవర్లకు అమలు చేస్తామని సర్కులర్ జారీ చేసి నేటి వరకు బొగ్గు టిప్పర్ డ్రైవర్లకు అమలు చేయలేదు. కన్వీనెంట్స్ డ్రైవర్లకు మాత్రం అమలు చేస్తుందన్నారు బొగ్గు టిప్పర్ డ్రైవర్లకు కూడా కనీస వేతనాలు పిఎఫ్ తదితర చట్టబద్ధహక్కులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి,గ్రామపంచాయతీ, భగీరథ తదితర రంగాల కార్మికులలో పనిచేసే కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాయం వెంకన్న ఏనుటి నాగయ్య.

## సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను పూర్తి చేయాలి

### ప్రజాసమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలి

### నియోజకవర్గ ముఖ్య అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

నందిగామ (గౌతమ్ న్యూస్ ): నియోజక వర్గంలో గత 5ఏళ్ళ నుండి ప్రజలు అనేక సమస్యలను



ఎదుర్కుంటు న్నారని, వీటిని అత్యవసరంగా గుర్తించి పరిష్కరించే దిశగా అధికారులు దృష్టి సారించాలని నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సూచించారు. శుక్రవారం తనను మర్యాదపూర్వకంగా కలిసేందుకు వచ్చిన అధికారాలతో మాధవి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో తన దృష్టికి వచ్చిన పలు ప్రజాసమస్యల గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వాటిని అత్యవసరంగా పరిష్కారించాలని సూచించారు. కొన్ని గ్రామాల్లో కలుషితనీరు సరఫరా అవుతుందని, సమస్యను పరిష్క రించాలని ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చారని, గతంలో మున్సిపల్ మంచినీటి పైపులైన్లలో కలుషిత డ్రైనేజి నీరు కలవడంతో అనేక మంది ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురయ్యారని, సౌమ్య గుర్తు చేశారు. ఇప్పుడు అలాంటి నిర్లక్ష్యాలు జరగటానికి వీలులేదని, వెంటనే దీనిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం పలువురు అధికారులు, రాజకీయ నాయకులు తంగిరాల సౌమ్య ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



# వారసత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

### జిల్లా కోర్టులో భూమిని చదును చేస్తున్న అధికార పార్టీ నాయకుడు

### బాధితురాలు తోట శ్రీలత



మానుకోట జిల్లా ప్రతినిధి(గౌతమ్ న్యూస్ ): వారసత్వంగా వచ్చిన భూమిని రాజకీయ నాయకులు కబ్జా చేశారని, ఇదేమిటని నిలదీస్తే తమ అనుచరులతో మహిళాని చూడ కుండా బెదిరింపులకు గురించేస్తున్నాడని బాధితురాలు తోట శ్రీలత ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ మహబూబాబాద్ పట్టణంలోని రామన్నపేట కాలనీలో నివాసం ఉంటున్నామన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని పాశివాగు ఇల్లందు బైపాస్ రోడ్డు బ్రిడ్జి పక్కన వారసత్వంగా సర్వే నెంబర్ 166 లో 17 గుంటల వ్యవసాయ భూమి ఉందని తోట శ్రీలత అదారాలు చూపించారు. మా యొక్క అవసరాల నిమిత్తం కోసం గతంలో కొంత భూమిని అమ్మడం జరిగింది. మిగిలిన వ్యవసాయ భూమి మా స్వాధీనంలో ఉందన్నారు. ఇట్టి భూమి విలువ పెరగడంతో ఈ స్థలం పై కన్నేసిన అధికార పార్టీకి చెందిన రాజకీయ నాయకుడు మా అమాయకత్వాన్ని, పేదరికన్ని ఆసరాగా చేసుకొని 2015 లో ఆక్రమించుకోవాలని ప్రత్నించగా అడ్డుకోవడం జరిగింది. అధికారులకు ఎన్నిమార్లు పిర్యాదులు చేసిన పట్టించుకోలేదు. దీంతో భూమి హక్కు అదారాలతో మహబూబాబాద్ జిల్లా కోర్టులో పిటిషన్ దాఖాలు చేసినట్లు చెప్పారు. దీంతో కోర్టు అదీనంలో సర్వే నెంబర్ 166 లో భూమిపై కమీషన్ నియమించారు. అట్టి కమీషన్ అధికారులు సర్వే చేసి అట్టి పత్రాలను కోర్టుకు సమర్పించారు. ప్రస్తుతం సదరు భూమి కేసు మహబూబాబాద్ జిల్లా కోర్టులో కొనసాగుతుండగా, బతుకుదెరువుకాని వేరే ప్రాంతానికి వెళ్ళింది చూసి ఇదే అదునుగా బావించిన వెంకటేశ్వర్లు అదే ప్రాంతంలో ఉన్న పాశివాగు ప్రభుత్వ భూమిని ఆక్రమించి సైదు వాల్ కడుతున్న విషయం తెలిసి వచ్చి చూస్తే ప్రభుత్వం భూమితో పాటు కోర్టులో ఉన్న భూమిని కలిపి చదును చేశాడు. ఇదేమిటని పనులను అడ్డుకుంటే అధికార పార్టీ నాయకుని కొడుకు, అతని అనుచరులతో మహిళా అని చూడకుండా దుర్భషాలాడుతూ బెదిరింపులకు గురించేస్తూ నాపై, ఈ భూమి వైపు వస్తే మీ అంతు చూస్తానంటూ బెదిరింపులకు గురు చేశాడని ఆవేదన వ్యక్తం చేసింది. దౌర్జన్యంగా భూమిని ఆక్రమించి బెదిరింపులకు గురిచేస్తున్న అధికార పార్టీకి చెందిన జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని మహబూబాబాద్ పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేసినట్లు బాధితురాలు తోట శ్రీలత చెప్పారు. సర్వే నెంబర్ 166, ఇల్లందు రోడ్డులో గల భూమి గురించి జన్నారెడ్డి వెంకటేశ్వర్లు ని వివరణ కోరగా అట్టి భూమిని తోట వెంకన్న తండ్రి అయినా గూబ్బేలి అమ్మారు అని, నేను ఎలాంటి భూమిని ఆక్రమించలేదని, వారి 17 గుంటల భూమిలో 10 గుంటలు రోడ్డు కింద పోయింది. మిగతా ఏడు గుంటలు రోడ్డు అవతల ఉత్తరం దిక్కులో ఉన్నది. కాని వారు దక్షిణం దిక్కుకి వచ్చి నాది అని అనడం సబ్బబు కాదు. గత 8 సంవత్సరాల క్రితం నాది అధికార పార్టీ కాదు కానీ వారు అధికార పార్టీ అని నాపై ఇప్పుడు ఆరోపణలు చేస్తూ, పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఏమైనా భూమి సమస్య ఉంటే కోర్టులో తేల్చుకుందాం అనే చెపితే, వారు చిన్న కోర్టులో కేసు ఊడిపోయి, అప్పీలుకు వెళ్లడం జరిగింది అని వివరణ ఇచ్చారు.

# హత్యకు కారకులు ఎవరు!!

### నిద్రపోని పోలీసులు!

### లక్ష్మీపల్లి గ్రామంలో పోలీసుల నిఘా!!

నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో (గౌతమ్ న్యూస్ ): జిల్లా వనపర్తి, నియోజకవర్గం కొల్లాపూర్ లోని చిన్నంబాయి మండలం



లక్ష్మీ పల్లి గ్రామంలో గత నెల 13 తారీకు రోజు జరిగిన టిఆర్ఎస్ పార్టీ నాయకుడు శ్రీధర్ రెడ్డి దారణ హత్య కు కారకులు ఎవరు !! ఒకపక్క అధికార కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష పార్టీ అయిన టిఆర్ఎస్ పార్టీ మధ్యన ఆ సమయంలో జరిగిన మాటల యుద్ధం రాజకీయ హత్యగా టిఆర్ఎస్ పార్టీ ఆరోపిస్తున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ హత్యకు సంబంధం లేదని ప్రస్తుత రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు కొట్టి పడేశారు, దేనికైనా సిద్ధం అంటూ సవాల్ విసిరారు, ఆ సమయంలో టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఐటీ శాఖ మంత్రి కేటీ రామారావు, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, టిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, లేనిపోని ఆరోపణలు అధికార కాంగ్రెస్ పార్టీ పైన స్థానిక ఎమ్మెల్యే మంత్రి జూపల్లి కృష్ణారావుపైన బురదలినప్పటికీ ఇప్పటికీ కూడా నేరస్తులు ఎవరన్న సంగతి బయటపడలేదు, హత్య జరిగిన, దోపిడి జరిగిన అత్యాచారాలు జరిగిన వనపర్తి జిల్లా ఎస్పీ రక్షితమూర్తి డిఎస్పి వెంకటేశ్వరరావు, వనపర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగభూషణరావు, ఎప్పటికప్పుడు రాజకీయాలక కచ్చితంగా నేరస్తులను అరెస్ట్ చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు, కానీ కొన్ని దురదృష్టవశాత్తు కొల్లాపూర్ నియోజక వర్గంలో జరిగిన హత్యలు అంతుచిక్కకుండా పోవడానికి ప్రధాన కారణం ఆ నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల నాయకులు ప్రజలు బయట పెట్టకుండా ఒక వ్యక్తిని చంపడానికి కుట్ర పన్నుతున్నారని ఎలాంటి సాక్షాలు లేకుండా కేసు లేకుండా తప్పుదో పట్టించడానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి, ముందుగానే పకడ్బందీ ప్రణాళికతోన వ్యక్తులను చంపడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ పోలీసులకు అంతుచిక్కకుండా పోతున్నాయని హాయ్ నియోజకవర్గంలో ప్రజలు అంటున్నారు, హత్యకు కారకులు ఎవరైనాప్పటికీ పోలీసులు సమగ్రమైన విచారణ జరిపించి నేరస్థులు అరెస్ట్ చేసిన అవసరం ఎంతైనా ఉంది, కానీ నెలరోజులు కావస్తున్నప్పటి కూడా టిఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీధర్ రెడ్డి హత్య పైన కేసు మిస్టరీగా మిగిలిపోయింది, అత్తకు సంబంధించిన ఇన్విటేషన్ అధికారి వనపర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగభూషణరావు హత్య జరిగిన రోజు నుంచి ఎన్ని ప్రయత్నాలు చేసిన కూడా ఫలితం లేకుండా పోతుంది, హత్య కేసులో అన్యాయంగా ఒకరిని బలి చేయకూడదని సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగభూషణరావు పదేపదే చెబుతూ ఉన్నది ఉన్నట్లు లేనిది లేనట్లు మాట్లాడే వ్యక్తిగా వనపర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ గా ఆయనకు పేరు ఉంది, అలాంటి పోలీసుల పైన బురద చల్లడం ఆరోపణలు చేయడం భావ్యం కాదని ప్రజలంటున్నారు, ఒక రకంగా హత్య అయినప్పటికీ అందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఆ గ్రామ ప్రజలు కుటుంబ సభ్యులు సమాచారం ఇవ్వాలి కానీ ఎక్కడ కూడా సమాచారం దొరకకుండా టీఆర్ఎస్ పార్టీ నాయకుడిని ఎందుకు దారుణంగా చంపినారు అన్న సంగతి టిఆర్ఎస్ పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు, ఆ పార్టీ నాయకులు ఇప్పటికి ఎందుకు మౌనం వహిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి, ఒకవేళ రాజకీయ హత్య అయితే టిఆర్ఎస్ పార్టీ నాయకులు బహిరంగంగా బయటపెట్టాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు, అధికార కాంగ్రెస్ పార్టీ హత్య రాజకీయాలకు పాల్పడితే టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు, ఇది కేవలం రాజకీయ హత్య నా వ్యక్తిగత హత్యనా అనే కోణంలో పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నారు, ఎప్పుడైనా కూడా ఏ హత్య జరిగిన కూడా ఏ దొంగతనం జరిగిన , అత్యాచారం జరిగిన, పోలీసులు ఎప్పటికప్పుడు నేరస్థులను అరెస్టు చేస్తున్నారు, టిఆర్ఎస్ పార్టీ నాయకులు హత్య కేసులో పురోగతి సాధించిన పోలీసుల పైన విమర్శలు వస్తున్నాయి, అయినా ఒక్కసారి కూడా ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలని హత్య కేసును ఎట్టి పరిస్థితుల్లో కూడా వదిలిపెట్టే ప్రసక్తి లేదని ఏదో ఒక రోజు హత్య కేసు పురోగతి సాధించక తప్పదని ఇన్విస్టేషన్ అధికారి వనపర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగభూషణం చెప్పారు, పోలీసుల పైన అనవసరమైన అబండాలు ఆరోపణలు చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు, చట్టానికి ఎవరు చుట్టం కాదు ఎవరి వదిలిపెట్టం అది గుర్తుపెట్టుకోవాలని ఆయన సూచించారు, సమయనం పాటించాలని ఆయన పిలుపునిచ్చారు,

# సమ సమాజ స్థాపనే లక్ష్యంగా ముందుకు సాగుదాం

## సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

### మతోన్మాదపు విష భావజాలం నుండి దేశాన్ని కాపాడుకోవాలి ప్రొ.ఖాసీం.

### ప్రారంభమైన సీపీఐ జిల్లా రాజకీయశిక్షణా తరగుతులు.




భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి.(గౌతమ్ న్యూస్ ): పాల్వంచ: దేశంలో నానాటికీ గతి తప్పుతున్న, మితిమీరిన పరిస్థితులు గాడిలో పడాలన్నా, పురోగమన ఆధునిక భారతాన్ని చూడాలన్నా మార్క్సిజ సిద్ధాంతం ఒక్కటే దిక్కని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ కేంద్రంగా రెండు రోజుల పాటు జరుగుతున్న సిపిఐ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగుతులను ఆయన మొదటి రోజైన శుక్రవారం సిపిఐ జెండా ఎగురవేసి ప్రారంభించారు. అనంతరం జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ మానవునికి మెరుగైన జీవన విధానాన్ని అందించగలిగేది మార్క్సిజం మాత్రమే అని, సామాజిక ఆర్థిక అసమానతలను రూపుమాపి సమ సమాజ స్థాపన జరగాల్సిన



అవసరం ఎంతైనా ఉందన్నారు. భారతదేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామిక భావాలను, ప్రజల సాంఘీక సమానత్వం, సాంస్కృతిక జీవవైవిద్యాన్ని కాపాడాల్సిన బాధ్యత కమ్యూనిస్టులమైన మనపై ఉందన్నారు. శతాబ్ధపు విప్లవోధ్యమంలో అనేక ఎత్తు పల్లాలలను కమ్యూనిస్టు పార్టీ చవి చూసిందని, ఆ నాటి నుండి నేటి వరకు పీడిత తాడిత ప్రజలకు అండగా ఎర్ర జెండా నిరంతరం ఎగురుతూనే ఉందన్నారు. అధికారం ఉన్నా, లేకున్నా, పదవులు ఉన్నా లేకపోయినా ప్రజలను ఏకం చేసి ప్రభుత్వాల ధ్వందనీతిని ఎండగడుతూ ముందుకు సాగడమే కమ్యూనిస్టు నిజమై సిద్ధాంతం అన్నారు. మతం, కులం, వర్గ, వర్ణ పేరుతో భారతదేశ సామాజిక వ్యవస్థ గతి తప్పిందని, దానిని గాడిలో పెట్టి సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు పనిచేయాలన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రజలపై పెత్తనం చెలాయిస్తోందని, వ్యక్తిపూజ పెరిగిందని, సిద్ధాంతాలను ప్రక్కనబెట్టి స్వార్థపూరిత రాజకీయ వ్యవస్థను తయారు చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి పరిస్థితులను శాస్త్రీయపద్ధతుల్లో ఎదుర్కోవాలని, ఇందుకోసం కమ్యూనిస్టులు అనునిత్యం ప్రజల్లో ఉంటూ వారిని చైతన్య పర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశంలో మతం పేరిట రాజకీయ రాజ్యం ఏర్పడిందని, మతోన్మాదులు చేతుల్లో భారతదేశం కీలుబొమ్మగా మారిపోయిందని, ప్రజా శ్రేయస్సు, మౌళిక వనరుల కల్పన కంటే గుళ్లు గోపురాలకు ప్రాధాన్యత ఇస్తు ప్రజల మెదళ్లను కాషాయమయం చేస్తున్నారని, అదికాదని వాదించిన వారిని దేశద్రోహులుగా చిత్రీకరిస్తూ మానప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రాజకీయ శిక్షణా తరగతుల ద్వారా చైతన్యవంతులై పురోగమించాలన్నారు. సామాజిక విషభావాజాలం నుండి దేశాన్ని కాపాడుకోవాలి ప్రొ.ఖాసీం /// విషభావాజాలాన్ని సమాజంలో చొప్పిస్తున్నారని, దానిని దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రొఫెసర్ ఖాసీం అన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులకు ఆయన మొదటి రోజు వక్తగా హాజరై కులం-మతం- వర్గపోరాటం అనే అంశంపై బోధించారు. పాశ్చాత్య దేశాల్లో ఎక్కడా కులం, మతం వ్యవస్థ కనిపించదని, కేవలం ఒక్క భారతం దేశంలోనే ఈ దుస్థితి ఉందన్నారు. అక్కడ మనుష్యులంతే సమానమే అని, కానీ ఇక్కడ కులం, మతం, వర్గం, వర్ణం అంటూ తప్పుడు పద్దతులను బలవంతంగా రుద్ది కొందరు స్వార్థపూరిత మతవాదులు పబ్బం గడుపుకుంటున్నారని చెప్పారు. మనువాద ప్రభావం దేశభవిష్యత్తు అత్యంత ప్రమాదకరమని, మతం పేరుతో ఏర్పడిన శక్తులు పెట్టుబడి దారీ వర్గాన్ని పెంచిపోషిస్తూ అధికారమే లక్ష్యంగా వ్యవస్థను నాశనం చేస్తున్నారన్నారు. మతం కేవలం మానవుల సృష్టే అని, భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ స్థాపించబడిన తర్వాత ఇక్కడి పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని, సమాజంలో అనేకమైన రుగ్మతలను ఆ నాటి పార్టీ చర్చించిందని, దీనిపై సరైన పద్దతిలో ముందుకు సాగాలని నిర్ణయించి 1988వ సం.లో మొదటి సారిగా కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా కులంపై చర్చ జరిపిందని స్పష్టం చేశారు. వెట్టిచాకిరీకి గురవుతున్న సామాజిక వర్గాన్ని గుర్తించి వారిని చైతన్య పరిచేందుకు పెద్ద ఎత్తున పోరాటాలు శ్రీకారం చుట్టిందన్నారు. ఎస్సి,ఎస్టి,బిసి, మైనార్టీలు ఏకమైన నాడే, మత వ్యవస్థ నిర్మూలన జరిగిన నాడే సరైన సమాజం ఏర్పడుతుందని, ఇందు కోసం మేధావులు, యువకులు, విద్యావంతులు, కమ్యూనిస్టులు ముక్తకంఠంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని చెప్పారు. అనంతరం సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు నూతన సవాళ్లు- పార్టీ నిర్మాణంపై మాట్లాడారు. నూతన లేబర్ కోడ్లపై ఎం.డీ. యూసఫ్, భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రపై ప్రొ. యుగల్ రాయలు మాట్లాడారు. నరాటి ప్రసాద్ ప్రిన్సిపల్గా వ్యవహరించిన తొలిరోజు శిక్షణా తరగతుల్లో సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాష, రాష్ట్రకార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య, రాష్ట్రసమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, మున్నా లక్ష్మీ కుమారి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి బ్రహ్మం, సరెడ్డి పుల్లారెడ్డి, ఎస్ఓ సలీం, చంద్రగిరి శ్రీనివాసరావు, కమటం వెంకటేశ్వరరావు, సలిగంటి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, చంద్ర నరేంద్రకుమార్, దేవరకొండ శంకర్, మండల, పట్టణ కార్యదర్శులు వీశంశెట్టి పూర్ణచంద్రరావు, అడుమిల్లి సాయిబాబా, గుండెపిన్ని వెంకటేశ్వరరావు, భుక్యా ధస్రు, డి సుధాకర్, పద్మానాభరాజు, గుగులోత్ రామచందర్, బంధం నాగయ్య, బొర్రా కేశవులు, జి. రామకృష్ణ, ఉయికే నారాయణ, ఎండి యూసఫ్, పి సతీష్, ధర్మ, వాగబోయిన రమేష్, అనంతనేని సురేష్, మువ్వ వెంకటేశ్వరరావు, జిల్లా సమితి సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగకూ అన్నీ ఏర్పాటు చేయాలి



మెట్టుపల్లి **(గౌతమ్ న్యూస్ ):** ఈ నెల 17నుండి 19 వరకు జరిగే బక్రీద్ పర్వదిన సందర్భంగా మెట్పల్లి పట్టణం లో మున్సిపల్ తరపున చేయవలసిన ఏర్పాట్లపై కమిషనర్ టీ.మోహన్.. ను శుక్రవారం రోజున వినతి పత్రం అందజేశారు.. బిస్మిల్లా మజీద్ లో కుర్బానీ చేసిన అనంతరం వ్యర్థ లను మున్సిపల్ వాహనం ద్వారా తరలించాలని ఆదేశించారు.. మజీద్ లోపల పరిశుద్ధ పనులు పూర్తి చేయాలని కోరారు.మరియు . బ్లీచింగ్ పౌడర్ చెల్లించగలరు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రావు ఫ్. మదర్శ అధ్యక్షులు జావిద్.. ఎజాస్.. మతిన్.. అప్సర్. తదితరులు పాల్గొన్నారు

## జర్నలిస్టులకు పది రోజుల్లో కొత్త అక్రిడేషన్ కార్డులు ఇస్తాం

### భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రియాంక అల



అన్నపురెడ్డిపల్లి**(గౌతమ్ న్యూస్ ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీ డబ్ల్యూ జె ఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ ను కలిసి జర్నలిస్టులకు అక్రిడేషన్ మంజూరు చేయాలని వినతి పత్రని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులతో కలెక్టర్ మాట్లాడుతూ డిపిఆర్ఓ లేకపోవడం వల్ల కొంత జాప్యం జరిగిందని,మరో పది రోజుల్లో కొత్త అక్రిడేషన్ కార్డులు మంజూరు కి ఆదేశాలు ఇస్తామన్నారు. గతంలో అక్రిడేషన్ కార్డులు జారీలో కొంత సమస్యలు వచ్చాయని అలాంటి సమస్యలు తలెత్తకుండా కొత్త అక్రిడేషన్ కార్డులు జారీ చేస్తామన్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టి డబ్ల్యూ జిల్లా అధ్యక్షులు పూదోట సూరిబాబు, ప్రధాన కార్యదర్శి జి వెంకటేశ్వర్లు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ రామిశెట్టిసైదయ్య,, సంఘం బాధ్యులు మునగాల వెంకట కోటా చారి, నేరెళ్లకుంట సుధాకర్ రావు, బొగ్గుల శివ నాగిరెడ్డి, కుంజా వెంకటేష్, కొరసా శ్రీరామ్, ఆకుల శివ, గుడిమెట్ల రమేష్, వీర రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

## చాకలి హుస్సేన్ రోడ్డు సమస్య పరిష్కారానికి సిపిఎం మద్దతు

### రోడ్ కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

### మంజూరైన సిసి రోడ్ను వెంటనే కొనసాగించాలి


### సిపిఎం మండల కార్యదర్శి జంగిలి వెంకటరత్నం



అన్నపురెడ్డిపల్లి **(గౌతమ్ న్యూస్ ):** అన్నపురెడ్డిపల్లి మండల సిపిఎం పార్టీ మండల కార్యదర్శి జంగిలి వెంకటరత్నం మద్దతిస్తూ రెండో రోజు నిరసన లో పాల్గొని అయన మాట్లాడుతూ, చాకలి హుస్సేన్ రజకుడు అనే భావనతోనే అధికారులు ఈ సమస్యను పట్టించుకోవడములేదు వెంటనే అధికారులు స్పందించి చాకలి హుస్సే ఇంటి ముందు రోడ్డును కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఒకపక్క రోడ్డు కొన్నాను అంటే అధికారులు చోద్యం చూస్తున్నారని ఇలాగే ఈ సమస్యను వదిలేస్తే సిపిఎం పార్టీగా మద్దతిచ్చి రోడ్డు కొనసాగించేదాకా సహకరిస్తామని తెలిపారు. సాకలి హుస్సేన్ కి ధైర్యం చెప్పి మీకు ఎటువంటి సాయంకావలన్నా మేము అందిస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు కార్యదర్శి ముదిగొండ రాంబాబు చిటికెన ముసలయ్య అన్నపురెడ్డిపల్లి మండల అధ్యక్షురాలు సాలికొాల శివకుమారి కార్యదర్శి సావిత్రి అన్నపురెడ్డిపల్లి రజక సంఘం నాయకులు, వీర రాఘవులు కే సావిత్రి. మనీ , మిర్యాల నాగమణి, పుష్క, లక్ష్మి, రాజ్యలక్ష్మి. గుంటూరు శిరీష, ధనమ్మ, రేగల మంగమ్మ. ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజులు రాయితీ కల్పించాలి


### విద్యశాఖ అధికారి వెంకటేశ్వర చారి కి వినత పత్రం అందజేశారు టీ డబ్ల్యూ జె ఎఫ్



అన్నపురెడ్డిపల్లి**(గౌతమ్ న్యూస్ ):** టిడబ్ల్యూజేఎఫ్ (భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజులో రాయితీ కల్పించాలని టి డబ్ల్యూ జేఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి కి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో టి డబ్ల్యూ జేఎఫ్ జిల్లా అధ్యక్షులు పూదోటసూరిబాబు, ప్రధాన కార్యదర్శి జి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రామిశెట్టి సైదయ్య, సంఘం బాధ్యులు మునగాల వెంకట కోటా చారి, నేరెళ్ళకుంట సుధాకర్ రావు, బొగ్గుల శివ నాగిరెడ్డి, కుంజ వెంకటేశ్వర్లు, ఆకుల శివ, కొర్స శ్రీరామ్, గుడిమెట్లరమేష్, వీర రాఘవులు, భాషిద్, తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ మీన్స్ కమ్ మెరట్ స్కాలర్ షిప్

### రాష్ట్రస్థాయ్ ఎన్నికైనా యర్రగుంట విద్యార్థి : కాకిరాల చరణ్





అన్నపురెడ్డిపల్లి**(గౌతమ్ న్యూస్ ):** 2023-24 జరిగిన ప్రతిభా పరీక్షలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల యర్రగుంట విద్యార్థి కాకిరాల చరణ్ ఉత్తీర్ణుడయ్యాడు. రాష్ట్రస్థాయిలో గురువరం విడుదల చేసిన ఫలితాలలో చరణ్ ఎంపికైయ్యాడు. అన్నపురేడిపల్లి, చంద్రుగొండ మండలాల నుండి ఈ స్కాలర్ షిప్ కి ఎంపికైన ఏకైక విద్యార్థి. చరణ్ . ఈ సంవత్సరం 8వ తరగతి చదివే విధ్యార్థులు, మీన్స్ పరీక్షను రాసి ఎక్కువ మంది విధ్యార్థులు ఎంపిక కావాలని, తగిన శిక్షణను పాఠశాల ఉపాధ్యాయులు అందిస్తాంరని పాఠశాల ప్రధానోశాధ్యాయులు ఉండేటి. ఆనంద్ కుమార్ తెలియజేశారు . ఈ సందర్భంగా చరణ్ ను ఉపాధ్యాయులు శంకర్ మహాదేవన్, సునందారెడ్డి, శాంతకుమారి, రాజ్యలక్ష్మి, సరిత , బాబురావు, వెంకటేష్ రావు,, కృష్ణారావు, సుజాత, బాదవేతర సిబ్బంది . ఎస్.కె. మనిహిబ్, శ్రీనివాసరావు . సి .ర్ .పి . కే . శిరీష అభినందించారు.

# కొంప ముంచిన కోట్ల బడ్జెట్!!

### జిల్లా ప్రణాళికలు కాగితాలకే పరిమితం!!

### లక్షల కోట్ల బడ్జెట్ కు లక్ష్యం లేదు!!



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో **(గౌతమ్ న్యూస్ ):** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న ప్రతి సంవత్సరం వార్షిక బడ్జెట్ లక్షల కోట్ల రూపాయల్లో అందులో వ్యవసాయ రంగం, విద్యుత్ ,విద్య , వైద్యరంగం, వంటి ప్రాముఖ్యత గల రంగాలకు సెక్టార్లకు బడ్జెట్ కేటాయిస్తున్నప్పటికీ గత పది సంవత్సరాల నుంచి కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ, రాష్ట్రంలోని తెలంగాణ రాష్ట్ర సమితి ప్రవేశపెట్టిన బడ్జెట్ లక్ష్యాన్ని చేరుకోకుండా నీరుగారిపోయింది, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్ ఈ విధంగా ఉన్నప్పటికీ జిల్లాలో మొక్కుబడిగా జిల్లా వార్షిక ప్రణాళిక బడ్జెట్ పేరుతోన వేల కోట్ల రూపాయల బడ్జెట్ కోసం సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ తు తు మంత్రంగా జిల్లా వార్షిక ప్రణాళిక బడ్జెట్ ప్రవేశపెడుతున్నారని విమర్శలు వస్తున్నాయి, గురువారం జరిగిన వనపర్తి జిల్లా సమీక్ష సమావేశంలో జిల్లా అభివృద్ధి కోసం 4361, 66 వేల కోట్ల రూపాయల మార్కెట్ ను ప్రవేశపెట్టారు, 2024 25 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్లో బ్యాంకర్ల సంప్రదింపులు జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి, వనపర్తి




శాసనసభ్యులు మేఘా రెడ్డి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ పాల్గొన్నారు, ఈ సమావేశంలో వనపర్తి జిల్లా లీడు బ్యాంక్ మేనేజర్ నాబార్డ్ అధికారులు ఇతర వివిధ బ్యాంక్ అధికారులు పాల్గొని మొక్కుబడిగా బడ్జెట్ ఆమోదించారు, గత సంవత్సరంలో 2368,04 తో పాటు సంవత్సరం అంటే ఈసారి 1993 ,62 కోట్ల అదనంగా కలిపి 4, 361,66 కోట్ల రూపాయల బడ్జెట్ కు రూపొందించారు, ఈ బడ్జెట్లో వ్యవసాయరంగం, గృహ నిర్మాణం విద్యా రుణాలు, ఎం.ఎస్.ఎం.ఇ, సెక్టార్ కింద చిన్న మధ్యతరహా కుటీర పరిశ్రమలకు రుణాలు ఇవ్వని లక్ష్యంగా పెట్టుకున్నారు, కానీ కేవలం బ్యాంకర్లు మొక్కుబడిగా ప్రభుత్వానికి చెక్కభజన చేస్తున్నారని ఎక్కడ కూడా వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత రంగాలకు రుణాలు ఇవ్వడం లేదని విమర్శలు వస్తున్నాయి, పంట రుణాల కోసం రైతులు ఎకరాకు కేవలం 20వేల రూపాయలు కూడా బ్యాంకర్లు పంట రుణాలు మంజూరు చేయడం లేదని వార్షిక బడ్జెట్ సమావేశాలలో బ్యాంకర్ల సమావేశంలో బ్యాంక్ అధికారులు వంతుకు గంతేస్తూ చేతులు దులుపుకుంటున్నారు విమర్శలు వస్తున్నాయి, వివిధ బ్యాంకులలో గతంలో తీసుకున్న వ్యవసాయ రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలు స్వల్పకాలకు రుణాలు, వ్యాపార రుణాలు, విద్య రుణాలు, చెల్లించకపోవడం వల్ల బ్యాంకులు దివాలా తీస్తున్నాయని బ్యాంక్ అధికారులు అంటున్నారు, ఎప్పుడు ఏ విధంగా ఏ రుణము ఇవ్వాలో బ్యాంక్ అధికారులకు తెలిసినప్పటికీ ప్రభుత్వం మొక్కుబడిగా రాష్ట్ర ప్రజలను రైతులను మరిపించడానికి బ్యాంకర్ల సమావేశం ఏర్పాటు చేస్తుందని విమర్శలు ఉన్నాయి, బ్యాంకులకు సకాలంలో రుణాలు చెల్లిస్తే తిరిగి బ్యాంకులు నేరుగా లబ్ధిదారులకు రుణాలు ఇస్తారని అంతేకానీ మొక్కుబడిగా బ్యాంకర్ల సమావేశం ఏర్పాటు చేసి వార్షిక రుణ ప్రణాళికను ఆమోదించడం లో పెద్ద మొత్తంలో మోసం జరుగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు, బ్యాంక్ అధికారులు పాత బకాయలు చెల్లిస్తే వెంటనే కొత్త రుణాలు మంజూరు చేస్తారు కానీ ప్రభుత్వం ఏదో ఒకరకంగా ప్రజలను మాయమాటలతోనా నమ్మించడానికి ప్రతి సంవత్సరం వార్షిక ప్రణాళికలు వార్షిక బడ్జెట్, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్ జిల్లాస్థాయిలో వార్షిక బడ్జెట్ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి, ప్రతి విషయానికి సమాధానం చెప్పాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు, వనపర్తి జిల్లాలోనే కాక ప్రతి జిల్లాలో కూడా లీడ్ బ్యాంకు మేనేజర్లు నాబార్డ్ ఏజీఎంలు ఆర్బిఐ రిజర్వ్ బ్యాంక్ అధికారులు, వంతుకు తంతుకు వచ్చి పోతున్నారని అందులో ఎలాంటి అనుమానం లేదని ఎవ్వరు కూడా నమ్మవద్దని కొంతమంది సీనియర్ బ్యాంక్ అధికారులు పదవి విరమణ పొందిన అధికారులతో పాటు ఆర్థిక నిపుణులు ప్రతి ఒక్కరు సూచిస్తున్నారు, ఈ వార్షిక ప్రణాళిక బడ్జెట్ ఎప్పుడు ఏ సమయంలో ప్రజలకు రైతులకు నిరుద్యోగులకు, ఏ సమయంలో ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నిస్తున్న ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు, ఇప్పటికే బ్యాంకులు అప్పుల ఊబిలో చిక్కుకొని విలవిల



లాడుతున్నాయని, దీనికి అంతటికి కారణం ప్రజా ప్రతినిధులు ధనవంతులు కోటీశ్వరులకు కోట్ల రూపాయల అప్పులు తీసుకొని దివాలా తీస్తున్నాయని, కాయ కష్టం చేస్తున్న కూలీలకు, వ్యవసాయ రంగాలకు రైతులకు పంట రుణాలు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారంగా చెల్లించకుండా మొక్కుబడిగా ఎకరాకు 20,000 కూడా చెల్లించకుండా బ్యాంక్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్తిస్తున్నారని, పంట రుణాలను ఎకరాకు లక్ష రూపాయలు చొప్పున ఎందుకు చెల్లించడం లేదని లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ ప్రవేశపెడుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్ మోసపూరితమైందని రైతులు అంటున్నారు, ఈ వార్షిక ప్రణాళికలు బడ్జెట్ కాగితాలకే పరిమితమవుతుందని ఆరోపణలు ఉన్నాయి, గత కొన్ని సంవత్సరాల క్రితం నుంచి జిల్లా సెంట్రల్ బ్యాంక్ కోపరేటివ్ డిసిసిబి సింగల్ విండో సొసైటీలో మహబూబ్నగర్ జిల్లాలో అమాయక రైతుల నుంచి పంట రుణాల రెన్యువల్ కోసం సంతకాలు చేయించుకొని బ్యాంక్ అధికారులు లక్షలాది రూపాయలు దిగమింగున చరిత్ర మహబూబ్నగర్ జిల్లాలోని సింగల్ విండో సొసైటీలో రాజ్యమేలుతుంది, ఈ విషయం ప్రభుత్వం లోని మంత్రులు ఎమ్మెల్యేలకు ఎందుకు తెలియడం లేదని, జిల్లాలోని జిల్లా కలెక్టర్ ఎందుకు పట్టించుకోవడంలేదని రైతులు ప్రశ్నిస్తున్నారు, ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ కూడా ఇప్పటికీ బ్యాంక్ అధికారులు రైతులకు క్రాప్ లోన్ పంట రుణాలు చెల్లించకపోవడం విడ్డూరకరం దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రులు శాసనసభ్యులు సమాధానం చెప్పాలని రైతుల డిమాండ్ చేస్తున్నారు, రెండు లక్షల రుణమాఫీ ప్రభుత్వం ఎప్పుడు చేస్తుందని ఎప్పుడు పంట రుణాలు అందుతున్నాయని ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయినప్పటికీ కూడా రైతుల పట్ల కపట ప్రేమ




చూపిస్తూ కేవలం వార్షిక బడ్జెట్ పేరుతో నా కాలయాపన చేస్తున్న ప్రభుత్వానికి అధికారులకు రైతులు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయి, సకాలంలో పంట రుణాలు ఇవ్వని బ్యాంకులు, మొక్కుబడిగా ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్నారని, వాళ్ళ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి, తక్షణమే బ్యాంక్ అధికారులు వార్షిక ప్రణాళిక బడ్జెట్ ప్రకారం వనపర్తి జిల్లాలో లక్ష్యాన్ని చేరుకోవాలని, గత సంవత్సరం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ లక్ష్యం ఏమైందని ప్రశ్నిస్తున్నారు ప్రజలు, ఇప్పటికైనా వనపర్తి , నాగర్ కర్నూల్, గద్వాల , నారాయణపేట, మహబూబ్నగర్ జిల్లాలోని వార్షిక బడ్జెట్ లో పేర్కొన్న ప్రతి సెక్టార్ కింద కేటాయించిన నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు, ఒకవేళ ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ను విడుదల చేయకుంటే ప్రభుత్వం జిల్లా అధికారులు బ్యాంక్ అధికారులు ప్రజలకు ఏ విధమైన సమాధానం చెప్పగలరు స్పష్టంగా తెలియజేయాలని జిల్లా వార్షిక సమావేశాల్లోనే ఈ విషయాన్ని బహిర్గతం చేయాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు,

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన ప్రముఖ సంఘ సేవకులు

### శివంపేట్ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా




నర్సాపూర్ **(గౌతమ్ న్యూస్ ):** శివంపేట్ మండల్ చిన్న గొట్టిముకుల గ్రామంలో గుమ్మడి శివకుమార్ కు ప్రమాదవశాత్తు భుజం వెముక విరగడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించిన మెదక్ జిల్లా ఆర్థిక ప్రణాళిక సభ్యుడు ప్రముఖ సంఘ సేవకుడు శివంపేట జడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా అలాగే వారి సొంత నిధుల నుండి 10,000 రూపాయల ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ వార్డ్ సభ్యుడు సయ్యద్ సలీం, శివకుమార్ రాములు, సయ్యద్ గౌస్, రాహుల్ మణికుమార్ అలీమ్, గుమ్మడి శేఖర్, అద్నాన్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ రక్త దాతలు దినోత్సవం సందర్భంగా రక్తదానం

### రక్త బంధ ఆర్గనైజేషన్ కన్నా వెంకటేష్



అనంతపురం**(గౌతమ్ న్యూస్ ):** ధర్మవరం చెందిన కన్న వెంకటేష్ రక్త బంధం మార్గదర్శన్ ఆధ్వర్యం ద్వారా దాదాపు నాలుగు సంవత్సరాల నుంచి అనంతపూర్ కడప కర్నూలు మూడు జిల్లాల్లో వారి మిత్రులు ద్వారా దాదాపు ఇప్పటివరకు 4500 పైగా బ్లడ్ క్యాంపు ద్వారా మరియు బత్తలపల్లి ఆర్ డి టి హాస్పిటల్ లో తల సేమియా చిన్నారులకు అనునిత్యం రక్తదాతలను పంపిస్తూ ఉండడం జరుగుతుంది ఈ రోజున ప్రపంచ రక్త దాతలు దినోత్సవం సందర్భంగా రక్త బంధం ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు కన్నా వెంకటేష్ ప్రపంచ రక్త దాతలు దినోత్సవం సందర్భంగా స్వచ్ఛందంగా రక్తం ఇవ్వడానికి ధర్మవరం నుంచి అనంతపూర్ దీపు బ్లడ్ బ్యాంక్ వచ్చి తన %శీంజవ% 24 వ సారి రక్తదానం చేయడం జరిగింది ఈ ఒక్క కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ సిబ్బంది మరియు రక్త బంధం ఆర్గనైజేషన్ సభ్యులు మరియు బ్లడ్ బ్యాంకు సిబ్బంది కన్న వెంకటేష్ నీ అభినందించడం జరిగింది ఈ కార్యక్రమంలో కన్న వెంకటేష్ మాట్లాడుతూ ఈ రోజున నా పుట్టినరోజు సందర్భంగా ఒక నిండు ప్రాణాన్ని కాపాడడం జరిగింది ఇప్పటివరకు 24 రక్తము 22 తెల్ల రక్త కణాలు మొత్తం 46 సార్లు రక్తదానం చేయడం జరిగింది భవిష్యత్తులో ప్రతి మూడు నెలలకు ఒకసారి కచ్చితంగా రక్తదానం చేస్తామని తెలిపారు.

## విత్తన షాపుల్లో విస్తృత తనిఖీలు

### నకిలీ, అన్ ఆథరైస్డ్ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు:

### జిల్లా వ్యవసాయాధికారి బి.అభిమన్యుడు.





బయ్యారం**(గౌతమ్ న్యూస్ ):** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని రామచంద్రాపురం,కొత్తపేట, బయ్యారం లో జిల్లా వ్యవసాయ అధికారి బి.అభిమన్యుడు,మండల వ్యవసాయ అధికారి బి.రాంజీ శుక్రవారం ఐదు విత్తన షాపుల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రామచంద్రపురం లోని సనా ట్రేడర్స్,శ్రీరామ ఫెర్టిలైజర్స్ సీడ్స్,సాయిబాబా ట్రేడర్స్, గంధంపల్లి,బయ్యారంలో లక్ష్మి ఫెర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్స్, సీడ్స్ సొసైటీలో కూడా స్టాగ్ రిజిస్టర్, ఇన్వైబిల్స్ ,సీడ్ గోదాములు, ప్రిన్సిపల్ సర్టిఫికెట్స్ ,జియో టి, రైతు వారి 12 కాలమ్స్ గల ప్రొఫార్మా వెరిఫై చేయడం తోపాటు ఎరువుల ఈపాస్ మెషిన్లను కూడా తనిఖీలు నిర్వహించటం జరిగింది.నకిలీ విత్తనాలు, అన్ ఆథరైస్డ్ గల విత్తనాలు అమ్మినట్లయితే చట్టపరమైన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో బయ్యారం క్లస్టర్ ఏఈఓ అఖిల్ కుమార్, కొత్తపేట క్లస్టర్ ఏఈఓ కె.పూజిత లు పాల్గొనడం జరిగినది.

## పిల్లోనిగుడా లోని వైభవంగా సామూహిక అక్షరాభ్యాసం




శంషాబాద్ (గౌతమ్ న్యూస్ ): శంషాబాద్ మండలం పరిధిలోని పిల్లోనిగూడ గ్రామంలోని ప్రైమరీ పాఠశాలలోని శుక్రవారం సరస్వతి దేవి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు . సామూహిక అక్షరాభ్యాస పిల్లలతో చేయించిన స్కూల్ హెడ్ మాస్టర్ రాధాకృష్ణ సార్ . రుక్మయ్య సార్ .ఆనంద కుమార్ సార్. పంచాయతీ సెక్రెటరీ భాస్కర్. అంగన్వాడీ టీచర్స్. అనితా . జ్యోతి . జుర్కి రమేష్ పటేల్. పాల్గొన్నారు

## ఎన్ ఎంఎంఎస్ స్కాలర్షిప్ పరీక్షలో
## ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



నర్సంపేట(**గౌతమ్ న్యూస్ ):** నర్సంపేట జిల్లా ప్రజా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల యందు ప్రధానోపాధ్యాయులు పోడేం కాంతారావు ప్రభుత్వం 2023 డిసెంబర్ లో నిర్వహించిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ పరీక్షలో 8వ తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత పొందిన ఇద్దరు బాలికలు మేరీ హెప్సిబా పోలు దాసరి సిరివెన్నెల ను మెమొంట పుష్పగుచ్చాలతో పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల సమక్షంలో అభినందించారు. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించిన ఎన్ ఎంఎం ఎస్ స్కాలర్షిప్ పరీక్షలో గత 2023 డిసెంబర్లో నర్సంపేట మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాల నుండి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఆన్లైన్ ద్వారా పరీక్షలో అర్హులై ఉత్తీర్ణత భాగంలో మా బాలికల పాఠశాల నుండి ఇద్దరు విద్యార్థినీలు ఉత్తీర్ణత పొందినందు అభినందిస్తూ సహకరించిన ఉపాధ్యాయుల ను ప్రోత్సహించారు ఇలాంటి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు ప్రభుత్వం ప్రతినెల 1000 రూపాయల చొప్పున సంవత్సరం కి 12 వేల రూపాయలు ఇంటర్మీడియట్ చదువుల వారకి స్కాలర్షిప్ రూపంలో ఎస్ బీఐ బ్యాంకు ద్వారా విద్యార్థుల అకౌంట్ కి నేరుగా ప్రభుత్వం పంపించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పోడేం కాంతారావు, వి.అరుణకుమారి, రాజేష్, శౌరి అసంతిన, రాణి, సురేష్ కుమార్, రాజమౌళి, రాధిక, రమేష్, స్వరూప, సుజాత, రవి, రవీందర్, రవీందర్ రెడ్డి, భాస్కర్, స్వామి, మల్లయ్య, పద్మ, నిర్మల, కిష్టయ్య, బి. శ్రీనివాస్ రావు, షాహనజ్, తల్లిదండ్రులు సుమన్, ప్రవీణ్ కుమార్ రెడ్డి, కన్నయ్యలు పాల్గొన్నారు.

## ఇండియన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫీస్ ప్రారంభోత్సవం
### ప్రారంభోత్సవం చేసిన మహబూబాబాద్ టౌన్ సిఐ దేవేందర్





బయ్యారం (**గౌతమ్ న్యూస్ ):** మహబూబాబాద్ జిల్లా కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలోని మహబూబాబాద్ జిల్లా మానవ హక్కుల మండలి చైర్మన్ రాయల సురేష్ ఆధ్వర్యంలో ఆఫీస్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మహబూబాబాద్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ దేవేందర్ , నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ అబ్దుల్ కరీం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ చైర్మన్ షేక్ చాంద్ పాషా, స్టేట్ ఇన్చార్జ్ డాక్టర్ వి సురేష్ కుమార్ వైస్ చైర్మన్ సయ్యద్ సయీద్,స్టేట్ చీఫ్ సెక్రటరీ షేక్ చాంద్ పాషా, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్





మహమ్మద్ అహ్మద్ , అబ్దుల్లా నహీద్ ఖాజా గౌస్ మోహియోద్దీన్ , మహబూబాబాద్ జిల్లా వైస్ చైర్మన్ దొంతు నరసయ్య, మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల నాగరాజు ,మహబూబాబాద్ జిల్లా జాయింట్ సెక్రెటరీ ధారావత్ వెంకట్రాం ,మహబూబాబాద్ జిల్లా అడ్వైజర్ రావూరి రామచంద్రయ్య, మహబూబాబాద్ జిల్లా కోర్ కమిటీ మెంబర్ వాడపల్లి రాము, గ్రామ నాయకులు మేధావులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## ఈనెల 27న సీజ్ చేసిన, అన్ క్లైయిమ్ డ్ గా
## నిర్ధారించబడిన వాహనాలకు వేలంపాట
### ఎంటిఓ ఓ.సుధాకర్ రావు.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(**గౌతమ్ న్యూస్ ):** జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన మరియు అన్ క్లెయిమ్డ్ గా నిర్ధారించబడిన 323 వాహనాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు ఈ నెల 27వ తారీఖున వేలంపాట నిర్వహించనున్నట్లు ఎంటిఓ ఓ.సుధాకర్ రావు ఈ రోజు ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో సీజ్ చేసిన మరియు వదిలివేయబడిన వాహనాలను వాటి యజమానులు తిరిగి పొందకపోవడంతో ఇట్టి వాహనాలను జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు ఉంచడమైనదని తెలిపారు.ఇందులో 306 ద్విచక్రవాహనాలు మరియు 17 ఆటో/కార్లు మొత్తం 323 వాహనాలు ఉన్నాయని మరియు పోలీస్ శాఖకు సంబంధించి కాలం చెల్లిన టైర్లు,బ్యాటరీలు మరియు స్పేర్ పార్ట్స్ నకు ఈనెల 27వ తారీఖున ఉదయం 10 గంటల నుండి వేలంపాట జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు వేలం వేయనున్నట్లు ఎంటిఓ తెలియజేసారు.వేలంపాటలో పాల్గొనడానికి ఆసక్తి కలవారు 8712682145 నెంబర్ కి ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

## భారత్ లో పెరుగుతున్న నీటి వృథా..
## ఇలాగే కొనసాగితే పరిస్థితి చేయిజారిపోయే ప్రమాదం



దేశంలో నీటిమట్టం తగ్గుముఖం పట్టడంతో లక్షలాది మంది ప్రజలు స్వచ్ఛమైన నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. నీటి కొరత వెనుక వాతావరణ మార్పు ఒక ప్రధాన కారణం అయితే, మితిమీరిన వినియోగం, వృథా కూడా నీటి సంక్షోభ ప్రమాదాన్ని పెంచింది. దేశ రాజధాని ఢిల్లీ ఈరోజుల్లో నీటి ఎద్దడిని ఎదుర్కొంటోంది. చాలా ప్రాంతాలను డ్రై జోన్లుగా ప్రకటించారు. ఢిల్లీలో రోజూ 50 మిలియన్ గ్యాలన్ల నీటి కొరత ఏర్పడుతోంది. ప్రతి నీటి చుక్కకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. దేశ రాజధానికి అదనపు నీటిని అందించడానికి హర్యానా నిరాకరించడంతో ఢిల్లీలో నీటి సంక్షోభం న్యాయ పోరాటంగా మారింది. అయితే, ఢిల్లీ మాత్రమే నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. కానీ దేశంలోని వివిధ ప్రాంతాల్లో మండుతున్న వేడి, విద్యుత్ వాడకం నీటి వినియోగాన్ని పెంచింది. ఢిల్లీ, బెంగళూరు వంటి అనేక మెట్రోపాలిటన్ నగరాల్లో నీటి కొరత తీవ్రంగా ఉంది. సగటు భారతీయుడు తన రోజువారీ నీటి అవసరాలలో 30 శాతం వృథా చేసుకుంటున్నాడని నివేదికలు సూచిస్తున్నాయి. యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే ప్రకారం.. ఒక ట్యాప్ నిమిషానికి 10 చుక్కలు కారడం వల్ల రోజుకు 3.6 లీటర్ల నీరు వృథా అవుతుంది. అలాగే, టాయిలెట్ యొక్క ప్రతి ఫ్లష్ దాదాపు ఆరు లీటర్ల నీటిని ఉపయోగిస్తుంది. ప్రతిరోజు 4,84,20,000 కోట్ల క్యూబిక్ మీటర్లు అంటే 48.42 బిలియన్ వన్ లీటర్ బాటిళ్ల నీరు వృథా అవుతుందని.. దేశంలో 16 కోట్ల మందికి స్వచ్ఛమైన, మంచినీరు అందడం లేదని డౌన్ టు ఎర్త్ మ్యాగజైన్ నివేదిక తెలిపింది. ఉత్తర, వాయువ్య భారతదేశాలు ఇతర ప్రాంతాల కంటే ఎక్కువ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. 2020లో పంజాబ్ పరిమితికి మించి 164.4 శాతం నీటిని ఉపసంహరించుకుంది.

# అంతర్జాతీయంగా అమెరికా ఆర్థిక శకం ముగిసింది

హైదరాబాద్(**గౌతమ్ న్యూస్ ):** ఇప్పటివరకు పెట్రో డాలర్ గా రూపాంతరం చెంది ప్రపంచంలోని అన్ని దేశాలను తన గుప్పిట్లో ఉంచుకున్నది అమెరికా. గత 75 సంవత్సరాల క్రితం సౌదీ అరేబియా తో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా ప్రపంచంలోని ఏ దేశమైనా సరే సౌదీ అరేబియా దగ్గర ముడి చమురు కొన్నప్పుడు చెల్లింపులు మాత్రం ఒక్క అమెరికన్ డాలర్ల రూపంలోనే చెల్లించాలి అనే ఒక ఒప్పందాన్ని చేసుకున్నది అమెరికా సౌదీ అరేబియా తో. ఆ ఒప్పందము 75 సంవత్సరాల తర్వాత ఇప్పుడు కాల పరిమితి తీరిపోయింది. ఇప్పుడు సౌదీ అరేబియా ప్రపంచంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకొని రష్యాతో లోపాయికారి ఒప్పందాలతో ఇక అమెరికాతో గత ఒప్పందాలను పొడిగించే అవకాశం లేదని తేల్చి చెప్పింది. .అంటే ఇప్పుడు ప్రపంచం మార్కెట్లో ముడి చమురుకు చెల్లింపులు అమెరికన్ డాలర్ల రూపంలో చెల్లించాల్సిన అవసరం లేదు భారత్ కరెన్సీ రూపాయి, చైనా కరెన్సీ యువాన్ యూరోపియన్ యూనియన్ కరెన్సీ యూరో జపాన్ కరెన్సీ యెన్ .ఇదే కాకుండా వివిధ దేశాలకు చెందిన కరెన్సీలలో కూడా ఇప్పుడు చెల్లింపులు చేయవచ్చు. . కొంతకాలం సౌదీ అరేబియా నుండి ముడిచమురు వివిధ దేశాలు కొనాలి అంటే వాటి చెల్లింపులు ఒక్క అమెరికన్ డాలర్ల రూపంలోనే చెల్లించాల్సి ఉండేది. . వివిధ దేశాలు వద్ద అమెరికన్ డాలర్ల నిలువలు తక్కువగా ఉండడం వల్ల చెల్లింపుల కొరకు అమెరికా డాలర్లను తమ కరెన్సీ చెల్లించి కొనేవారు. . అప్పుడు అమెరికా డాలర్ కు విలువ పెరిగి ఆయా దేశాల కరెన్సీ విలువలు తగ్గిపోయేవి. . ఉదాహరణకు మన భారతదేశమే ఉన్నది మన భారతదేశం దగ్గర ముడిచమురురు కు చెల్లింపు చేయడానికి అమెరికన్ డాలర్లు ( విదేశీ మార్గ ద్రవ్య నిల్వలు) లేని ఎడల అప్పుడు మనము స్టాక్ మార్కెట్ లో నేరుగా అమెరికన్ డాలర్లను కొనుగోలు చేసే వారము అప్పుడు సహజంగా మన రూపాయి విలువ విపరీతంగా పడిపోయేది. ఇప్పుడు ఆయా దేశాలకు ఆ అవసరం లేదు నేరుగా సౌదీ అరేబియా తో కానీ లేదా వివిధ ఆయిల్ దేశాల వద్ద ఆయిల్ కొనుగోలు చేసినప్పుడు ఆ దేశాలతో ఒప్పందాలు చేసుకొని వీలైతే తమ కరెన్సీ లోనే చెల్లింపులు చేసుకునే అవకాశం ఉన్నది. తద్వారా అమెరికన్ డాలర్ తో ఎవరికీ అవసరం ఉండదు కాబట్టి సహజంగా అమెరికన్ డాలర్ విలువ పడిపోతుంది ఆయా దేశాల కరెన్సీ విలువలు పెరుగుతాయి. ఇంతకాలం అమెరికన్ డాలర్ అనేది పెట్రో డాలర్ గా ఉన్నది కాబట్టి తాను ఆడింది ఆట పాడింది పాట. ఇప్పటికీ ప్రపంచంలో అగ్రరాజ్యం అంటే అమెరికా ప్రపంచంలో అగ్ర కరెన్సీ అంటే అమెరికన్ డాలర్.. ఇప్పటికీ ప్రపంచంలో అత్యధిక అప్పు కలిగిన దేశం అంటే అమెరికా.. ఇంతకాలం అమెరికా పెట్రో డాలర్ లో అడ్డుపెట్టుకొని అప్పుల నుండి బయటపడుతూ వస్తుంది. ఇప్పుడు గనక పెట్రో డాలర్ కుప్పకూలితే అమెరికా డాలర్ కు విలువ ఉండదు కాబట్టి ఇక అమెరికా కుప్పకూలడం ఖాయం అని విశ్లేషకులు భావిస్తున్నారు.

## తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా
## హైయెస్ట్ బ్లడ్ డోనర్ అవార్డు అందుకున్న బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్
## వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు ( స్విమ్మర్ రాజు )

హైదరాబాద్ (**గౌతమ్ న్యూస్ ):** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ స్టేట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో జూన్ 14 , వరల్డ్ బ్లడ్ డోనర్స్ డే సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో సిటీ ఆర్మ్డ్ రిజర్వు ( ఏ.ఆర్ ) పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న వరంగల్ జిల్లా , ఖానాపురం మండలం , రాగంపేట గ్రామానికి చెందిన కన్నె కుమారస్వామి - రమనీల దంపతుల పెద్ద కుమారుడు బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్ , వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు ( స్విమ్మర్ రాజు ). 2005వ సంవత్సరం లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఖానాపురం లో ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ చదువుకుంటున్న రోజులలో తేదీ. 28/08/2005 రోజున ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో కాకతీయ విశ్వవిద్యాలయం వరంగల్ లో మొట్ట మొదటి సారి రక్తదానం చేయడం జరిగింది. రక్తం దొరకకుండా ఎవరు ఇబ్బంది పడవద్దు. రక్తం దొరకక ఎవరు కూడా చనిపోకూడదు అనే ముఖ్య ఉద్దేశంతో గత 19 సంవత్సరాలుగా నేను రక్తదాన చైతన్య యుద్ధంలో నేను సైతం అనే కార్యక్రమంలో భాగంగా రక్తదానంపై అవగాహన , తలసేమియా చిన్నారుల కోసం చిన్నారుల కోసం రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం , 2005 సంవత్సరం నుండి నేను ఇప్పటి వరకు 34సార్లు ( ఓ పాజిటివ్ ) రక్తదానం చేయడం జరిగింది. జిల్లాలో అత్యధికంగా రక్తదానం చేసినందుకుగాను తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , తెలంగాణ రాష్ట్ర రెడ్ క్రాస్ చైర్మన్ అజయ్ మిశ్రా ( ఐ.ఏ.ఎస్ ) చేతుల మీదుగా హైయెస్ట్ బ్లడ్ డోనర్ అవార్డును అందుకోవడం జరిగింది. అవార్డు రావడానికి సహకరించిన హనుమకొండ రెడ్ క్రాస్ పాలకవర్గానికి , నాకు అన్ని విధాలుగా




సహాయ సహకారాలు అందిస్తు , ప్రోత్సహిస్తున్న నా యొక్క కుటుంబ సభ్యులకు , బంధుమిత్రులకు , నా యొక్క గురువులకు , రక్తదాతలకు , వరంగల్ పోలీస్ శాఖ వారికి , యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఒకప్పుడు ఆ జిల్లాలో ఏకచక్రాధిపత్యం.. నేడు జీరో!

ఒకనాడు ఆ జిల్లాలో గులాబీ పార్టీ జైత్రయాత్ర కొనసాగించింది. ఒకటీ అరా మినహా సర్పంచ్ నుంచి ఎంపీ సీట్ల వరకు బీఆర్ఎస్ హవా కొనసాగింది. ఎన్నికలు ఏవైనా విజయం తమదే అనే ధీమాతో గులాబీ శ్రేణులు సంబరాలు చేసుకునేవి. కానీ గత అసెంబ్లీ ఎన్నికల నుంచి అక్కడ హస్తం హవా మొదలైంది. పార్లమెంట్ ఎన్నికల్లో ఒక సీటు హస్తంకు, మరో సీటు కమలానికి దక్కాయి. గులాబీ పార్టీ మొత్తంగా జీరో అయిపోయింది. ఇన్ని పరాజయాల మధ్య ఓ విజయం బీఆర్ఎస్ను పలకరించింది. ఆ విజయం ఏంటి? ఇంతకీ ఆ జిల్లా ఏది? తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో కారు పార్టీ జైత్రయాత్రకు అడ్డే లేకుండా పోయింది. పదేళ్ళ పాటు జిల్లాలో ఏకచక్రాధిపత్యం చెలాయించారు గులాబీ పార్టీ నాయకులు, కార్యకర్తలు. అట్టడుగు నుంచి ఉన్నత స్థాయి వరకు ఏ ఎన్నికలు జరిగినా విజయం గులాబీ పార్టీదే అన్న రేంజ్ కొనసాగింది. కాని ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల్లో కారు స్పీడ్కు బ్రేకులు పడ్డాయి. అగ్రతాంబూలం అందుకున్న జిల్లాలో అథః పాతాళానికి పడిపోయింది. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ సీట్లకు కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలనే గెలిపించుకోగలిగింది. ఇక లోక్సభ ఎన్నికల్లో దారుణ పరాభవం ఎదురు కావడంతో గులాబీ శ్రేణులు డీలా పడ్డాయి. కాని ఇదే సమయంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్కుమార్ రెడ్డి విజయం సాధించటంతో కొంత ఊరట చెందారు. పార్టీ ఇంతగా పరాజయం పొందటానికి నేతల మధ్య సమన్వయ లోపం..తమకేంటిలే అనే నిర్లక్ష్యమే కారణమనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొద్దికాలానికే వచ్చి లోక్సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీ అధినేత కేసీఆర్ మహబూబ్నగర్, నాగర్కర్నూల్ జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన బస్సుయాత్రలు సక్సెస్ కావటంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఊరట చెందారు. ఎమ్మెల్సీగా తమ పార్టీ అభ్యర్థి నవీన్రెడ్డి గెలువటం కూడా వారిలో కొత్త ఆశలు చిగురించాయి. కాని లోక్సభ ఎన్నికల్లో రెండుస్థానాల్లో పార్టీ అభ్యర్థులు ఘోరంగా ఓడిపోవటం..అదీ మూడవ స్థానానికే పరిమితం కావటం మాత్రం జీర్ణించుకోలేక పోతున్నారు. లోక్సభ ఎన్నికల్లో పోటీ ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ మధ్యనే సాగింది. నాగర్కర్నూల్ స్థానంలో కొంత ప్రభావం చూపగలిగినా..మహబూబ్నగర్ స్థానంలో మాత్రం బీఆర్ఎస్ అభ్యర్థి అసలు ప్రభావం చూపలేకపోయారు. ఈ స్థానంలో 2009 నుంచి 2019 వరకు వరుసగా బీఆర్ఎస్ విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టింది. లోక్సభ ఎన్నికల్లో పెద్దఎత్తున బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి బదిలీకావటం కూడ నష్టం కలిగించిందనే వాదనలు వినిపిస్తున్నాయి. బీజేపీని గెలిపించేందుకు బీఆర్ఎస్ కావాలనే తమ పార్టీ ఓట్లను కమలం గుర్తుకు బదిలీ చేసిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. భవిష్యత్లో ఇక ఇక్కడ బీఆర్ఎస్కు స్థానం ఉండదని కాంగ్రెస్ అంటోంది. కాని బీఆర్ఎస్ నేతలు మాత్రం మళ్లీ పాలమూరు జిల్లాలో పూర్వవైభవం సాధిస్తామని చెబుతున్నారు. ఇప్పటికే ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయటంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలయ్యిందని మండిపడుతున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. పాలమూరు సీఎం రేవంత్రెడ్డి సొంత జిల్లా కావటం అత్యధికంగా ఎమ్మెల్యేలు, ఓ ఎంపీ కాంగ్రెస్ పార్టీకి ఉండటం..మరోవైపు మహబూబ్నగర్ ఎంపీ స్థానంలో బీజేపీ గెలవటంతో ఆ రెండు పార్టీలు బలంగా తయారయ్యాయి. కేంద్రలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న హస్తం, కమలం పార్టీల మధ్య కారు పార్టీ మనుగడ ఎలా సాగుతుందో చూడాలి.

# సర్కార్ బడి విలువ పెరగాలి!



తాను, తనతో పాటు చాలామంది ఐఏఎస్ అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివామని.. సర్కార్ బడి విలువ నాకు తెలుసని... వాటి అభ్యున్నతి కోసం కృషి చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం అభినందించదగ్గ అంశం. ముఖ్యమంత్రి స్పందన ఓ వైపు, బడిబాటలో తిరుగుతున్నప్పుడు ప్రజల నుంచి ఎదురవుతున్న ప్రశ్నలు ఇంకొక వైపు విద్యా వ్యవస్థను సవాల్ చేస్తున్నట్లు కనిపిస్తున్నది. నూతన ప్రభుత్వం ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో కల్పించిన ప్రయాణాన్ని ప్రభుత్వ పాఠశాలలతో పోలుస్తూ.. ఉచితంగా పాసులు ఇస్తే బస్సులెక్కే జనం, ఉచితంగా చదువు చెప్పే పాఠశాలల్లో తమ పిల్లల్ని చేర్చకపోవడానికి బస్సు డ్రైవర్ మీద ఉన్న నమ్మకం టీచర్ల మీద లేకేనా? అన్న ఓ వాట్సాప్ మెసేజ్ ఇటీవల విపరీతంగా వైరల్ అవుతోంది. ఇది ఒక రకంగా ప్రభుత్వ విద్యను, సర్కార్ వైఖరిని, టీచర్ల స్థితిగతుల్ని అవహేళన చేస్తున్నట్లుంది. ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఒక చిరు అవకాశాన్ని పాఠశాల విద్యావ్యవస్థతో పోలుస్తూ అటు కార్లల్లో, ఏసీ బస్సుల్లో, ప్రైవేటు బస్సుల్లో తిరిగే జనాలను, అలాంటి ఒక ప్రైవేటు వ్యవస్థను విస్మరించి, ఇది కేవలం టీచర్ల మీద నమ్మకం లేని అంశంగా ప్రచారంలో పెట్టడం దుర్మార్గం. కొఠారి కమిషన్ తన నివేదికలో చెప్పినట్లు.. పేదోడికైనా, పెద్దోడి బిడ్డకైనా ఒకే రకం బడి, ఒకే రకం చదువు అందాలన్న 'కామన్ స్కూల్' కల నెరవేరకపోగా... ప్రజాస్వామిక సంస్కృతి విలువ మృగ్యమై డబ్బున్న వాళ్ళకి ఓ రకమైన విద్య, డబ్బు లేని పేదలకు ప్రభుత్వ విద్య కొనసాగే విధానంలో మార్పు రాకుండా ప్రభుత్వ విద్యా రంగాన్ని సంస్కరించలేం. రేవంత్ రెడ్డి లాంటివాళ్ళు చదివిన ప్రభుత్వ పాఠశాలల్లో ఇవ్వాళ ఏ రాజకీయ నాయకుని పిల్లలు గాని, ఏ ఐఏఎస్ అధికారి పిల్లలు గాని, కనీసం టీచర్ల పిల్లలు కానీ చదవలేని దుస్థితి ఎందుకు కొనసాగుతున్నదో ఆలోచించాలి. విద్య ప్రైవేటీకరణ అయి, చదువు అంటే ఐఐటీలు, నీట్లు, డాలర్ కొలువులుగా మారిపోయాయి. ఆంగ్ల మాధ్యమంలోనే చదివితే కొలువులొస్తాయని భ్రమలు కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి ప్రసంగించిన వేదిక మీదే వరంగల్ విద్యార్థిని భువనకృతి అభిలషించిన అంశాలు ఉచిత రవాణా, మంచి కోచింగ్, మధ్యాహ్న భోజనం, టాయిలెట్స్, భద్రత, బట్టీ విధానం లేని చదువులు, సర్కార్ బడుల్లో సౌకర్యాలు, సబ్జెక్టు కొరత లేని టీచర్లు వంటి వాటి గురించి ఆలోచించాలి. ఇవిగాక ప్రభుత్వం ఇచ్చే ఉచిత పుస్తకాలు తప్ప మరో పుస్తకం చదవలేని గ్రంథాలయాలు, సైన్స్ ల్యాబులు, లాంగ్వేజ్ క్లబ్బులు, విద్యార్థుల సమగ్ర వికాసానికి కళలు, కనీసం ఓ పీరియడ్ ఆడుకునే అవకాశం వంటివి కూడా సర్కార్ బడుల్లో లేవు. ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్య, విహారయాత్రల్లో సైన్స్ పరిజ్ఞానాన్ని పెంపొందించే టూర్స్ కల్పన చేయాలి. ఏళ్లకేళ్లు పాత పాఠ్యాంశాలతో పిల్లల మెదళ్లను నిస్తేజం చేయని నూతన కరికులంను రూపొందించుకోవడం, కనీసం పాఠశాల విద్య వరకైనా మాతృభాషలోనే చదువుకునే అవకాశం వల్ల ఇతర భాషల్ని నేర్చుకొని వివేకాన్ని పెంపొందించుకునే విధానాన్ని అమలు చేయాలి. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ) పేరిట తీసుకొస్తున్న మార్పులు తెలంగాణకు దోహదపడకపోగా, విద్యావ్యవస్థను ప్రాథమిక దశ నుంచి ప్రైవేటీకరణ, కార్పోరేటీకరణ, కేంద్రీకరణ వైపు నెట్టే స్థితి కొనసాగుతున్నది. అందువల్ల ఎన్ఈపీలో చేరకుండా తెలంగాణ భౌగోళిక, సాంస్కృతిక, రాజకీయ నేపథ్యానికి తగ్గట్టుగా, రాష్ట్ర అభ్యున్నతికి దోహదపడే విధానాలతో కూడిన శాస్త్రీయ విద్యావిధానాన్ని కొనసాగించాలి. వీటన్నిటికంటే ముఖ్యంగా అసలు పాఠశాల విద్యా వ్యవస్థలో అత్యంత కీలకమైన అంశంగా పరీక్ష విధానం కొనసాగుతున్నది. ప్రైవేటు కార్పొరేట్ స్కూల్స్లో చదివే ఇంగ్లీష్ మీడియం పిల్లలకి, ఏ వసతులు లేని ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద పిల్లలకి ఒకే పుస్తకం-ఒకే పరీక్ష విధానంతో ప్రతి ఏటా కొంతమంది పిల్లలకి గ్రేడులు తగిలించి, మిగిలిన వారిని ఎందుకు పనికిరాని, చదువురాని తరాలుగా సమాజంలోకి వదిలేస్తున్న ఈ లోపభూయిష్ట విద్యావ్యవస్థను సమీక్షించి, పరీక్ష విధానాన్ని మార్చాలి. మెరుగైన గ్రేడ్లు సాధించిన పిల్లలు కార్పొరేట్ స్కూళ్లలో చేరితే, పరోక్షంగా వాటికి నిధులు ఇచ్చి ప్రైవేటు విద్యను ప్రోత్సహించడం ప్రభుత్వ విద్యను నీరుగార్చడమే. నేడు కార్పొరేట్ హాస్పిటళ్లకు రీయింబర్స్ పేరిట కోట్లాది రూపాయలు చెల్లిస్తూ, ప్రభుత్వ వైద్యశాలలను నిర్వీర్యం చేసినట్లుగా... ప్రభుత్వ విద్యారంగాన్ని కూడా నిర్వీర్యం చేస్తున్నారు. దీనికి భిన్నంగా మెరుగైన విద్యార్థులతో పాటు ఇతర విద్యార్థులు కూడా ప్రభుత్వ విద్యారంగంలోనే కొనసాగేటట్లు చూడాలి. మెరుగైన విద్యార్థుల కోసం రాష్ట్రంలో ఒక బాసర ట్రిబుల్ ఐటీ తప్ప మరొకటి లేకపోవడం విషాదకరం. ఇటువంటివి జిల్లాకు ఒకటి కొనసాగించాలి. ప్రభుత్వ కళాశాలల్లోను, విశ్వవిద్యాలయాల్లోని ఖాళీలన్నిటినీ భర్తీ చేసి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలి.

## అగ్నిప్రమాదం కేసులో ముగ్గురు అరెస్ట్




కువైట్ అగ్నిప్రమాదంలో 50 మంది విదేశీ కార్మికులను బలి తీసుకున్న కేసులో ముగ్గురు వ్యక్తులను పోలీసులతు అరెస్ట్ చేశారు. గత బుధవారం జరిగిన ప్రమాదంలో 50 మంది భారతీయులు, ఫిలిప్పీన్స్ ప్రాణాలు కోల్పోయారు. సెక్యూరిటీ గదిలో విద్యుత్ లోపం కారణంగా ఈ మంటలు చెలరేగాయి. పైగా తెల్లవారుజాము కావడం.. కార్మికులంతా నిద్రలో ఉండడంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా జరిగింది. మంటలు వేగంగా వ్యాపించడం.. కార్మికులంతా లోపలే ఉండిపోవడంతో పొగ పీల్చి అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. ఒకే కంపెనీకి చెందిన 200 మంది కార్మికుల బస కోసం కంపెనీ ఒక అద్దె భవనాన్ని తీసుకుంది. ఆరు అంతస్తుల భవనంలో బుధవారం తెల్లవారుజమున మంటలు చెలరేగడంతో తప్పించుకునే మార్గం లేక మెట్లపైనే సజీవదహనం అయ్యారు. అయితే బిల్డింగ్ నిర్మాణంలో భద్రతా విధానాలు పాటించకపోవడం.. అగ్నిమాపక నిబంధనలు నిర్లక్ష్యం చేయడం వల్లే ఇంత పెద్ద ప్రమాదం జరిగినట్లుగా పోలీసులు గుర్తించారు. ఇప్పటికే బిల్డింగ్ యజమానిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ ముగిసే వరకు కస్టడీలో ఉంటాడని కువైట్ ఉప ప్రధాని, రక్షణ మంత్రి తెలిపారు. ఇదిలా ఉంటే ఈ అగ్నిప్రమాదంలో భారతీయులే ఎక్కువగా చనిపోవడం బాధాకర విషయం. దాదాపు 45 మంది దక్షిణాది రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు. ఇక ప్రధాని మోడీ సమీక్ష నిర్వహించి.. మృతుల కుటుంబాలకు రూ. 2లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు.

## పవన్ కల్యాణే డిప్యూటీ సీఎం.. కీలక శాఖలు కూడా అప్పగింత



ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించింది. అసెంబ్లీలో మెజార్టీ సీట్లను సొంతం చేసుకుంది. ఇక చంద్రబాబు ముఖ్యమంత్రిగా మొన్న ప్రమాణస్వీకారం చేసి.. శుక్రవారం సీఎంగా బాధ్యతలు తీసుకున్నారు. మంత్రులు కూడా చంద్రబాబుతో పాటే ప్రమాణస్వీకారం చేసినా.. శాఖల కేటాయింపునకు మాత్రం రెండ్రోజుల సమయం తీసుకున్నారు. ముఖ్యమంగా తెలుగు రాష్ట్ర ప్రజలంతా జనసేన అధినేత, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్‌కు ఏ శాఖను కేటాయిస్తారనే ఉత్కంఠ కొనసాగింది. మరోవైపు ఆయనకు డిప్యూటీ సీఎం ఖాయమని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, మెగాస్టార్ చిరంజీవి ముందుగానే హింట్ ఇచ్చారు. శాఖల కేటాయింపు మాత్రమే తెలియాల్సి ఉండగా.. తాజాగా వాటిని కూడా కేటాయించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం పదవితో పాటు.. పలు కీలక శాఖలు అప్పగించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలను పవన్ కల్యాణ్‌కు కేటాయించారు. అయితే.. ఈ శాఖల కేటాయింపునకు ముందు పవన్ కల్యాణ్‌కు హోంశాఖ ఇస్తారని అంతా అనుకున్నారు. అభిమానులు కూడా ఇదే ప్రచారం చేసుకున్నారు. కానీ.. పవన్ కల్యాణ్‌కు ఉన్న ఇంట్రెస్ట్ కారణంగానే.. ఆయా శాఖలను కేటాయించినట్లు తెలుస్తోంది. అధికారికంగా విడుదల చేసిన జాబితాలో పంజాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలను కేటాయించారు. డిప్యూటీ సీఎంతో పాటు కీలక శాఖలు పవన్‌కు ఇవ్వడంతో అభిమానులు, జనసేన కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## ఇటలీలో పలువురు అధ్యక్షులతో ప్రధాని మోడీ ద్వైపాక్షిక చర్చలు..



ఇటలీలోని అపులియాలో జీ-7 సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా.. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో ప్రధాని నరేంద్ర మోడీ సమావేశమై ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ ఏడాదిలో ఇరువురు నేతల మధ్య ఇది ??రెండో సమావేశం. ఈ సమావేశం అనంతరం.. ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీతో కూడా ప్రధాని మోడీ సమావేశమయ్యారు. ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అంతకుముందు బ్రిటన్ ప్రధాని రిషి సునక్ తో సమావేశమయ్యారు. కాగా.. జీ7 సమ్మిట్ ఔట్రీచ్ సెషన్‌లో పాల్గొనడానికి ప్రధాని మోడీ ఈరోజు ముందుగానే ఇటలీలోని అపులియా చేరుకున్నారు. శుక్రవారం కార్యక్రమం సందర్భంగా పలువురు నాయకులను కలవనున్నారు. ప్రధాని మోడీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ప్రధానికి ఇదే తొలి విదేశీ పర్యటన. ఇదిలా ఉంటే.. జీ7 సదస్సుకు మోడీతో సహా.. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మెక్రాన్, జపాన్ ప్రధాని ఫుమ్లో కిషిడా, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, ఇటలీ మహిళా ప్రధాని జార్జియా మెలానీ తదితర అగ్రనేతలు హాజరయ్యారు. రెండ్రోజుల పాటు మోడీ ఇటలీలో పర్యటించనున్నారు. సదస్సులో భాగంగా.. అమెరికా, జపాన్, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, కెనడా దేశాధినేతలతో పాటు సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్, అబుధాబి రాజు షేక్ మోహమ్మద్ బిన్ జాయద్, మరి కొందరు అరబ్ రాజకుటుంబీకులను మోడీ కలువనున్నారు.

## అమెరికా చేతిలో ఓడిన పాకిస్తాన్.. యూఎస్ విదేశాంగ ప్రతినిధి ఏమన్నారంటే..



20 ప్రపంచకప్‌లో ఈసారి పాకిస్తాన్‌పై పసికూన అమెరికా గెలుపు సంచలనంగా మారింది. బలమైన పేస్, బ్యాటింగ్ లైనప్ ఉన్న పాకిస్తాన్ జట్టును సూపర్ ఓవర్‌లో అమెరికా మట్టికరిపించింది. ఈ విషయంపై అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్‌ని విలేకరులు ప్రశ్నించిన సమయంలో.. తాను ఈ విషయంలో అంత నిపుణుడిని కాదంటూ సమాధానం ఇచ్చారు. పాకిస్తాన్ క్రికెట్ టీం ఆర్మీతో శిక్షణ తీసుకుంది, అమెరికా చేతిలో ఓడిపోయింది. దీని గురించి మీరు ఏం అనుకుంటున్నారని ఓ విలేకరి ప్రశ్నించిన నేపథ్యంలో మాథ్యు మిల్లర్ ఇలా స్పందించారు. "నాకు నైపుణ్యం ఉన్న ప్రాంతానికి మించిన విషయాలపై వ్యాఖ్యానించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు నేను తరుచుగా ఇబ్బందుల్లో పడతాను. పాకిస్తాన్ క్రికెట్ జట్టు ఖచ్చితంగా ఆ వర్గంలో ఉంటుందని నేను చెబుతాను" అని మిల్లర్ అన్నారు. టీ20 ప్రపంచకప్ టోర్నీలో పాకిస్తాన్ వర్సెస్ అమెరికా మ్యాచ్ హైలెట్‌గా నిలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 20 ఓవర్లలో 159 పరుగులు చేసింది. ఆ తర్వాత 20 ఓవర్లలో అమెరికా 159 పరుగులు చేయడంతో మ్యాచ్ టై అయింది. సూపర్ ఓవర్‌లో అమెరికా 18 పరుగులు చేయగా.. పాకిస్తాన్ 13 పరుగులు మాత్రమే చేసి ఘోర పరాజయాన్ని మూటకట్టుకుంది. దీంతో సొంతదేశంలో పాక్ టీంపై అభిమానులు ఫైర్ అవుతున్నారు. ఇదే కాకుండా భారత్ చేతిలో కూడా పాకిస్తాన్ ఓడిపోవడంతో పాక్ టీంపై ట్రోల్స్ మొదలయ్యాయి. 120 పరుగుల టార్గెట్‌ని సాధించలేక, భారత బౌలర్ల దెబ్బకు పాక్ బ్యాటర్లు వణికిపోయారు. ముఖ్యంగా జస్ప్రీత్ బూమ్రా బౌలింగ్‌కి దాసోహమయ్యారు. ప్రస్తుతం సూపర్-8కి అర్హత సాధించేందుకు ఆదివారం ఐర్లాండ్‌తో పాకిస్తాన్ తలపడబోతోంది. ఇదిలా ఉంటే ఇప్పటికే ఇండియా, యూఎస్ఏ మొదటి రెండుస్థానాల్లో ఉన్నాయి. మూడో స్థానంలో పాకిస్తాన్ ఉంది.

# హస్తినలో పెరుగుతున్న తాగునీటి ఎద్దడి



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని తీవ్ర జల సంక్షోభం నెలకొంది. పొరుగు రాష్ట్రాల నుంచి నీటి సరఫరా తగ్గడంతో ఢిల్లీలోని చాలా ప్రాంతాల్లో నీటి ఎద్దడి దారుణంగా పెరిగింది. యమునా నదీ జలాల సరఫరా విషయంలో ఢిల్లీ, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్ మధ్య వివాదాలు తారాస్థాయికి చేరడంతో నీటి కష్టాలు తీవ్రమయ్యే ప్రమాదకర పరిస్థితి దాపురించింది. మండుతున్న ఎండలకు తోడు నీటి కొరతతో ప్రజలు అల్లాడుతుంటే ట్యాంకర్ మాఫియా, రాజకీయ నేతల మధ్య మాటల యుద్ధం ఈ సమస్యను మరింత జఠిలం చేస్తున్నాయి.

### ఆగిన సరఫరా.. తగ్గిన నిల్వలు

ఢిల్లీ తాగునీటి అవసరాల్లో 90 శాతం యమునా నదీ మునాక్ కాలువ ద్వారా తీరుతోంది. మరికొంత ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఎగువ గంగ కాల్వల ద్వారా వచ్చే నీటితో ఢిల్లీ నీటి కష్టాలు తీరుతున్నాయి. యమునా నదిపై ఉన్న చంద్రవాల్, వజీరాబాద్, ఓక్లా నీటి శుద్ధి కర్మాగారాలుసహా మరో నాలుగు ప్లాంట్‌ల ద్వారా ఢిల్లీకి అవసరమైన నీటి సరఫరా జరుగుతోంది. ఢిల్లీకి ప్రతి రోజూ 1,200 మిలియన్ గ్యాలన్ల నీరు అవసరం ఉండగా ఢిల్లీ జల్ బోర్డు 950 మిలియన్ గ్యాలన్ల నీటినే సరఫరా చేస్తోంది. హరియాణా ప్రభుత్వం మునాక్ ఉప కాల్వల ద్వారా 683 క్యూసెక్కులు, ఢిల్లీ చిన్న కాల్వల ద్వారా మరో 330 క్యూసెక్కుల నీటిని వజీరాబాద్ నీటి శుద్ధి రిజర్వాయర్‌కు సరఫరా చేయాల్సి ఉంది. మొత్తంగా రోజుకి 1,013 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉన్నా హరియాణా ప్రభుత్వం కేవలం 840 క్యూసెక్కుల నీటినే విడుదల చేస్తోందని ఢిల్లీ ప్రభుత్వం ఆరోపిస్తోంది. హరియాణా నీటి సరఫరాను తగ్గించడంతో ఉత్తర, పశ్చిమ ఢిల్లీకి నీటిని సరఫరా చేసే వజీరాబాద్ రిజర్వాయర్‌లో నీటి మట్టాలు తగ్గుతున్నాయి. రిజర్వాయర్‌లో సగటు నీటి మట్టం 674.5 అడుగులు కాగా ప్రస్తుతం 669 అడుగులకు పడిపోయింది. దీంతో రిజర్వాయర్ నుంచి రోజుకు 70 మిలియన్ గ్యాలన్‌ల నీరు మాత్రమే విడుదల అవుతోందని ఢిల్లీ జల వనరుల మంత్రి అతిశి ఆరోపించారు. దీంతో చాలా ప్రాంతాల్లో నీటి సరఫరా తగ్గి ట్యాంకర్లపై జనం ఆధారపడుతున్నారు. ఇదే అదునుగా ట్యాంకర్ మాఫియా రెచ్చిపోయింది. ఇష్టారీతిగా డబ్బులు వసూలు చేస్తోంది. నీటి ఎద్దడి అంశంలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా హరియాణా ముఖ్యమంత్రి నయాబ్‌సింగ్ షైనీతో మాట్లాడి, నీటి సరఫరా పెంచే విషయమై చర్చలు జరుపుతున్నారు. మునాక్ కాలువ, ఇతర కాల్వల నుంచి ట్యాంకర్ మాఫియా నీటి దోపిడీపై ప్రత్యేక దర్యాప్తు బృందంచే విచారణ చేపట్టాలని బుధవారం బీజేపీ రాష్ట్ర శాఖ డీజీపీకి విజ్ఞప్తి చేసింది. నీటి ఎద్దడికి రాజధానిలా మారుతున్న ఢిల్లీలో చాలా కాలనీల్లో ఎటు చూసినా మహిళలు, చిన్నారులు బిందెలు, బకెట్లు పట్టుకుని పెద్దపెద్ద క్యూ లైన్లలో నిల్చున్న దృశ్యాలే కనిపిస్తున్నాయి.

### మాట మార్చిన హిమాచల్‌ప్రదేశ్

ఇన్నాళ్లూ నీటిని సరఫరా చేసిన హిమాచల్ ప్రదేశ్ మాట మార్చింది. తమ వద్ద 135 క్యుసెక్కుల మిగులు జలాలు లేవని, కావాలంటే యమునా బోర్డును ఆశ్రయించాలని ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. హిమాచల్ నుంచి హరియాణాకు వచ్చిన మిగులు జలాలను ఢిల్లీ కోసం విడుదల చేయాలంటూ కేజ్రీవాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలుచేసిన నేపథ్యంలో ప్రతిగా హిమాచల్ సర్కార్ కోర్టులో అఫిడవిట్ సమర్పించింది. ఈ కేసును గురువారం జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ప్రసన్న బి.వరాలేల సుప్రీంకోర్టు ధర్మాసనం విచారించింది. " నీటి నిర్వహణలో ఢిల్లీ ప్రభుత్వం విఫలమైంది. కాల్వల ద్వారా నీటి పంపిణీ నష్టాలను తగ్గించడంలో, నీటి చౌర్యాన్ని నియంత్రించడం, తలసరి నీటి వినియోగాన్ని నియంత్రించడంలో ఢిల్లీ వైఫల్యం చెందింది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పంపిణీ నష్టాలు 10శాతం ఉంటే ఢిల్లీలో ఏకంగా 52.35 శాతం నష్టాలు ఉన్నాయి. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నిర్దేశకాల ప్రకారం పట్టణ నీటి తలసరి సరఫరా 135 లీటర్లుగా ఉంటే ఢిల్లీలో అతిగా 172 లీటర్లు సరఫరాచేస్తున్నారు. హిమాచల్ వద్ద వాస్తవానికి మిగులు జలాలు లేవు. ఉన్నాయంటూ గతంలో ఇచ్చిన ప్రకటనను ఉపసంహరించుకునేందుకు అనుమతి ఇవ్వండి' అని హిమాచల్ అడ్వకేట్ జనరల్ కోర్టుకు విన్నవించుకున్నారు. దీనిపై కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. " ఇదెంత తీవ్రమైన అంశమో మీకు తెలియట్లేదు. మీపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలో వద్దో తర్వాత తేలుస్తాం' అని ఆగ్రహం వ్యక్తంచేసింది. దీంతో గత ప్రకటన ఉపసంహరణకు పద్ధతి ప్రకారం అఫిడవిట్ సమర్పిస్తానని అడ్వకేట్ జనరల్ చెప్పారు.

### మాకంత నైపుణ్యం లేదు

హిమాచల్ వాదనలు విన్నాక మానవతా దృక్పథంతో నీటిని సరఫరా చేయాలని సాయంత్రంకల్లా ఎగువ యమునా జలబోర్డ్ వద్ద దరఖాస్తు పెట్టుకోవాలని ఢిల్లీ సర్కార్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. " యమునా నదీ జలాల పంపకం అనేది సంక్లిష్టమైన వ్యవహారం. ఇప్పటికిప్పుడు మధ్యేమార్గంగా నదీజలాల పంపకం సమస్యను తీర్చేంత స్థాయిలో మాకు సాంకేతిక నైపుణ్యం లేదు. 1994 అవగాహనా ఒప్పందం ద్వారా రాష్ట్రాలు ఏర్పాటు చేసుకున్న యమునా బోర్డే ఈ సమస్యకు పరిష్కారం చూపగలదు. అదనంగా 150 క్యూసెక్కుల కోసం ఢిల్లీ గతంలోనే దరఖాస్తు చేసుకుంది. దానిపై జలబోర్డ్ త్వరగా నిర్ణయం వెలువర్చాలి. లేదంటే శుక్రవారం నుంచి రోజువారీగా బోర్డ్ సమావేశమై సమస్యను పరిష్కరించాలి" అని కోర్టు వ్యాఖ్యానించింది.

### ఢిల్లీ ప్రభుత్వ వాదనేంటి?

నీటి ట్యాంకర్ల మాఫియాపై ఢిల్లీ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు బుధవారం తలంటిన నేపథ్యంలో గురువారం కేజ్రీవాల్ సర్కార్ అఫిడవిట్ సమర్పించింది. " ట్యాంకర్ల మాఫియా హరియాణా వైపు ఉన్న యమునా నది వెంట రెచ్చిపోతోంది. ఆ ప్రాంతం ఢిల్లీ జలబోర్డ్ పరిధిలోకి రాదు. అసలు అక్కడ చర్యలు తీసుకునే అధికారం ఎవరికి ఉందో తేల్చాలని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నాం. స్పందన శూన్యం. హరియాణా నుంచి ఢిల్లీకి నీటి సరఫరా వృథాను 30 శాతం ఉంచి ఐదు శాతానికి తగ్గించాం" అని అఫిడవిట్‌లో పేర్కొంది. గురువారం ఢిల్లీ ప్రభుత్వం తరఫున అభిషేక్ సింఘ్వీ కోర్టులో వాదించారు. " జలబోర్డులు ప్రభుత్వ అనుకూల అధికారులతో నిండిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో కమిటీ వేసి సుప్రీంకోర్టే సమస్యను పరిష్కరించాలి' అని అన్నారు. ఈ వాదనతో హరియాణా విభేధించింది. " ఢిల్లీకి నీటిని సరఫరా చేసే వజీరాబాద్ బ్యారేజీలో కనీస నీట నిల్వలు ఉండాల్సిందే. అతి సరఫరా కుదరదు. ఈ అంశాన్ని యమునా బోర్డ్‌కు వదిలేస్తే మంచిది' అని హరియాణా తరఫున లాయర్ శ్యామ్ దివాన్ వాదించారు. ఈ అంశాన్ని ఇకపై జలబోర్డే చూసుకుంటుందని అదనపు సొలిసిటర్ జనరల్ విక్రమ్‌జీత్ బెనర్జీ చెప్పారు. దీంతో జలబోర్డులో తేల్చుకోండంటూ ఢిల్లీ సర్కార్ వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. మరోవైపు రోజుకు 5 కోట్ల గ్యాలెన్ల నీటి సరఫరా తగ్గడంతో నీటిని వృథా చేయకండని ఢిల్లీవాసులకు ప్రభుత్వం సూచనలు చేసింది.

# కేంద్రంలోనూ జీపీఎస్..



అమరావతి: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు జాతీయ పెన్షన్ స్కీం (కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం-సీపీఎస్) విషయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ ప్రభుత్వం అనుసరించిన విధానం వైపే కేంద్ర ప్రభుత్వం కూడా అడుగుల వేస్తోంది. 2004 నుంచి అమల్లోకి వచ్చిన జాతీయ పెన్షన్ స్కీం ద్వారా ఉద్యోగులు రిటైరయ్యాక వారికి పెన్షన్ చాలా తక్కువగా వస్తోందని, పాత పెన్షన్ స్కీంను అమలుచేయాలని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు వివిధ రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. నిజానికి.. 2004లో తీసుకొచ్చిన సీపీఎస్ ప్రకారం.. ఉద్యోగులు పది శాతం, ప్రభుత్వాలు పది శాతం పెన్షన్ నిధికి జమచేస్తాయి. మార్కెట్ అధారిత రిటర్న్‌ల ప్రకారం ఆ నిధి నుంచి ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం పెన్షన్ వస్తుంది. మార్కెట్‌లపై ఆధారపడటంతో ఇంత పెన్షన్ వస్తుందనే గ్యారెంటీ లేదు. కొందరు ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం బేసిక్ వేతనంలో కనీసం 20 శాతం కూడా పెన్షన్ వచ్చే పరిస్థితిలేదు. ఈ నేపథ్యంలో.. 2019 ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల డిమాండ్ మేరకు సీపీఎస్‌ను రద్దుచేస్తామని వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. అయితే, సీపీఎస్ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అయినందున దీనిపై జగన్ ముఖ్యమంత్రి అయ్యాక సుదీర్ఘ కసరత్తు చేశారు. 2004కు ముందు ఉద్యోగంలో చేరిన వారికి పాత పెన్షన్ విధానంలో పదవీ విరమణ తర్వాత ఎక్కువ పెన్షన్ రావడం.. 2004 తర్వాత ఉద్యోగంలో చేరిన వారికి చాలా తక్కువ పెన్షన్ రావడం వంటి అసమానతలు నెలకొన్నాయి. అలాగని, సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విదానంలోకి వెళ్తే రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలపై భవిష్యత్తులో పెనుభారం పడటమే కాకుండా జీతాలు, పెన్షన్లు చెల్లించలేని పరిస్థితి నెలకొంటుందని ఆర్బీఐ వంటి సంస్థల అధ్యయనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో.. సీపీఎస్ ఉద్యోగులకు మేలు చేయాలనే తపనతో జగన్ సర్కారు సుదీర్ఘ కసరత్తు చేసింది. రిటైర్డ్ ఉద్యోగుల జీవన ప్రమాణాలను కూడా నిలబెట్టేలా గ్యారెంటీ పెన్షన్ స్కీం (జీపీఎస్‌ను)ను రూపొందించింది. దీని ప్రకారం.. బేసిక్ జీతంలో 50 శాతం అంటే రూ. 1 లక్ష జీతం ఉంటే రిటైరైన తర్వాత రూ. 50 వేలు పెన్షన్‌గా వస్తుంది. 62 ఏళ్లకు రిటైరైతే 82 ఏళ్లలో కూడా అదే స్థాయిలో జీవన ప్రమాణాలు ఉండాలన్న ఆలోచనతో ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని డీఆర్‌లు ఇచ్చేలా జీపీఎస్‌లో పొందుపరిచారు.


### సీపీఎస్‌లో మార్పులకు కేంద్రం కమిటీ..

ఇదిలా ఉంటే.. కేంద్ర ప్రభుత్వోద్యోగుల డిమాండ్ నేపథ్యంలో జాతీయ పెన్షన్ స్కీం విధానంలో మార్పులు చేయడానికి కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి నేతృత్వంలో కమిటీనీ ఏర్పాటుచేసింది. ఉద్యోగులు, ప్రభుత్వం తమతమ కంట్రిబ్యూషన్‌ను కొనసాగిస్తూనే 2004 తర్వాత చేరిన ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం మరింత మెరుగైన పెన్షన్ వచ్చేలా మార్గాలను కేంద్ర కమిటీ అన్వేషించింది. ఇందుకు సంబంధించిన సిఫార్సులతో ఇటీవల కేంద్రానికి ఆ కమిటీ నివేదిక సమర్పించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ కమిటీ కూడా జగన్ సర్కారు తీసుకొచ్చిన జీపీఎస్‌లోని అంశాలనే సిఫార్సు చేసిందని, ఇది దేశానికే ఆదర్శంగా నిలిచిందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇక అప్పట్లో ఉద్యోగ సంఘాలతో జరిగిన సమావేశంలో వైఎస్ జగన్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో దేశమే ఈ పెన్షన్ స్కీంను అమలుచేసే పరిస్థితి రాబోతుందని చెప్పారు. ఇప్పుడు అక్షరాలా అదే నిజమవుతోంది.

### జగన్ సర్కార్ చేసిన మార్పులివే..

2004 పెన్షన్ సంస్కరణలను కాపాడుతూనే వైఎస్ జగన్ సర్కార్ జాతీయ పెన్షన్ స్కీంలో మార్పులు చేస్తూ జీపీఎస్‌ను తీసుకొచ్చింది. ఇటు రాష్ట్రంపై ఆర్థిక భారం పెద్దగా పడకుండా ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం చివరి నెల బేసిక్ వేతనంలో 50 శాతం పెన్షన్ గ్యారెంటీని జగన్ సర్కారు ఇచ్చింది. తద్వారా ఏపీజీపీఎస్‌లో ఉద్యోగులు రిటైరయ్యాక చివరి నెలలో డ్రా చేసిన మూల వేతనంలో 50 శాతం పెన్షన్‌కు గ్యారెంటీ ఇస్తోంది. - అలాగే, ఉద్యోగి మరణిస్తే జీవిత భాగస్వామికి హామీ ఇచ్చిన పెన్షన్‌లో 60 శాతం పెన్షన్ వస్తుంది.

# ఇదేం ట్విస్ట్ వయనాడ్ బరిలో ఆమె.. పేరు పరిశీలిస్తున్న కాంగ్రెస్!



న్యూఢిల్లీ: వయనాడా? రాయ్‌బరేలీనా?.. మరో మూడు రోజుల్లో ఏఎంపీ సీటు వదులుకుంటారో రాహుల్ గాంధీ నిర్ణయించుకోవాల్సిన పరిస్థితి. లేకుంటే.. ఆ రెండు స్థానాలకు ఆయన కోల్పోవాల్సి వస్తుంది. ఈ విషయంలో తానూ డైలమాలో ఉన్నట్లు స్వయంగా రాహుల్ గాంధీనే ప్రకటించారు. దీంతో ఆయన నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది. రాయ్‌బరేలీ, వయనాడ్ నియోజకవర్గాల నుంచి బరిలో నిలిచిన రాహుల్ గాంధీ భారీ మార్జిన్లతో గెలుపొందిన విషయం తెలిసిందే. ఒక్కపక్క.. తమ దగ్గరి నుంచే ఎంపీగా కొనసాగాలంటూ ఇరు రాష్ట్రాల కాంగ్రెస్ సీనియర్లు రాహుల్‌ను కోరుతుండడం గమనార్హం. మరోవైపు.. తన నిర్ణయం రెండు నియోజకవర్గాల ప్రజలకు సంతోషాన్ని ఇస్తుందని రాహుల్ తాజాగా స్పష్టం చేశారు. ఇరు చోట్లా పర్యటించిన అనంతరం వయనాడ్‌నే ఆయన వదులుకోవడం దాదాపు ఖరారు కాగా.. ఈలోపు ఆ స్థానంలో పోటీ కోసం తెరపైకి కొత్త పేరు వచ్చింది. రాయ్‌బరేలీ నుంచి రాహుల్ గాంధీ కొనసాగడం దాదాపుగా ఖరారైందని.. ఆయన వదిలేసే వయనాడ్ నుంచి కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ వాద్రా పోటీ చేయబోతున్నారన్నది ఆ ప్రచార సారాంశం. జాతీయ రాజకీయాల్లో ఉత్తరప్రదేశ్‌కు ఉన్న ప్రాధాన్యత రీత్యా రాహుల్ గాంధీ రాయ్‌బరేలీ ఎంపీగా కొనసాగే అవకాశాలు మెండుగా ఉన్నాయన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అలాగే రాయ్‌బరేలీ సీటును వదులుకోవద్దని అమేథీ కాంగ్రెస్ ఎంపీ కిషోరీ లాల్ శర్మ ఇప్పటికే రాహుల్ గాంధీకి విజ్ఞప్తి చేశారు. అదే టైంలో రాహుల్ వయనాడ్‌ను వదులుకోవచ్చని కేరళ కాంగ్రెస్ చీఫ్ కే సుధాకరన్ కూడా సంకేతాలిచ్చారు. రాహుల్ గనుక ఆ నిర్ణయం తీసుకుంటే.. కేరళ నుంచి పార్టీ సీనియర్‌ను బరిలో దించురతాని సీడబ్ల్యూసీ వర్గాలు తొలుత చెప్పాయి. అయితే.. రాహుల్ గాంధీ సోదరి ప్రియాంక గాంధీ వాద్రా రాజకీయ ఆరంగేట్రంపై మరోసారి ఉత్కంఠ నెలకొంది. ఇటీవలి ఎన్నికల ముందు ఆమె పోటీకి దిగుతారని వార్తలు వెలువడగా ఆమె వాటిని ఖండించారు. ఇక ఇప్పుడు రాయ్‌బరేలీ, వయనాడ్ నుంచి గెలిచిన రాహుల్ గాంధీ వయనాడ్ సీటు వదులుకోనున్నారన్న వార్తల నడుమ మరోసారి ప్రియాంక ఎన్నికల ఆరంగేట్రంపై ఆసక్తికర కథనాలు వెలువడుతున్నాయి. నా సోదరి వారణాసి నుంచి పోటీ చేసి ఉంటే మోదీ 2 - 3 లక్షల ఓట్ల తేడాతో ఓడిపోయి ఉండేవారు తాజాగా రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్య

### గతంలోనూ..

ప్రియాంకా గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లో దిగుతారనే టాపిక్ ఈనాటి కాదు. 2019 లోక్‌సభ ఎన్నికల నుంచే మొదలయ్యాయి. అప్పట్లో ఆమె వారణాసి నుంచి పోటీ చేస్తారన్న కథనాలు వెలువడగా ఆమె వాటిని ఖండించారు. ఆ తరువాత 2022 యూపీ ఎన్నికల సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ తాను సీఎం అభ్యర్థిని కావచ్చని కూడా వ్యాఖ్యానించారు. ఆ తరువాత తాను నోరు జారానంటూ వివరణ ఇచ్చారు. ఇక ఈసారి ఎన్నికల ముందు సోనియా గాంధీ తన కంచుకోట రాయ్‌బరేలీ నియోజకవర్గం నుంచి తప్పుకుని రాజ్యసభకు ఎన్నికైన విషయం తెలిసిందే. దీంతో, ఆమె స్థానంలో ప్రియాంక బరిలో దిగుతారన్న ఊహాగానాలు బయలుదేరాయి. ఇక.. రాహుల్ గాంధీ అమేథీ నుంచి స్మృతీ ఇరానీపై పోటీ చేస్తారని కూడా భావించారు. ఈ విషయమై ఆలోచించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా వారిని కోరినట్టు కథనాలు వెలువడ్డాయి. గాంధీ కుటుంబానికి కంచుకోటలుగా పేరు గాంచిన నియోజకవర్గాల నుంచి పోటీ చేయకపోతే తప్పుడు సంకేతాలు వెళ్లొచ్చని కూడా ఆయన అభిప్రాయపడ్డారట. అయితే, తాను బరిలో దిగబోనని ప్రియాంక మరోసారి స్పష్టం చేస్తూ ఊహాగానాలకు ముగింపు పలికారు. తనూ బరిలోకి దిగి గెలిస్తే ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఎంపీలు పార్లమెంటులో కాలుపెట్టినట్టు అవుతుందని, కుటుంబపాలన అంటూ విమర్శలు గుప్పిస్తున్న బీజేపీకి ఇది మరో ఆయుధంగా మారుతుందని ఆమె భావించారట. దీంతో ఇప్పుడు వయనాడ్ నియోజకవర్గాన్ని రాహుల్ వదులుకుంటారా? లేదా? లేదా అన్న దానిపై ప్రియాంక గాంధీ నిర్ణయం ఆధారపడి ఉంటుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

## గ్రూప్-2 అభ్యర్థులకు అలర్ట్.. దరఖాస్తు ఎడిట్‌కు అవకాశం




తెలంగాణ గ్రూప్-2 అభ్యర్థులకు సంబంధించి పబ్లిక్ సర్వీస్ కమిషన్ కీలక ప్రకటన చేసింది. పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు.. ఆ దరఖాస్తు లో ఏమైనా పొరపాట్లు ఉంటే సరిదిద్దుకునే ఛాన్స్ ఇచ్చింది. గ్రూప్ 2 అభ్యర్థులకు దరఖాస్తు ఎడిట్‌కు ఆప్షన్ ఇచ్చింది. ఈ నెల 16 నుండి 20 వ తేదీ వరకు ఎడిట్ చేసుకునే అవకాశం కల్పించింది. ఈ నెల 16 న ఉదయం 10 గంటల నుంచి ఈ ఎడిట్ ఆప్షన్ అందుబాటులోకి రానుంది. చివరి తేదీ ఈ నెల 20 సాయంత్రం 5 గంటల వరకు పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేర్కొంది. ఈ అవకాశం చివరిదని.. మరో అవకాశం ఉండబోదని వెల్లడించింది. అందువల్ల అభ్యర్థులు ఈ సమయంలో ప్రతి విషయాన్ని జాగ్రత్త చెక్ చేసుకోవాలని సూచించింది. ఈ అవకాశాన్ని వినియోగించుకునే అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, ఆధార్ కార్డుకు సంబంధించిన పత్రాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. టీజీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షను ఆగస్టు 7,8 తేదీలలో నిర్వహించనున్నట్లు ఇదివరకే ప్రకటించింది. మొత్తం గ్రూప్ 2 పరీక్షలో నాలుగు పేపర్లు ఉంటాయి.

## తీహార్ జైలులో వున్న కవితను కలిసిన కేటీఆర్..



ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తీహార్ జైలులో వున్న ఎమ్మెల్సీ కవితకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కలిశారు. శుక్రవారం కవితను మర్యాదపూర్వకంగా కలిసారు. అలాగే కవిత ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆమెను కలిసిన అనంతరం కేటీఆర్ హైదరాబాద్‌కు తిరుగు పయనం అయ్యారు. కాగా, ఇటీవల కవితకు ఢిల్లీలోని రూస్ అవెన్యూ కోర్టు జ్యుడీషియల్ రిమాండ్‌ను మరో రెండు వారాల పాటు పొడిగించిన సంగతి తెలిసిందే. ఢిల్లీ లిక్కర్ సీబీఐ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎమ్మెల్సీ కవిత సీబీఐ జ్యుడీషియల్ కస్టడీని ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు మరో సారి పొడిగించిన విషయం తెలిసిందే. కాగా సీబీఐ దాఖలు చేసిన సప్లిమెంటరీ ఛార్జిషీట్‌ను రౌస్ అవెన్యూ న్యాయస్థానం అంగీకరించింది. ఈ మేరకు సీబీఐ కేసులో ఈ నెల 21 వరకు కవిత జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. మరోవైపు.. కవిత చదువుకోవడానికి కొత్తగా తొమ్మిది పుస్తకాలు కావాలని కోర్టును కోరింది. ఎమ్మెల్సీ కవిత విజ్ఞప్తిని రౌస్ రెవిన్యూ కోర్టు అంగీకరించింది. తదుపరి విచారణను జూన్ 21వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. అదే రోజు సీబీఐ చార్జిషీట్ పరిగణనలోకి తీసుకునే అంశంపై రౌజ్ అవెన్యూ కోర్టు విచారణ జరపనుంది.

## సిక్కింలో విరిగిపడ్డ కొండచరియలు..
## ఆరుగురు మృతి. ప్రమాదంలో 1500 మంది



ఉత్తర సిక్కింలోని మంగన్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈ కారణంగా కొండచరియలు విరిగిపడటంతో ఆరుగురు మరణించారు. ఇది కాకుండా 1500 మందికి పైగా పర్యాటకులు చిక్కుకుపోయారు. ఈ మేరకు అధికారులు గురువారం సమాచారం అందించారు. సంగ్‌కలాంగ్‌లో కొత్తగా నిర్మించిన వంతెన కూలిపోయిందని, దీని కారణంగా మంగన్‌కు ద్జోంగ్, చుంగ్‌తాంగ్‌లతో సంబంధాలు తెగిపోయాయని వారు చెప్పారు. కొండచరియలు విరిగిపడటంతో రోడ్లు మూసుకుపోయాయని, అనేక ఇళ్లు నీటమునిగి దెబ్బతిన్నాయని, విద్యుత్ స్తంభాలు కొట్టుకుపోయాయని తెలిపారు.


### ఇతర ప్రాంతాలతో సంబంధాలు కట్

గురుడోంగ్‌మార్ సరస్సు, యుంథాంగ్ వ్యాలీ వంటి ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాలకు నిలయమైన మంగన్ జిల్లాలోని జోంగు, చుంగ్‌తాంగ్, లాచెన్, లాచుంగ్ వంటి పట్టణాలు దేశంలోని ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి. మంగన్ జిల్లా మేజిస్ట్రేట్ హేమ్ కుమార్ ఛెత్రీ మాట్లాడుతూ, గీతాంగ్, నాంపతంగ్‌లో చాలా ఇళ్లు దెబ్బతిన్నాయి. నిర్వాసితుల కోసం సహాయక శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఛెత్రి తెలిపారు. కొండచరియలు విరిగిపడటంతో బ్రింగ్‌బాంగ్ పోలీసు పోస్ట్‌ను సమీపంలోని ప్రదేశానికి మార్చారు. సంకలన్ వద్ద వంతెన పునాది దెబ్బతింది. నిరంతర వర్షాలు, కొండచరియలు విరిగిపడుతుండటంతో ఉత్తర సిక్కింలో మొబైల్ నెట్‌వర్క్ ప్రభావితమైందని అధికారులు తెలిపారు. మంగన్‌కు రేషన్‌తో కూడిన స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాన్ని పంపాలని జిల్లా యంత్రాంగం అభ్యర్థించింది. మంగ్‌శిలా డిగ్రీ కళాశాల సమీపంలో రోడ్డుపై ఉన్న చెత్తను తొలగించేందుకు యంత్రాన్ని ఏర్పాటు చేశారు.

### సిక్కిం ముఖ్యమంత్రి ప్రకటన

బిజెపి నాయకుడు పెమా ఖండూ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యేందుకు అరుణాచల్ ప్రదేశ్‌కు వచ్చిన సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమాంగ్ ఉత్తర జిల్లా యంత్రాంగం, పోలీసు, ఇతర శాఖల అధికారులతో మాట్లాడారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా సహాయాన్ని అందించడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ముఖ్యమంత్రి తమాంగ్ ఒక ప్రకటనలో తెలిపారు. పునరావాస సహాయాన్ని అందించడానికి, తాత్కాలిక నివాసాలకు ఏర్పాట్లు చేయడానికి, ప్రాథమిక అవసరాలను తీర్చడానికి పని జరుగుతోందని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొండచరియల కారణంగా నష్టపోయిన.. నిరాశ్రయులైన వారందరికీ అండగా నిలుస్తుంది. త్వరలో సిక్కింకు తిరిగి వెళ్లి రెస్క్యూ, రిలీఫ్ కార్యకలాపాలను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తుంది.

## ఎన్డీయే కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు మొదలైంది..



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్తగా ఏర్పాడిన ఎన్డీయే కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు మొదలైంది అని ట్విట్టర్ ( ఎక్స్ ) వేదికగా మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తెలిపారు. 16, 347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి సంబంధించిన మెగా డీఎస్సీ ఫైల్ మీద రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి సంతకం చేశారని పేర్కొన్నారు. అలాగే, ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తూ ఏపీ ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు చేస్తున్నట్లు రెండో సంతకం పెట్టారని చెప్పుకొచ్చారు. ఇక, సామాజిక పింఛన్లు 3 వేల రూపాయల నుంచి 4 వేలకు పెంచుతూ ఏపీ సీఎం మూడో సంతకం పెట్టారని జనసేన అధినేత, మంత్రి పవన్ కళ్యాణ్ వెల్లడించారు. ఇక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లు పునరుద్ధరిస్తూ సీఎం చంద్రబాబు నాలుగో సంతకం చేశారని మంత్రి పవన్ కళ్యాణ్ చెప్పారు. అలాగే, యువతలో నైపుణ్యాలు గుర్తించి వారికి బంగారు భవిష్యత్తు అందించేందుకు స్కిల్ సెన్సస్ పై అయిదో సంతకం చేశారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా రాష్ట్రంలో ఎన్డీయే కూటమి పాలన సాగుతుంది.. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి పునర్వైభవం తీసుకువచ్చేందుకు తొలి అడుగులు పడ్డాయని ఎక్స్ వేదికగా ఏపీ రాష్ట్ర మంత్రి పవన్ కళ్యాణ్ పోస్ట్ చేశారు.

## వెంకట్రామిరెడ్డి పై ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు



మెదక్ ఎంపీ రఘునందన్ రావు నిన్న కేసీఆర్ పై కేసు నమోదు అయిందని.. హరీశ్ రావు, వెంకట్రామిరెడ్డిలకు ముందుంది ముసళ్ల పండుగ అని సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ఎన్నికల్లో గెలిస్తే రూ.100 కోట్లు ఖర్చు చేస్తానని ప్రకించినట్లు గుర్తుచేశారు. అంత డబ్బు ఆయన ఎలా సంపాదించాడో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఖర్చు చేసిన డబ్బుల వివరాలు కూడా ప్రజలకు తెలియజెప్పాలని అన్నారు. వెంకట్రామిరెడ్డిని వదిలి పెట్టే ప్రసక్తే లేదని వార్నింగ్ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా కేవలం బీజేపీ కార్యకర్తల కష్ట ఫలితమే బీఆర్ఎస్ కి ఒక్క సీటు రాకపోవడానికి కారణం అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు విఫలం అయ్యాయని తెలిపారు. సుల్తానాబాద్ లో జరిగిన ఘటనే ఇందుకు నిదర్శనం అన్నారు. పెద్దపెల్లి జిల్లాలో ఆరేళ్ల బాలికపై హత్యాచారం జరిగిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలోని మమతా రైస్ మిల్లో లో తల్లితో పాటు నిద్రిస్తున్న ఆరేండ్ల బాలికను అదే మిల్లులో డ్రైవర్ గా పనిచేస్తున్న బలరాం అనే దుండగుడు సమీపంలోని పొదల్లోకి ఎత్తుకెళ్లి హత్యాచారం చేశాడు. ఉత్తరప్రదేశ్ చెందిన బలరాం అనే కూలీ ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.

# మరింత చేరువగా గ్రీన్ ఎనర్జీ

## పునరుత్పాదక విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు ఏపీఈఆర్‌సీ కొత్త మార్గదర్శకాలు




అమరావతి: పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి, వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఏపీఈఆర్‌సీ కొత్త మార్గదర్శకాలను తీసుకువచ్చింది. సౌర, పవన, జల విద్యుత్ వంటి గ్రీన్ ఎనర్జీని వినియోగదారులకు మరింత చేరువ చేసేందుకు, ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు, విద్యుత్ చట్టంలో మార్పులు చేస్తూ గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్, చార్జీలు, బ్యాంకింగ్ నిబంధనలను ఏపీఈఆర్‌సీ 'నియంత్రణ' పేరుతో రూపొందించింది. గతేడాది డ్రాఫ్ట్ రూపంలో తీసుకువచ్చి, ప్రజాభిప్రాయ సేకరణ తీసుకున్న ఏపీఈఆర్‌సీ... వీటికి ఆమోదం తెలిపింది. దేశంలో 2070కి కర్బన ఉద్గారాలను నెట్‌జీరో స్థాయికి తీసుకురావాలని, ఇందుకోసం 2030కి 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యాన్ని నెలకొల్పాలన్న కేంద్రం లక్ష్యానికి కూడా ఈ నిబంధనలు దోహదపడతాయని ఏపీఈఆర్‌సీ పేర్కొంది. రెన్యూవబుల్ ఎనర్జీ సోర్సెస్ నుంచి ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ఓపెన్ యాక్సెస్ చేయడానికి, ఇంట్రా-స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్‌లు, డిస్కంలకు ఈ 'నియంత్రణ' వర్తిస్తుంది.

### ఇవీ నిబంధనలు...

' గ్రీన్ ఎనర్జీ నూతన నిబంధనల ప్రకారం ఓపెన్ యాక్సెస్‌ను పొందడానికి దివాలా తీసిన, డిస్కంలకు రెండు నెలలు కంటే ఎక్కువకాలం బకాయిలు ఉన్న, అనధికారికంగా విద్యుత్ వినియోగం, విద్యుత్ దొంగతనం కేసు పెండింగ్‌లో ఉన్న సంస్థలకు అర్హత లేదు. ' అర్హులైన వారికి స్వల్పకాలిక గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్‌ను మంజూరు చేయడానికి (ఏపీఎస్ఎల్‌డీసీ) నోడల్ ఏజెన్సీగా పనిచేస్తుంది. ' దీర్ఘకాలిక, మధ్యకాలిక గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్ మంజూరు కోసం ఏపీ ట్రాన్స్‌కో నోడల్ ఏజెన్సీగా ఉంటుంది. గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్‌కు అన్ని దరఖాస్తులు నేరుగా రాష్ట్ర నోడల్ ఏజెన్సీలకు సింగిల్ విండో ద్వారా వెళతాయి. ' సెంట్రల్ నోడల్ ఏజెన్సీ పోర్టల్‌లో గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్‌కు సంబంధించిన మొత్తం ప్రమాచారం ప్రజలకు అందుబాటులో ఉంటుంది. అన్ని కొత్త గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి సంస్థలు(జనరేటర్ల)కు కనెక్టివిటీ మంజూరు చేస్తారు. ' ప్రస్తుతం ఉన్న వినియోగదారులు, ఉత్తత్పి సంస్థలు, ఒప్పందాలు, ప్రభుత్వ విధానం ప్రకారం ఓపెన్ యాక్సెస్‌ను పొందడం కొనసాగించవచ్చు. వారికి సంబంధిత ఒప్పందాల్లో పేర్కొన్న విధంగానే చార్జీలు వర్తిస్తాయి. ' గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్ కోసం ట్రాన్స్‌మిషన్ చార్జీలు, వీలింగ్, క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీలు, స్టాండ్‌బై చార్జీలు, బ్యాంకింగ్, రియాక్టివ్ ఎనర్జీ చార్జీలను నిబంధనల మేరకు విధిస్తారు. ' 2032 డిసెంబర్ లోగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పి, ఓపెన్ యాక్సెస్‌లో వినియోగదారులకు సరఫరా చేసే ఆఫ్‌షోర్ విండ్ ప్రాజెక్టుల నుంచి జరిగే విద్యుత్ ఉత్పత్తికి అదనపు సర్‌చార్జ్ వర్తించదు. దీర్ఘకాలిక, మధ్యస్థ కాలవ్యవధిలో గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్ కోసం ప్రాసెసింగ్ ఫీజు రూ.లక్ష కాగా, స్వల్పకాలానికి రూ.25 వేలు కడితే సరిపోతుంది. బ్యాంకింగ్ నెలవారీ బిల్లింగ్ సైకిల్ ఆధారంగా ఉండాలి.

# విభజన తెరిచిన కొత్త తలుపులు



ప్రస్తుతం ఏపీలో నెలకొని ఉన్న సామాజిక రాజకీయ పరిస్థితుల కోసం ముప్పై ఏళ్ల క్రితం 1994లో జరిగిన ఎన్నికల ముందు పంజాబ్‌కు చెందిన మాజీ రక్షణశాఖ అధికారీ, బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కాన్షీరాం ఏడాది పాటు ఇక్కడ 'క్యాంప్' చేసి, ఇప్పుడు ఇక్కడ ఉన్నటువంటి పరిస్థితుల కోసం అప్పట్లో ఆయన వెతుకులాడారు. అయితే ఆయన ఆశించిన సామాజిక సమీకరణాలు ఇక్కడ లేవని నిర్ధారించుకున్నాక ఆయన వెళ్ళిపోయారు. అప్పట్లో ఆయన ప్రయత్నం ఫలించి ఉత్తరప్రదేశ్‌లో 1995లో సమాజవాదీ పార్టీ మద్దతుతో బీఎస్పీ నుంచి మాయావతి తొలి ఎస్సీ ముఖ్యమంత్రి అయ్యారు. అవే ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్‌ను ఓడించి ఎన్టీఆర్ గెలవడంతో 1995లో చంద్రబాబు 'మార్క్' టీడీపీ రాజకీయాలకు తెలుగునాట మార్గం సుగమం అయింది. అప్పటి నుంచి యూపీ - ఏపీ రాజకీయాలు రైలు పట్టాలు మాదిరిగా సమాంతరంగానే ఉంటూ ఎక్కడా సారూప్యత లేని రీతిలో ఉన్నాయి. ఉత్తర-దక్షిణ దిక్కుల్లో ఉన్న రెండింటి మధ్య వ్యత్యాసాలు ఎన్నో ఉన్నప్పటికీ, మూడు దశాబ్దాల పైబడిన ఆర్థిక సంస్కరణల ప్రభావం దేశ సామాజిక రంగం మీద ఆ యా రాష్ట్రాలను బట్టి ఎక్కువ తక్కువగా కనిపించడం అయితే కాదనలేనిది. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడడం వెనుక ఉన్నది కూడా ఈ సంస్కరణల కాల ప్రభావమే. అలాగే సంస్కరణల్లోని 'సరళీకరణ' అంశం మనవద్ద సీబీఎన్ సరికొత్త-'ద్రవ రాజకీయాలకు' ('లిక్విడ్ పాలిటిక్స్') ప్రాతిపదిక అయింది. వాటి లక్షణం అది కనుక మారుతున్న కాలంతో పాటుగా దాన్ని ఆయన 'అడాప్ట్' చేసుకున్నారు. అయితే 'సరళీకరణ'ను తమకు తగినట్టు 'అడాప్ట్' చేసుకోవడం అనేది, ఏ ఒక్కరి గుత్త సొత్తో కాదు కనుక, సంస్కరణలు మొదలైన పదేళ్ళకే 2000లో ఉత్తరప్రదేశ్ నుంచి ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ నుంచి ఛత్తీస్‌గఢ్, బిహార్ నుంచి జార?ండ్‌లు విడిపోయాయి. మరో పదేళ్లకు ఈ రాష్ట్రాల సరిహద్దున ఉన్న తెలంగాణ... ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోయింది. దీనికి వ్యతిరేకంగా ఆధిపత్య వర్గాలు చేసిన సమైక్యాంధ్ర ఉద్యమానికి ఎన్ని కారణాలు ఉన్నా అవి దాన్ని ఆపలేక పోయాయి. ఉపరితలాల్లో కనిపించకుండా భూగర్భ పొరలను కుదిపే తాత్విక అంశం-'సరళీకరణ' అనబడే 'లిబరలైజేషన్'. ఈ ముప్పై ఏళ్లలో ఐదు కొత్త రాష్ట్రాలు ఏర్పడితే, వాటిలో కొత్త పార్టీలు ఏర్పడి అవి అధికారాల్లోకి వచ్చాయి. అలా కొత్త సమాజాలకు అవకాశాలు వచ్చాయి. ఇటువంటి జాతీయ పరిణామం చూసినప్పుడు, ప్రాంతాల మధ్య విభజన తర్వాతే... ముప్పై ఏళ్ల క్రితం కాన్షీరాం ఆశించిన కులాలవారీగా విడిపోయిన రాజకీయ ఆంధ్రప్రదేశ్ ఇక్కడ ఏర్పడలేదు.

ఇప్పటికీ కొందరు దీన్ని 'నెగిటివ్' దృష్టి నుంచి చూసినా, గడచిన పదేళ్ళలో అది 'మర్యాద' ముసుగును తొలగించుకుని మరీ 'ఓపెన్'గా మన మధ్య స్థిరపడింది. కనుక ఇప్పుడు బిహార్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల రాజకీయాల్లో 'కులం' పోషించే సూక్ష్మస్థాయి పాత్రను ఏపీ విషయంలో మనం అన్వయించి చూడవచ్చు. ఇకముందు అదేమంత 'బూతు' అవదు. ఎంత త్వరగా మనం ఏమిటో మనం స్వీయప్రకటన చేసుకుంటే అంత మేర మనకు సమయం వృథా అవదు. అయితే 2024 ఎన్నికలు ముగిసిన తర్వాత, ఏపీలో నెలకొనివున్న సామాజిక రాజకీయ సమీకరణాలను చూసినప్పుడు ఇప్పటికే అవి కాన్షీరాం దృష్టి దాటి విస్తరించాయా అనేది 'కేస్ స్టడీ' అవుతుంది. అలా కావడానికి రెండు కారణాలు కనిపిస్తున్నాయి. మొదటిది- గత ప్రభుత్వం కోనసీమ జిల్లాకు పేరు మార్చినప్పుడు మే 2022లో అమలాపురంలో జరిగిన ఆందోళన, విధ్వంసం, గృహదహనాలు విభజిత ఏపీ చరిత్రలో మొదటి సామాజిక హింసాత్మక సంఘటన. అన్ని రాజకీయ పార్టీలు సామాజికంగా అదొక సున్నితమైన తొలికూతగా గుర్తించాలి. రెండవది- కొంచెం లోతైన విస్తృతమైన చర్చ అవసరమైనది. కాపు కులం నుంచి ముఖ్యమంత్రి రావాలి, అంటూ తిరుపతి మాజీ కాంగ్రెస్ ఎంపీ చింతా మోహన్ కొంత కాలంగా కోరుతున్నారు. అలా కనుక జరిగితే, ఆ తర్వాత ఎస్సీ ముఖ్యమంత్రి అవుతారు అనేది బహుశా ఆయన ఆశ కావొచ్చు. ఈ మొత్తాన్ని సమీక్షించడానికి 2024 ఏపీ ఎన్నికల పూర్వరంగం సరైన 'ఎరీనా' అవుతుంది. ఉత్తరప్రదేశ్‌లో ఒక ఎస్సీ ముఖ్యమంత్రిగా మాయావతి 2007-12 మధ్య చెప్పుకోదగిన పరిపాలనా సంస్కరణలు తెచ్చారు. అయితే, ఎస్సీ కాకపోయినా ఓసీ కులాల్లో పేదల నుంచి అన్ని కులాల్లోని పేదల వరకూ... అందరికీ 2019-24 మధ్య జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ ఫలాలు అందాయి. కేవలం ఆర్థిక పరమైన ఊరట మాత్రమే కాకుండా ఈ ప్రభుత్వం తీసుకున్న పరిపాలనా వైఖరి కారణంగా సూక్ష్మ స్థాయిలో 'పవర్ పాలిటిక్స్' స్థానంలోకి 'ఫంక్షనల్ పాలిటిక్స్' ప్రవేశించాయి. వీటిలో 'డెలివరీ' ప్రధానం తప్ప రాజకీయ పార్టీల పట్ల విశ్వాసాలతో పెద్దగా పని ఉండదు. శ్రేణులలో కూడా మొదలైన ఇటువంటి 'లిక్విడ్ పాలిటిక్స్' ధోరణి కారణంగా ఇకముందు ముఖ్యమంత్రి కులం ప్రజల సానుకూల తీర్పుకు ప్రాతిపదిక కాకపోవచ్చు.

# నిబ్బరంతో నిలబడదాం.. భవిత మనదే



అమరావతి: 'రాష్ట్రంలో ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం హనీమూన్ కాలం నడుస్తోంది. వాళ్లకు కొంత సమయం ఇద్దాం. దాడులకు గురైన మన కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపి ఆత్మస్థైర్యంతో నిలబడదాం' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. గురువారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'శాసనసభలో ఇప్పుడు మన సంఖ్యా బలం పెద్దగా లేదు. ఆ సభలో గొంతు విప్పే అవకాశం మనకు రాకపోవచ్చు. మనల్ని గొంతు విప్పనివ్వకపోవచ్చు. కానీ శాసన మండలిలో మనకు బలం ఉంది. ప్రజల పక్షాన మీ పాత్ర మీరు సమర్థంగా పోషించాలి' అని ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. 'రాబోయే రోజుల్లో ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాలు ముమ్మరం చేద్దాం. ప్రజల్లోనే ఉందాం. ప్రజలతో కలిసి పోరాడే కార్యక్రమాలు చేపడదాం. గతంలో నేను ఏకంగా 14 నెలలు పాదయాత్ర చేశా. ఆ వయసు, సత్తువ నాకు ఈ రోజుకీ ఉన్నాయి' అని పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

### ఫలితాలు చూసి నిబ్బరం కోల్పోవద్దు

ఈ ఫలితాలు చూసి మీరు నిబ్బరాన్ని కోల్పోవాల్సిన అవసరం లేదు. జరిగిన పరిస్థితులన్నీ మీకు తెలుసు. గత ఐదేళ్లలో చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా మేనిఫెస్టోలో చెప్పినట్టుగా ఏకంగా 99 శాతం వాగ్దానాలను అమలు చేశాం. రాష్ట్ర, దేశ చరిత్రలోగానీ ఎప్పుడూ ఇలా జరగలేదు. మేనిఫెస్టోను బైబిల్, ఖురాన్, భగవద్గీత మాదిరిగా ఒక పవిత్ర గ్రంథంలా భావించి అమలు చేశాం. మేనిఫెస్టోను చూపించి అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతల ఆశీస్సులు తీసుకుని అమలు జరిగాయా? లేదా? అని వారినే అడిగి మరీ టిక్ పెట్టించాం. చరిత్రలో ఎప్పుడూ ఇలా జరగలేదు. ఏకంగా రూ.2.7 లక్షల కోట్లు ఎలాంటి లంచాలు, వివక్ష లేకుండా ప్రజలకు నేరుగా అందించాం. ఏ నెలలో ఏమిస్తామో ముందే ప్రకటించి ఏటా క్యాలెండర్ విడుదల చేసి మాట తప్పకుండా పథకాలు అమలు చేశాం. ఇవన్నీ ఎప్పుడూ చూడని మార్పులు. విద్య, వైద్యం, వ్యవసాయం, సామాజిక న్యాయం, మహిళా సాధికారిత, సుపరిపాలన విషయంలో ఎప్పుడూ చూడని సంస్కరణలు తెచ్చాం. ఇవన్నీ చేసి చూపించి ప్రజల మన్ననలు పొందిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాం. కానీ.. ఎన్నికల్లో ఏమైందో తెలియదు.

### సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీలు
### వ్యక్తిత్వం.. విలువలు, విశ్వసనీయతే ముఖ్యం

రాజకీయాల్లో అన్నిటికంటే ముఖ్యమైన అంశం క్యారెక్టర్. విలువలు, విశ్వసనీయతకు అర్థం తెలుసుకోవడం చాలా అవసరం. రాజకీయాలంటే అధికారం మాత్రమే కాదు. అధికారంలో లేనప్పుడు ఒక మనిషి ఎలా ప్రవర్తిస్తాడు? ఎలా ఉంటాడు? అన్నది కూడా రాజకీయమే. అధికారంలో లేనప్పుడు కచ్చితంగా కష్టాలు వస్తాయి. ఆ కష్టాలు వచ్చినప్పుడు ఎలా స్పందిస్తామన్నది మన చేతుల్లో ఉంది. కష్టాలు వచ్చినప్పుడు విలువలు, విశ్వసనీయత లేని మనిషిగా రాజకీయాలు చేద్దామా? లేక ఆ కష్టాలను ఎదుర్కొంటూ హుందాగా నిలబడి ముందడుగులు వేసి కష్టపడితే.. మళ్లీ అధికారంలోకి వస్తామా? అన్నది ఆలోచన చేయాలి.

### శిశుపాలుడి పాపాలు అప్పుడే మొదలయ్యాయి..

మనల్ని ఎవరూ ఏమీ చేయలేరు. మహా అయితే ఇంకో నాలుగు కేసులు పెట్టగలుగుతారు. అంతకు మించి వాళ్లు ఏం చేయగలుగుతారు? చంద్రబాబు హయాంలో చాలా త్వరగా పాపాలు పండుతాయి. మన కళ్లముందే చంద్రబాబు పాపాలు ఎలా పండుతాయో గతంలో మనం అంతా చూశాం. మన ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కులం, మతం, ప్రాంతం, రాజకీయాలు చూడలేదు. చివరికి ఏ పార్టీకి ఓటు వేశారు అన్నది చూడకుండా ప్రతి పథకాన్ని డోర్ డెలివరీ చేశాం. అర్హతే ప్రామాణికంగా ప్రతి పథకాన్ని ఇంటికే అందించాం. అలాంటి పాలన మనదైతే.. ఈ రోజు వాళ్ల పార్టీకి ఓటు వేయకపోవడమే పాపం అన్నట్టుగా రావణకాష్టం సృష్టిస్తున్నారు. విధ్వంసం చేస్తున్నారు. ఆస్తులకు నష్టం చేస్తున్నారు. అమానుషంగా దాడులకు దిగుతున్నారు. అవమానిస్తున్నారు. ఇవన్నీ శిశుపాలుడి పాపాల మాదిరిగా మొదలయ్యాయి. వారు చేసిన పాపాలు ఊరికే పోవు.

### హోదా అడక్కపోతే ఏ ఒక్క యువకుడూ క్షమించడు

చంద్రబాబు రెండో పాపం కూడా అప్పుడే పండింది. కేంద్రంలో ఇప్పుడు నెలకొన్న రాజకీయ పరిస్థితులు ఈ మధ్య కాలంలో ఎప్పుడూ లేవు. కేంద్రంలో బీజేపీ 240 సీట్లకే పరిమితం కావడం, మరోవైపు రాష్ట్రంలో టీడీపీకి మంచి ఎంపీ సీట్లు రావడంతో ఎన్డీఏలో కీలకంగా మారిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కూడా ప్రత్యేక హోదా అడగకపోవడం చంద్రబాబు చేసిన మరో పాపం. ఇలాంటి పరిస్థితుల్లో కూడా ప్రత్యేక హోదాను అడగకుంటే రాష్ట్రంలో ఏ ఒక్క యువకుడూ క్షమించడు.

### నైతిక విలువలు పాటిస్తారా?

అసెంబ్లీలో మనకున్న బలం ప్రకారం ప్రతిపక్ష హోదా ఇస్తారా? లేదా అన్నది సందేహమే. తమకు ఓటు వేయలేదన్న ఒకే ఒక్క కారణంతో మనుషులు మీద దాడులు చేస్తూ.. ఆస్తులకు నష్టం చేకూర్చి అవమానిస్తున్న పరిస్థితుల్లో.. ప్రతిపక్షంగా ఉన్న ఒకే ఒక్క పార్టీకి ఆ హోదా ఇవ్వాలన్న కనీస నైతిక విలువలు పాటిస్తారా? లేదా? అన్నది సందేహమే. అందుకే శాసన మండలిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీల పాత్ర కీలకం.

### గతంలో మాదిరిగా మళ్లీ పైకి లేస్తాం

2019 నుంచి 2024 వరకు ఐదేళ్లు ఇట్టే గడిచిపోయాయి. అదే మాదిరిగా 2024 నుంచి 2029 వరకు కూడా ఐదేళ్లు ఇట్టే గడుస్తాయి. మనం గుర్తుపెట్టుకోవాల్సిన అంశం ఏమిటంటే.. సినిమాలో ప్రస్తుతం ఫస్ట్ హాఫ్ మాత్రమే అయింది. గతంలో ఇదే మాదిరిగా పరిస్థితులు ఉన్నప్పుడు మనం ఎలా పైకి లేచామో మీ అందరికీ తెలిసిందే. మనం చేసిన మంచి ఇవాళ్టికీ ఉంది. ఇంటింటికీ మనం చేసిన మంచి బతికే ఉంది. మన పాలన మీద విశ్వసనీయత ప్రజల్లో ఇప్పటికీ ఉంది. మన పట్ల విశ్వసనీయత ఇంకా బతికే ఉంది. గడప గడపకూ మనం చేసిన మంచి ఇంకా బతికే ఉంది. ఇవన్నీ ఉన్నప్పుడు మళ్లీ మనం పైకి లేవడం అన్నది కూడా తథ్యం. కాకపోతే కొంత సమయం పడుతుంది. ఆ సమయం మనం ఇవ్వాలి. ఆ టైం ఇచ్చినప్పుడు, వాళ్ల పాపాలు పండినప్పుడు కచ్చితంగా మనం పైకి లేస్తాం. ఈ విషయం ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలి.

### పాపాలన్నీ పండేదాకా ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దు..

మనం అధికారంలో ఉండి ఉంటే క్యాలెండర్ ప్రకారం అమ్మఒడి, రైతుభరోసా, విద్యాదీవెన, వసతి దీవెన, మత్స్యకార భరోసా లాంటి పథకాలు ఇప్పటికే అమల్లో ఉండేవి. అవి ఇప్పుడు వస్తాయో, రావో తెలియని పరిస్థితి ఉంది. రాబోయే రోజుల్లో ఈ పాపాలు పండుతాయి. ఈ పాపాలన్నీ పండేదాకా.. మనం ఆత్మస్థైర్యాన్ని కోల్పోకూడదు. మనం గట్టిగా నిలబడి ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లగలిగేలా ప్రజల్లో నిరంతరం ఉండాలి. ఇవన్నీ మీకు తెలిసిన విషయాలే. నేను కేవలం గుర్తు చేస్తున్నాను. కష్టాలు రావడం సహజం. వాటిని ఎదుర్కొని నిలబడ్డం అన్నది మన చేతుల్లో అంశం.

## కేరళ చేరిన 45 మంది కార్మికుల మృతదేహాలు



కువైట్ అగ్నిప్రమాదంలో మరణించిన 45 మంది భారతీయుల మృతదేహాలు కేరళకు చేరుకున్నాయి. బుధవారం కువైట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో మొత్తం 49 మంది ప్రాణాలు కోల్పోగా.. అందులో 45 మంది భారతీయులే ఉన్నారు. ఇక 33 మంది ఆస్పత్రి పాలయ్యారని భారత రాయబార కార్యాలయం తెలిపింది. ఒకే కంపెనీకి చెందిన 176 మంది కార్మికులను అద్దె భవనంలో ఉంచారు. అయితే తెల్లవారుజామున వంటగదిలోంచి మంటలు రావడం.. అనంతరం అప్రమత్తమైన కార్మికులు తప్పించుకునే ప్రయత్నం చేశారు. అప్పటికే మంటలు, పొగ వ్యాపించడంతో ఊపిరాడక.. మెట్లపైనే సజీవదహనం అయ్యారు. ఈ ప్రమాదంపై ప్రధాని మోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2లక్షల నష్టపరిహారం ప్రకటించారు. అంతేకాకుండా హుటాహుటినా కేంద్ర విదేశాంగ సహాయమంత్రిని కువైట్‌కు పంపించారు. 45 మంది భారతీయ కార్మికుల మృతదేహాలను ఈ ఉదయం భారత్‌కు తిరిగి తీసుకువచ్చారు. భారత వైమానిక దళానికి చెందిన ప్రత్యేక విమానం కేరళలోని కొచ్చిలో దిగింది. మూడు దక్షిణాది రాష్ట్రాలకు చెందిన 31 మంది కార్మికుల మృతదేహాలను అప్పగించింది. అనంతరం మిగిలిన 14 మృతదేహాలతో ఢిల్లీకి బయలుదేరింది. బాధితుల్లో కేరళకు చెందిన 23 మంది, తమిళనాడుకు చెందిన ఏడుగురు, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లకు చెందిన ముగ్గురు, ఒడిశాకు చెందిన ఇద్దరు, బీహార్, పంజాబ్, కర్ణాటక, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, జార?ండ్, హర్యానాలకు చెందిన ఒక్కొక్కరు ఉన్నారని భారత రాయబార కార్యాలయం తెలిపింది. కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల కార్మికులతో సహా కొచ్చిలో అప్పగించిన మృతదేహాలను అంబులెన్స్‌లలో వారి ఇళ్లకు పంపించారు. ప్రధాని మోడీ సూచనల మేరకు రెండ్రోజుల్లోనే మృతదేహాలు కువైట్ నుంచి భారత్‌కు తీసుకొచ్చారు. విదేశాంగ సహాయమంత్రి కీర్తి వర్ధన్ సింగ్.. కువైట్ వెళ్లి అధికారులతో సంప్రదింపులు జరపడంతో వేగంగా పనులు పూర్తి చేసుకుని మృతదేహాలను భారత్‌కు తీసుకురాగలిగారు. లేదంటే కనీసం 10 రోజులైన పెట్టే అవకాశం ఉంటుంది. కువైట్ అధికారులకు కీర్తి వర్ధన్ సింగ్ కృతజ్ఞతలు తెలిపారు. అన్ని పేపర్లు పూర్తి చేయడానికి అధికారులు సహకరించాలని చెప్పారు. అందుకే త్వరగా మృతదేహాలను తీసుకురాగలిగామని.. లేదంటే కనీసం 10 రోజులైన పట్టేదని చెప్పారు. మోడీ సూచనల మేరకు అధికారులు త్వరగా పనులు పూర్తి చేశారని కీర్తి వర్ధన్ సింగ్ వెల్లడించారు. ఇక క్షతగాత్రులు కూడా త్వరగా కోలుకుని రెండు రోజుల్లో డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని తెలిపారు. తన పర్యటనలో ఉప ప్రధానమంత్రి షేక్ ఫహద్ అల్-యూసుఫ్ అల్-సబాను కలిశానని.. మృతదేహాలను త్వరగా స్వదేశానికి రప్పించడంలో పూర్తి మద్దతు, సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇదిలా ఉంటే కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కేంద్ర మంత్రి సురేష్ గోపి, కేంద్ర మాజీ మంత్రి మురళీధరన్ విమానాశ్రయానికి వచ్చి భౌతికకాయాలకు నివాళులర్పించారు.మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయని, బాధితుల గుర్తింపును నిర్ధారించేందుకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించామని మంత్రి తెలిపారు. అధికారులు 48 మృతదేహాలను గుర్తించారు. వారిలో 45 మంది భారతీయులు, ముగ్గురు ఫిలిప్పీన్స్ జాతీయులు ఉన్నట్లు తెలిపారు.

## ఏపీ టీడీపీ అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావు నియామకం



ఆంధ్రప్రదేశ్ టీడీపీలో భారీ మార్పు చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ టీడీపీకి.. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు కొత్త బాస్‌ను నియమించారు. ఏపీ టీడీపీ చీఫ్‌గా పల్లా శ్రీనివాసరావుని ఎంపిక చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు అధికారికంగా ఈ ప్రకటన చేశారు. టీడీపీ అధ్యక్షుడిగా తనని ప్రకటించడంతో.. తాజాగా పల్లా శ్రీనివాసరావు చంద్రబాబుని కలిశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సీఎంగా బాధ్యతలు తీసుకున్న ఆయనకు శుభాకాంక్షలు చెప్పారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పల్లా శ్రీనివాసరావు భారీ మెజార్టీతో గెలిచారు. వైసీపీ అభ్యర్థి అమర్‌నాథ్‌ను చిత్తుగా ఓడించిన పల్లా శ్రీనివాసరావు 95,235 ఓట్ల తేడాతో గెలుపొందారు. మరోవైపు గతంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న అచ్చెన్నాయుడు మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆయనకు శుక్రవారం వ్యవయశాఖను కేటాయించారు సీఎం చంద్రబాబు. ఈనేపథ్యంలోనే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని మార్చాలని చంద్రబాబు నిర్ణయించారు. దాంతో.. ఆ పదవిని ఇటీవల ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన పల్లా శ్రీనివాసరావుకి అప్పగించారు. ఇప్పుడు పల్లా శ్రీనివాసరావుకి టీడీపీ చీఫ్ బాధ్యతలు ఇవ్వడంతో టీడీపీ కేడర్ ఆయనకు అభినందనలు చెబుతున్నారు. మరోవైపు తనకు చంద్రబాబు అప్పగించిన బాధ్యతలను సమగ్రంగా నిర్వర్తిస్తానని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చెప్పారు.

## ఢిల్లీలో రోజు రోజుకు తగ్గుతున్న నీటి సరఫరా..!



దేశ రాజధాని ఢిల్లీలో నీటి సంక్షోభం రోజు రోజుకు మరింత తీవ్రతరం అవుతుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ వేసవికాలంలో ఢిల్లీలోని చాలా ప్రాంతాల్లో నీటి వనరులు తగ్గిపోయాయి. బోర్లలో నీరు మొత్తం కూడా అడుగంటి పోయింది. దీంతో ప్రజలు తమ అవసరాల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక పక్క రాష్ట్రం హర్యానా ఢిల్లీకి తక్కువ నీటిని విడుదల చేస్తుందని ఆప్ మంత్రి అతిషి గత కొద్ది రోజులుగా ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. అయితే శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆమె యమునా నదికి తక్కువ నీరు చేరుతున్నందున దేశ రాజధానిలో నీటి సంక్షోభం మరింత తీవ్రతరమైందని పేర్కొన్నారు. సాధారణ పరిస్థితుల్లో, ఢిల్లీలో రోజు 1005 మిలియన్ గ్యాలన్ల నీరు సరఫరా అవుతుంది, కానీ గత వారం నుండి ఇది నిరంతరం తగ్గుతోంది, జూన్ 6న నీటి సరఫరా రోజుకు 1,002 మిలియన్ గ్యాలన్లు (ఎంజీడీ) ఉండగా, మరుసటి రోజు 993 ఎంజీడీలకు, జూన్ 8 నాటికి 990, జూన్ 9న 978, మరుసటి రోజు జూన్ 10న 958 ఎంజీడీలు, జూన్ 11, జూన్ 12, జూన్ 13 తేదీలో వరుసగా 919, 951, 939 ఎంజీడీలుగా నమోదైందని మంత్రి తెలిపారు. వర్షాలు పూర్తి స్థాయిలో కురవకపోవడం, ఎండల తీవ్రత ఇంకా తగ్గకపోవడంతో ఢిల్లీలో నీటి కష్టాలు రాను రాను మరింత ఎక్కువ అవుతున్నాయి.

## ప్రపంచంలోనే మొట్టమొదటి ఎయిర్ టాక్సీ ప్రారంభం..



జూన్ 14, శుక్రవారం నుండి ప్రారంభమయ్యే ఈ సంవత్సరం హజ్ సీజన్‌లో యాత్రికుల కోసం స్వీయ డ్రైవింగ్ ఎయిర్ టాక్సీ సేవను ప్రారంభించింది. సౌదీ రవాణా మరియు లాజిస్టిక్ సేవల మంత్రి, సలేహ్ బిన్ నాసర్ అల్ జాసర్, పౌర విమానయాన ప్రెసిడెంట్ అబ్దుల్ అజీజ్ అల్ దుయిలేజ్, డిప్యూటీ మంత్రి డాక్టర్ రుమైహ్ అల్ రుమైహ్, ఇతర అధికారుల సమక్షంలో ఈ సేవను ప్రారంభించారు. ఈ కార్యక్రమం లాంచ్ సందర్భంగా అల్ జాసర్ మాట్లాడుతూ.., ఈ విమానం ప్రపంచంలోనే మొట్టమొదటి ఎయిర్ టాక్సీ అని, పౌర విమానయాన అథారిటీ లైసెన్స్ పొందింది. స్మార్ట్ మొబిలిటీని పెంపొందించడానికి అలాగే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల ఉపాధిని ప్రారంభించే చట్టాలు, వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి మంత్రిత్వ శాఖ కృషి చేస్తోందని ఆయన తెలిపారు. యాత్రికులను రవాణా చేయడం, అత్యవసర కదలికలను సులభతరం చేయడం, వైద్య పరికరాలను రవాణా చేయడం మరియు సరుకు రవాణా ద్వారా లాజిస్టికల్ సేవలను అందించడం లాంటి వాటిలో ఎయిర్ టాక్సీ అందించగల సేవలను కూడా సమీక్షించారు. నేషనల్ ట్రాన్స్ పోర్ట్ అండ్ లాజిస్టిక్స్ స్ట్రాటజీ లక్ష్యాలకు అనుగుణంగా ఎయిర్ టాక్సీ టెక్నాలజీలు, ఎలక్ట్రిక్ కార్లు, హైడ్రోజన్ రైళ్లను ప్రవేశపెట్టడం ద్వారా సౌదీ తన రవాణా రంగాన్ని ఆధునీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. వివిధ భవిష్యత్ రవాణా సాంకేతికతలను పరిచయం చేయడంలో పని చేయడానికి ప్రయోగాత్మక వాతావరణాలను అందించడం దీని లక్ష్యం.

# ఆగస్టు 15 నాటికి ఏన్కూరు ద్వారా నీళ్లు

**1.20 లక్షల ఎకరాలకు గోదావరి నీళ్లు అందిస్తాం**

**ఏన్కూరు కెనాల్‌కు రాజీవ్ కెనాల్‌గా నామకరణం**

**నీటి పారుదల రంగాన్ని కేసీఆర్ నాశనం చేశారు**

**సీతారామ రీడిజైన్‌తో ప్రజాధనం దుర్వినియోగం**

**రూ.8 వేల కోట్లు ఖర్చుపెట్టి.. ఎకరాకైనా నీళ్లివ్వలేదు**

**డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి**

**భద్రాద్రి జిల్లాలో సీతారామ ప్రాజెక్టు సందర్శన, సమీక్ష**



ఖమ్మం/కొత్తగూడెం/అశ్వాపురం/ములకలపల్లి, : ఆగస్టు 15 నాటికి సీతారామ ప్రాజెక్టు పరిధిలోని ఏన్కూరు లింక్ కెనాల్ నిర్మాణం పూర్తి చేసి 1.20లక్షల ఎకరాలకు గోదావరి నీళ్లను అందిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రూ.2,654కోట్లతో పూర్తయ్యే రాజీవ్, ఇందిరా సాగర్ ప్రాజెక్టులను గత ప్రభుత్వ పాలనలో రీడిజైన్ చేసి అంచనా వ్యయాన్ని రూ.20వేల కోట్లకు పెంచారని దుయ్యబట్టారు. పదేళ్లలో రూ.8వేల కోట్లు ఖర్చు చేసి.. ఒక్క ఎకరాకు కూడా నీరు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. మాజీ సీఎం కేసీఆర్ నిర్వాకం వల్లే రాష్ట్రంలో నీటిపారుదల రంగం నాశనమైందని దుయ్యబట్టారు. సీతారామ ప్రాజెక్టును వినియోగంలోకి తీసుకొచ్చి గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. భద్రాద్రి జిల్లాలో చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మ సాగర్ నిర్మాణ పనులను గురువారం మంత్రుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా భారీ విద్యుత్ మోటార్ల కోసం ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్‌ను వారు ప్రారంభించారు. అనంతరం ములకలపల్లి మండలం పూసూరు పంపుహౌస్ వద్ద ప్రాజెక్టు పురోగతిపై అధికారులతో సమీక్షించారు. డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు- ఎన్నెస్పీ కెనాల్‌ను లింక్ చేయడానికి ఏన్కూరు లింక్ కెనాల్(9కిలోమీటర్లు)ను పూర్తి చేయాలని నిర్ణయించి, రూ.72కోట్లు మంజూరు చేశామన్నారు. ఈ లింక్ కెనాల్‌కు రాజీవ్ కెనాల్‌గా నామకరణం చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రస్తుతం పంపుల ట్రయల్ రన్ కోసం ప్రాసెసింగ్ కొనసాగుతుందని తెలిపారు. 1, 2, 3 డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీల పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రంలో నీటి పారుదల రంగాన్ని కేసీఆర్ నాశనం చేశారని మంత్రి ఉత్తమ్ విమర్శించారు. ప్రణాళిక లేకుండా నిధులు దుబారా చేసి, కోలుకోలేని విధంగా రాష్ట్రానికి నష్టం చేకూర్చారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.90,400 కోట్లు ఖర్చు పెట్టి 93,000 ఎకరాల కొత్త ఆయకట్టు మాత్రమే సృష్టించగలిగారని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రూ.27వేల కోట్లు, సీతారామ ప్రాజెక్టుకు రూ.8,000 కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ఎకరాకు కూడా నీరివ్వలేదన్నారు. ఆగస్టు 15లోగా సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం జిల్లా రైతులకు గోదావరి నీళ్లను అందిస్తామన్నారు. పాలేరు లింక్ కెనాల్‌లో భాగంగా జూలూరుపాడు వద్ద టన్నెల్ నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. సీతారామ ప్రధాన కాలవ వెంట ఉన్న కొత్తగూడెం, పినపాక, భద్రాచలం నియోజకవర్గాలకు సాగునీరు అందించేందుకు డిస్ట్రిబ్యూటరీ కాలువలు నిర్మించనున్నట్లు చెప్పారు. ఏడాదిన్నరలోగా సీతారామ పనులన్నీ పూర్తి చేస్తామన్నారు.

### కష్టమైనా సీతారామ పూర్తి చేస్తాం

కష్టమైనా, భారమైనా సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం లింక్‌కెనాల్ హెడ్‌వర్క్, ఎత్తిపోతల పనులు పూర్తయ్యాయని, కొంత భూసేకరణతోపాటు జూలూరుపాడు, పాలేరు లింక్ కెనాల్‌కు సంబంధించి రెండు టన్నెళ్లు నిర్మించాల్సి ఉందన్నారు. ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా వైరా, లంకసాగర్ ప్రాజెక్టులకు నీళ్లు తీసుకెళ్తే.. కొంతమేర సాగర్ ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందన్నారు. సీతారామ ద్వారా మొత్తం 10లక్షల ఎకరాలకు నీరందిస్తామని పేర్కొన్నారు. ప్రాజెక్టుల పేరుతో గత ప్రభుత్వం ప్రజాధనాన్ని లూటీ చేసిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. సీతారామ ద్వారా ఆగస్టు 15 నాటికి 1.20లక్షల ఎకరాలకు నీళ్లు అందిస్తామన్నారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కొత్తగూడెంలో ఆయకట్టు పెంచేలా సీతారామను రీడిజైన్ చేయాలని సూచించారు.

# ఐదు సంతకాలు.. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు

**బాధ్యతలు చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు**

**16,347 టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీపై మొదటి సంతకం**

**ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పెన్షన్లు రూ.4 వేలకు పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణన ఫైళ్లపై సంతకాలు**

**ఐదేళ్ల తరువాత సీఎం హోదాలో తొలిసారిగా సచివాలయానికి చంద్రబాబు**

**ఘనంగా స్వాగతం పలికిన రాజధాని రైతులు, మహిళలు, ఉద్యోగులు, అధికారులు**



అమరావతి: ఆంధ్రప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నారా చంద్రబాబు నాయుడు గురువారం అమరావతిలోని సచివాలయం మొదటి బ్లాక్‌లో సాయంత్రం 4.41 గంటలకు వేద పండితుల పూజల అనంతరం బాధ్యతలు చేపట్టారు. సీఎం హోదాలో ఐదేళ్ల తర్వాత తొలిసారి వెలగపూడిలోని సచివాలయానికి వచ్చిన చంద్రబాబుకు రాజధాని రైతులు, మహిళలు సీడ్ యాక్సిస్ రోడ్డుకు ఇరువైపులా నిలబడి రహదారిపై పూలు చల్లి ఘనస్వాగతం పలికారు. వెంకటపాలెం వద్ద గజమాలతో స్వాగతించారు. సచివాలయం వద్ద ఉద్యోగులు, అధికారులు సీఎంను సాదరంగా ఆహ్వానించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ఆలిండియా సర్వీస్ అధికారులు.. పలువురు మంత్రులు సీఎంని కలసి శుభాకాంక్షలు తెలిపారు. తొలి రోజు ఐదు ఫైళ్లపై సీఎం చంద్రబాబు సంతకాలు చేశారు. మొదటి హామీ అయిన మెగా డీఎస్సీపై నిరుద్యోగుల సమక్షంలో తొలి సంతకం చేసిన సీఎం చంద్రబాబు 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టను రద్దు చేస్తామన్న రెండో హామీపై రైతుల సమక్షంలో సీఎం సంతకం చేశారు. సామాజిక పెన్షన్లు రూ.4 వేలకు పెంపు దస్త్రంపై లబ్ధిదారుల సమక్షంలో మూడో సంతకం చేశారు. అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై నాలుగో సంతకం, నైపుణ్య గణన దస్త్రంపై విద్యార్థుల సమక్షంలో ఐదో సంతకాన్ని పెట్టారు. ఇక ప్రజల పాలన ఉంటుందని ప్రకటించారు. కాగా డిసెంబర్ 31లోగా 16,347 టీచర్ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాల్సిందిగా పాఠశాల విద్యాశాఖను ఆదేశిస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు ఏమన్నారంటే.. ఉద్యోగాలు లేవని ఎన్నికల ప్రచార సమయంలో యువత తమ ఆవేదనను నా దృష్టికి తెచ్చారు. గత ప్రభుత్వం డీఎస్సీ ద్వారా ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదు. ఇతర ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వలేదు. పరిశ్రమలు రాకపోవడంతో ప్రైవేట్ ఉద్యోగాలు కూడా లేవు. దేశంలోనే ఎక్కువగా మన రాష్ట్రంలో 24 శాతం నిరుద్యోగం రేటు ఉంది. తొలి సంతకం మెగా డీఎస్సీపై పెడతామని ఎన్నికల ప్రచారంలో నేను, పవన్ కళ్యాణ్, బీజేపీ ఇచ్చిన హామీ మేరకు ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీపై తొలి సంతకం చేశా. గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌లో అనేక సమస్యలున్నాయి. భూములకు రక్షణ లేకుండా చేసే ఈ చట్టంతో ప్రజలకు ఇబ్బందులు వస్తాయి. భూమిని కొంతమంది కొనుగోలు చేయగా మరికొందరికి వారసత్వంగా లభించింది. ఆ పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్ బొమ్మ వేసుకోవడం ఎంత వరకు న్యాయం? దానం చేసినట్లు జగనన్న భూహక్కు అని రాసుకున్నారు. చట్టాన్ని తెచ్చి ఆయన మనుషులను పెట్టుకుంటామన్నారు. సొంత మనుషులతో రికార్డులు మార్చడానికి ప్రయత్నించారు. రికార్డులు మార్చి సెటిల్‌మెంట్లు కూడా చేసుకున్నారు. ఒకసారి రికార్డులు మార్చితే హైకోర్టుకు వెళ్లాలి. హైకోర్టుకు వెళితే ఏళ్లు పడుతుంది. అందుకే దీన్ని రద్దు చేస్తున్నాం. మొదటిసారి రూ.35తో పెన్షన్లు ప్రారంభించింది ఎన్టీఆర్. సమైక్య రాష్ట్రంలో నేను దాన్ని రూ.75కి పెంచా. విభజన తర్వాత రూ.200 ఉన్న పెన్షన్లను రూ.1,000కి, తర్వాత రూ.2 వేలకు పెంచా. తర్వాత వచ్చిన ప్రభుత్వం విడతల వారీగా పెంచింది రూ.వెయ్యి మాత్రమే. ఎన్నికల హామీ మేరకు పెన్షన్ రూ.4 వేలకు పెంచాం. పెంచిన పెన్షన్‌తో పాటు ఏప్రిల్, మే, జూన్‌కి సంబంధించి నెలకు రూ.1,000 చొప్పున కలిపి ఇస్తానని చెప్పా. పెంచిన వాటితో కలిపి జూలైలో రూ.7 వేలు పెన్షన్ లబ్ధిదారులకు అందుతుంది. దివ్యాంగుల పెన్షన్ కూడా రూ.6 వేలకు పెంచాం. పెంచిన పెన్షన్ మూడు నెలలకు వర్తిస్తున్నందున జూలైలో దివ్యాంగులు రూ.12 వేలు తీసుకుంటారు. ఉన్నత చదువులు చదివినా సరైన స్కిల్స్ లేకపోవడంతో యువతకు ఉద్యోగాలు రావడం లేదు. ప్రపంచంలో ఇప్పటి వరకు జనాభా లెక్కలు చేశారు. కులాల వారీగా లెక్కలు తీశారు. మొదటి సారిగా స్కిల్ గణనకు శ్రీకారం చుట్టాం. ఎవరికి ఎలాంటి నైపుణ్యం ఉంది? దేశంలో ఏ ఉద్యోగాలు ఉన్నాయి? దానికి తగ్గ స్కిల్స్ ఉన్నాయా లేదా? అన్నది లెక్కిస్తున్నాం. పెట్టుబడులు వచ్చినప్పుడు వేరే రాష్ట్రాల నుంచి ఉద్యోగులు కాకుండా మన రాష్ట్రం నుంచే మానవ వనరులు సమకూర్చేలా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. పేదవాళ్లకు అన్నం పెట్టాలన్న ఉద్దేశంతో గతంలో టీడీపీ హయాంలో అన్న క్యాంటీన్లు తీసుకొచ్చాం. రూ.5 చొప్పున అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం అందించాం. చిరు ఉద్యోగులు, కూలీ పనులకు వెళ్లే వారికి అవి ఎంతో ఉపయోగపడ్డాయి. కర్నాటకలో ఇందిరాగాంధీ పేరుతో, తమిళనాడులో అమ్మ క్యాంటీన్ పేరుతో వాటిని ఏర్పాటు చేస్తే మనం అన్న క్యాంటీన్లను తీసుకొచ్చాం. చాలా మంది అన్న క్యాంటీన్లలో భోజనాలకు విరాళాలు కూడా ఇచ్చారు. గత ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిని మూసివేసింది. బృహత్తర కార్యక్రమాన్ని రద్దు చేశారు. ఐదో సంతకం అన్న క్యాంటీన్ల ఏర్పాటుపై చేశా. ఎన్ని క్యాంటీన్లు ఏర్పాటు చేయాలనేది పరిశీలించి త్వరలో నిర్ణయం తీసుకుంటాం.

# వలస పోయిన మందహాసం



కువైట్ దక్షిణ ప్రాంతంలోని మంగఫ్ నగరంలో బుధవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో కనీసం 49 మంది ప్రాణాలు కోల్పోవడం, 50 మందికి పైగా గాయాల పాలవడం విషాదం. మృతుల్లో 43 మంది స్వదేశంలోని కుటుంబాలను పోషించడం కోసం కడుపు కట్టుకొని వలస వెళ్ళిన మన భారతీయులే కావడం మరింత విషాదం. వలస కార్మికులు ఎక్కువగా నివసించే ఆ ప్రాంతంలో ఆరంతస్థుల అల్-మంగఫ్ అపార్ట్‌మెంట్ల భవనంలో ఒక్కసారిగా రేగిన మంటలు ఇంతటి ఘోర ప్రమాదానికి దారి తీశాయి. కేరళ, తమిళనాడు, ఉత్తర భారతదేశం నుంచి వచ్చిన దాదాపు 200 మంది కార్మికులు నివసిస్తున్న ఆ భవనం మన కేరళకు చెందిన వ్యక్తిది కాగా, మృతుల్లో ఎక్కువ (24) మంది కేరళ వారే! చీకటి వేళ సంభవించిన ఈ అగ్నిప్రమాదంలో అత్యధికులు ఆ మంటలు, పొగలో చిక్కుకొని ఊపిరి ఆడక చనిపోయారు. ఓ వంట గదిలో మంటలు మొదలయ్యాయనీ, అవి భవనమంతటికీ వ్యాపించాయనీ స్థానిక మీడియా కథనం. ఈ ఘటనపై కూలంకషంగా దర్యాప్తు జరిపి, ఎవరు బాధ్యులనేది నిర్ణయిస్తామని కువైట్ చెబుతోంది. కారణాలు ఏమైనా బాధిత కుటుంబాల కన్నీళ్ళు ఆగేవి కావు. కష్టపడి నాలుగు రాళ్ళు ఎక్కువ సంపాదించి, ఊళ్ళోని కుటుంబాలను బాగా చూసుకోవాలని బయలుదేరిన పలువురి జీవితాలు అర్ధంతరంగా ముగిసిపోయాయి. కువైట్‌లో అగ్ని ప్రమాదాల చరిత్ర గమనిస్తే, 2009లో రెండో పెళ్ళి చేసుకుంటున్న తన భర్తపై ప్రతీకారంతో ఓ కువైట్ మహిళ వివాహ విందులో గుడారానికి నిప్పు పెట్టినప్పుడు 57 మంది చనిపోయారు. ఆ తర్వాత ఆ దేశంలో ఇదే అతి పెద్ద ఘోరకలి. 2022 మార్చిలోనూ కువైట్‌లో పేరున్న ముబారకియా మార్కెట్ వాణిజ్యప్రాంతంలో ఇప్పటిలానే అగ్నిప్రమాదం సంభవించింది. మళ్ళీ ఇప్పుడీ తాజా ప్రమాదం. జాగ్రత్తలు తీసుకుంటామంటూ అధికారులు చెబుతున్నా అవేవీ వాస్తవ రూపం ధరించడం లేదు. ఈ ఘటనల వెనుక స్థానికంగా అవినీతి, ఆశ్రిత పక్షపాతం, దురాశ లాంటివెన్నో ఉన్నాయనే వాదనలూ వినిపిస్తున్నాయి. ఒక్క కువైట్‌లోనే కాదు, మధ్యప్రాచ్యంలోని అనేక ప్రాంతాల్లోనూ వలస కార్మికులు అవస్థలు, వారి అమానవీయ జీవన పరిస్థితులు అనేకం. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వల్లో ఆరో స్థానంలో ఉన్న కువైట్ మొత్తం 42 లక్షల పైగా జనాభాలో స్థానికుల కన్నా పని చేయడానికి వలస వచ్చినవారే ఎక్కువ. ఆ దేశంలో మన ప్రవాసీయుల సంఖ్య పది లక్షల పైనే! ఇంకా చెప్పాలంటే, కువైట్ మొత్తం జనాభాలో 21 శాతం మనవాళ్ళే! అక్కడి శ్రామిక వర్గంలో 30 శాతం మంది మనమే. 1990 - 91లో గల్ఫ్ యుద్ధ ప్రభావంతో లక్షలాది భారతీయులు కువైట్ నుంచి వెనక్కి వచ్చేసినా, అనంతరం భారీగా తరలివెళ్ళారు. ఒకప్పుడు అధికంగా ఉన్న పాలస్తీనియుల్ని మనం మించిపోయాం. వడ్రంగులు, తాపీ మేస్త్రీలు, పనివాళ్ళు, డ్రైవర్ల దగ్గర నుంచి ఫుడ్, కొరియర్ బాయ్స్ దాకా కువైట్‌లో అధికశాతం భారతీయులే. ఇంజనీర్లు, డాక్టర్ల లాంటి వృత్తి నిపుణులున్నా ఎక్కువ మంది అన్-స్కిల్డ్, సెమీ స్కిల్డ్ కార్మికులే. ఇలాంటి కార్మికులకు అక్కడ డిమాండ్ ఎక్కువ. అందుకు తగ్గట్టే మన దేశంతో పోలిస్తే, అక్కడ ఆదాయమూ అధికమే. కువైట్, యూఏఈ, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, బహ్రెయిన్ అనే అరడజను గల్ఫ్ దేశాలకు మన వలసలకదే కారణం. తాజా ఘటనలో చనిపోయిందీ ఇలాంటి వలసజీవులే! అందరూ 20 నుంచి 50 ఏళ్ళ మధ్య వయసు వారే! కేంద్ర మంత్రి, కేరళ ఆరోగ్య మంత్రి సహా పలువురు హుటాహుటిన కువైట్‌కు పయనమయ్యారు. బాధిత కుటుంబాలకు కేంద్రం, కేరళ ప్రభుత్వాలు తోచిన నష్టపరిహారం ప్రకటించాయి. కానీ, కేవలం ఇది సరిపోతుందా అన్నది బేతాళ ప్రశ్న. కూలి కోసం, కూటి కోసం విదేశాలకు వెళ్ళి, అక్కడ సంపాదించిన సొమ్మును స్వదేశంలోని ఇంటికి పంపి, పరోక్షంగా మన ఆర్థిక వ్యవస్థ పురోగతికి అండగా నిలుస్తున్న తోటి భారతీయుల పట్ల మన అక్కర అంత మాత్రమేనా? గల్ఫ్ సహా వివిధ ప్రాంతాలకు వెళ్ళే వలస కార్మికులు వేల సంఖ్యలో ఉన్నప్పటికీ, ఇవాల్టికీ వీరి వెతల గురించి అక్కడి, ఇక్కడి ప్రభుత్వాలు పట్టించుకొనేది తక్కువే. వెళ్ళినవారు అనుకోకుండా ఏ చిక్కుల్లో పడినా, ఆఖరుకు ప్రాణాలే కోల్పోయినా ప్రవాస తెలుగు, తమిళ, మలయాళీ సంఘాల లాంటి ప్రైవేట్ సంస్థలే చొరవ తీసుకొని సాయపడుతున్నాయి. భారత ప్రభుత్వ లెక్కల ప్రకారం ఒక్క కువైట్‌లోనే 2014 నుంచి 2018 మధ్య 2932 మంది భారతీయులు మరణించారు. 2023లో 708 మంది చనిపోయారు. అనూహ్య ప్రమాదాలప్పుడు బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందించడమే తప్ప, అసలీ వలస కార్మికులు, ప్రవాస భారతీయుల కష్టనష్టాలను నిరంతరం గమనించేందుకు మనకంటూ ఇప్పటికీ పటిష్ఠమైన వ్యవస్థ, ప్రత్యేక మంత్రిత్వ శాఖ లాంటివి లేవు. అంతర్జాతీయ కార్మిక సంస్థ నిబంధనల మేరకు గల్ఫ్ వెళ్ళే భారత కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలనే భరోసా, కువైట్ వలస కార్మికులకు రూ. 10 లక్షల ప్రవాసీ భారతీయ బీమా పథకం ఉన్నా, విదేశాంగ శాఖలో నమోదు చేసుకొని, అన్ని పత్రాలూ ఉన్నవారికే అవి వర్తిస్తాయి. కానీ, అవేవీ పాటించకుండా పొట్టకూటి కోసం దళారుల్ని ఆశ్రయించి వెళ్ళే బడుగు జీవులే మన దగ్గర ఎక్కువ. పశ్చిమాసియాలోని మన వలస బిడ్డల సంపూర్ణ రక్షణకై ఇప్పటికైనా మన ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలి. సరైన నివాస వసతి సహా కనీస సౌకర్యాలతో జీవించే ఏర్పాటుకు అక్కడి ప్రభుత్వాలతో కలసి కృషి చేయాలి. ఆర్థిక వ్యవస్థను ప్రపంచ పటంలో ఉన్నతంగా నిలుపుతున్న ఈ కనిపించని శ్రామిక శక్తి పట్ల అది కనీస కర్తవ్యం. జీవితంలో వారు, దేశంగా మనమూ గెలవడం సరే... ముందు హుందాగా బతకడం ముఖ్యం.